ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

8-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 218 పేజీలు: 10+4 వెల: 6.50

ప్రత్యామ్నాయ వ్యూహాలతో భారత్ రెడీ

ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీకి రంగం సిద్ధం

5



## 'సీడాప్'తో 50 వేల విదేశీ ఉద్యోగాలు

### తొలిబ్యాచ్‌లో 171 మందికి శిక్షణ

### 40 జర్మనీ సంస్థలకు మంది ఎంపిక

### విదేశీ భాషలపై శిక్షణ ఇస్తున్నామన్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ (సీడాప్) ద్వారా 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్య,ఐటీ శ్రాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. సీడాప్,ఇండో యూరో సింక్రనైజేషన్ అండ్ జర్మన్ హెల్త్ కేర్ సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్న అంతర్జాతీయ ఉపాధి కల్పన పథకం కింద 14 మంది నర్సింగ్,ఆరోగ్య సంరక్షణ నిపుణులకు జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తూ కాల్ లెటర్స్ అందాయి. కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులను శనివారం ఉండవల్లి లోని నివాసంలో మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తొలి బ్యాచ్‌లో సీడాప్ ద్వారా 171 మందికి శిక్షణ ఇవ్వగా ఇప్పటికే వివిధ విభాగాల్లో 40 మంది ఎంపికయ్యారు. మరో 14 మంది త్వరలోనే జర్మనీ వెళ్తున్నారు. మిగతా వారికీ ఉద్యోగాలు లభిస్తాయి. అంతర్జాతీయ అవకాశాలను మన విద్యార్థులు అందిపుచ్చుకునే విధంగా సీడాప్-ఓంక్యాప్ ద్వారా విదేశీ భాషలపై శిక్షణ ఇస్తున్నాం. చదువుతో పాటు విదేశీ భాషల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. జర్మనీలో కొలువులు పొందిన ఒక్కొక్కరు మరో పదిమంది ఉద్యోగాలు సాధించేలా మార్గదర్శకం చేయాలి. ఈ నెలలో నైపుణ్య పోర్టల్‌ను ప్రారంభించబోతున్నాం. సమాజాభివృద్ధిలో >>2



# అంతర్జాతీయ బ్రాండ్ సృష్టించండి

### యువ పారిశ్రామిక వేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

### రాష్ట్రంలో వివిధ రంగాల్లో అపూర్వ అవకాశాలు

### అతిపెద్ద కారిడార్‌గా అమరావతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై

### ఏపిలో గ్రీన్ ఎనర్జి కారిడార్: సీఎం

**విజయవాడ సెప్టెంబరు7 ,ప్రభాతవార్త ప్రతినిధి:** పరిశ్రమల ద్వారా సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువ పారిశ్రామిక వేత్తలకు పిలుపు నిచ్చారు. భారత్ లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు. అగ్రి ప్రాసెసింగ్, పర్యాటకం, డిఫెన్సు, స్పేస్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్ ఇలా వేర్వేరు రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. విశాఖ చెన్నై మధ్య నాలుగు లేన్ల రైల్వే లైన్ ప్రాజెక్టుతో ఈ ప్రాంత పరిస్థితి పూర్తిగా మారుతుందని అన్నారు. సమీప భవిష్యత్తులో అమరావతి హైదరాబాద్ బెంగుళూరు చెన్నై అతిపెద్ద కారిడార్ గా మారుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్ మిషన్ కారిడార్ ఏర్పాటు కానుందని, అలాగే విశాఖలో గూగుల్ సంస్థ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని సీఎం తెలిపారు. వివిధ రంగాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వీలుగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో గత రాత్రిపోయిన తరువాత ఎంట్రప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ కు చెందిన యువ పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ప్రతీ జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడలకు సంబందించిన మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే పరిశ్రమలకు >>2



మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పే ఫోన్ దగ్గర విద్యార్థి

## గురుకులాల్లో పే ఫోన్లు

### కార్పొరేట్ సంస్థల తరహాలో టెలిఫోన్ బాక్సులు

### విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం

### నేడు పెనుకొండలో ప్రారంభించనున్న మంత్రి సవిత

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** "హాలో... అమ్మా... నాన్నా... బాగున్నారా..? నేను మీ చిన్నాను" అంటూ బీసీ బిడ్డలు తమ తల్లిదండ్రులకు ఫోన్లో రోజూ పలుకరించే అవకాశం అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని బీసీ సంక్షేమశాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. కళ్లెదుటే ఉండాల్సిన బిడ్డ ఎక్కడో దూరంగా గురుకులంలో ఉంటూ తింటున్నాడో.. లేదో..? బెంగతో మదనపడే తల్లిదండ్రులకు రోజూ తమ బిడ్డ పలుకరింపు వినే సదావకాశం కూటమి ప్రభుత్వం కల్పించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సౌకర్యార్థం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల్లో పే ఫోన్ పేరుతో టెలిఫోన్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో గురుకుల పాఠశాలలో ఆరు చొప్పున పే ఫోన్లు



ఏర్పాటు చేయబోతోంది. ఈ ఫోన్లను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత సోమవారం పెనుకొండ నియోజక వర్గం రొద్దం ఎంజేపీ స్కూల్లో ప్రారంభించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో 40 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కుటుంబానికి, తల్లిదండ్రులకు దూరంగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతుంటారు. నెలకో, రెండు నెలలకో తల్లీదండ్రి వస్తే వారితో కాసేపు మాట్లాడడం, వారు వెళ్లిపోయాక దిగాలు పడిపోవడం విద్యార్థులకు పరిపాటిగా మారిపోయింది. విద్యార్థుల మానసిక వేదనను గుర్తించిన ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ఫోన్ల ద్వారా తమ తల్లిదండ్రులు, బంధువులతో రోజూ మాట్లాడుకునే అవకాశం కలుగుతుంది. తరుచూ తల్లిదండ్రులతో మాట్లాడుతుండడం వల్ల విద్యార్థులకు ఇంటిపై ఉన్న >>2



## 13న మరో అల్పపీడనం

### 4 రోజుల్లో మళ్లీ వానలు

**విజయవాడ, సెప్టెంబరు7, ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమవాయవ్య దిశగా ఏపీ, ఒడిశా, తెలంగాణ వైపు కదిలే అవకాశముందనిన్నారు, దీని ప్రభావంతో ఈ నెలాఖరు వరకు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని పేర్కొంది. మరోవైపు రాబోయే 4 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని అమరావతి వాతావరణ విభాగం తెలిపింది. శుక్రవారం అనకాపల్లి, >>2



## మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

### అందుబాటులోకి రానున్న 1,000 పడకలు


### గుంటూరు జిజిహెచ్‌లో 500, కాకినాడ జిజిహెచ్‌లో 500

### రూ.128 కోట్ల వ్యయంతో రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వాస్పత్రుల్లో మాతా, శిశు వైద్య సేవలను విస్తరింపజేసి గర్భిణులు, నవజాత శిశువుల మరణాలను తగ్గించే కూటమి ప్రభుత్వ ప్రయత్నాల్లో ఒక పెద్ద అడుగు ముందుకు పడనుంది. గుంటూరు, కాకినాడ సర్వజన ఆస్పత్రు(జిజిహెచ్ )ల్లో రెండు నూతన ఎంసిహెచ్ (మదర్ అండ్ ఛైల్డ్ కేర్) బ్లాకుల ద్వారా సేవలను పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైంది.త్వరలో అందుబాటులోకి రానున్న ఈ రెండు బ్లాకుల్లో వైద్యసేవలందించడానికి అవసరమయ్యే వైద్య పరికరాలను, ఇతర అవసరమైన వస్తువులను రూ.51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు.**

గుంటూరు జిజిహెచ్ లో పూర్వ విద్యార్థుల (బిలీదితివితి) ఆర్థిక సహకారంతో రూ.86 కోట్లతో నిర్మించబడుతున్న నూతన ఎంసిహెచ్ బ్లాకు త్వరలో పూర్తి కానున్నది. దీనిలో 500 పడకల ద్వారా మాతా, శిశు వైద్యసేవలల్ని విస్తృతం చేయనున్నారు. ఇదే రీతిన, కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల (శిలీదితివితి) సహకారంతో రూ.46కోట్లతో నిర్మాణంలో వున్న మరో ఎంసిహెచ్ బ్లాకు కూడా త్వరలో పూర్తి కానున్నది. దీనిలో కూడా మరో 500 పడకలతో సేవలందించేదుకు వీలుంది .ఈ రెండు ఎంసిహెచ్ బ్లాకు ల ద్వారా సేవలందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, అనుబంధ సామ్రగిని రూ.51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతించారు. మొత్తం 332 రకాలకు చెందిన 5,687 పరికరాలు మరియు సామ్రగిని కొనుగోలు చేస్తారు. గుంటూరు జిజిహెచ్‌లో 37 రకాలకు చెందిన 1,187 పరికరాలను రు.23.51 కోట్లతో అందజేస్తారు. కాకినాడ జిజిహెచ్ లో 295 రకాలకు చెందిన 4,500 పరికరాలను రు.27.82 కోట్లతో ఏర్పాటు చేస్తారు.ఈ కొత్త బ్లాకుల కోసం పడకలు, బెడ్లు, ఐసియు బెడ్లు, పేషెంట్ మోనిటర్లు, వెంటిలేటర్లు, డీఫిబ్రిలేటర్లు, ఇసిజి మెషీన్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, మొబైల్ అల్ట్రా సౌండ్ మెషీన్లు, నిబులైజర్లు, డెలివరీ సెట్లు, ఆక్సీ మీటర్లు, ఫోటో థెరపీ యూనిట్లు, సర్జికల్ ఛైర్లు వంటి పలు రకాల వైద్య పరికరాలను భారీ స్థాయిలో కొనుగోలు చేయనున్నారు. ఈ రెండు ఆస్పత్రుల్లో ఎంసిహెచ్ బ్లకుల నిర్మాణానికి ముందుకొచ్చిన >>2



## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

### దూసుకొచ్చిన 800 డ్రోన్లు, క్షిపణులు

### చిన్నారి సహా ముగ్గురి మృతి

**క్యీవ్, సెప్టెంబరు 7:** ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి పెద్ద ఎత్తున దాడులుచేసింది. ఒకేసారి 800కి పైగాడ్రోన్లు,క్షిపణులుప్రయోగించింది. వార్‌ప్రారంభించాక ఈస్థాయిలో గగనతల దాడులుచేయడం ఇదే తొలిసారి. అలాగే తొలిసారి ఒక ప్రభుత్వ కార్యాలయం లక్ష్యంగాచేసుకుని రష్యా దాడులు చేసింది. ఉక్రెయిన్‌ప్రతినిధి యూరీ ఇన్హాత్ ఈ దాడులను ధృవపరిచారు. ప్రత్యర్థి రష్యా 13 క్షిపణులు కూడా ప్రయోగించిందని, 747 డ్రోన్లు, నాలుగు క్షిపణులను నేల కూల్చామని తెలిపారు.54 డ్రోన్లు, తొమ్మిది క్షిపణులు కీవ్ సహా దేశంలోని 37 ప్రాంతాలను తాకినట్లు ఆయన చెప్పారు. ఈ దాడుల్లో ఒక చిన్నారిసహా ముగ్గురు మృతిచెందారు. పదుల సంఖ్యలో పౌరులు గాయపడ్డారు. రష్యా దాడుల్లో >>2



ఆదివారం హైదరాబాద్‌లో కనిపించిన చంద్రగ్రహణం దృశ్యాలు

## కనువిందు చేసిన సంపూర్ణ చంద్రగ్రహణం

### భారత్‌సహా అనేక దేశాల్లో కనిపించిన వైనం

### దేశవ్యాప్తంగా మధ్యాహ్నం నుంచి మూతపడిన ఆలయాలు

### గ్రహణ సమయంలో ఎర్రగా కనిపించిన చంద్రుడు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7: ప్రభాతవార్త:** ఖగోళ అద్భుతంగా పిలువబడే సంపూర్ణ చంద్ర గ్రహణం ఆదివారం రాత్రి భారత్ సహా అనేక దేశాలలో క నువిందు చేసింది. ఆయా దేశాల కాలమానం ప్రకారం ఈ గ్రహణ వేళలు వుంటాయని అంతరిక్ష పరిశోధనా శాస్త్రవేత్తలు ఇప్పటికే ప్రకటించడం తె లిసిందే. భారత్‌లో రాత్రి 8.58 గంటలకు గ్రహణ ప్రారంభ సమయం కాగా పాక్షిక గ్రహణం మాత్రం 9.57 గంటలకు మొదలయ్యింది. చంద్రుడు పూర్తిగా గ్రహణ పరిధిలోకి వెళ్లిన సమయం రాత్రి 11 గంటలు. ఇక చంద్రుడు రాత్రి >>2

## 'సెట్'ల కౌన్సెలింగ్‌కు షెడ్యూలు విడుదల

### నేటి నుంచి ప్రక్రియ మొదలు

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లాసెట్,పీజీ లాసెట్,ఎడ్‌సెట్,పీఈసెట్,కింద ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్‌లకు ఉన్నత విద్యా మండలి షెడ్యూలు విడుదల చేసింది. వీటికి రెండు విడతల కౌన్సిలింగ్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంది. న్యాయ విద్యకు సంబంధించిన ఏపీ లాసెట్,పీజీ లాసెట్ ప్రవేశాల కౌన్సిలింగ్ ఈ నెల 8 నుంచి ప్రారంభించనున్నట్లు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి శనివారం తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 8-11 వరకు,ధృవపత్రాల పరిశీలనకు 9-12 వరకు,వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 12-14 వరకు, ఐచ్ఛికాల మార్పునకు 15న అవకాశం కల్పించినట్లు చెప్పారు. 17న సీట్ల కేటాయింపు,19న కళాశాలల్లో చేరేందుకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. బీఈడీలలో ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ కౌన్సిలింగ్ ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల9-12 వరకు,ధృవ పత్రాల పరిశీనకు 10-13వరకు, వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 13-15వరకు, ఐచ్ఛి >>2



## మహిళల వరల్డ్ కప్‌కు విశాఖ ఆతిథ్యం

### ప్రారంభోత్సవానికి మంత్రి లోకేష్‌కు ఆహ్వానం

### వైజాగ్ స్టేడియంలో ఐదు మ్యాచ్‌లు: ఏసిఏ కార్యదర్శి సానా సతీష్ బాబు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో తొలిసారిగా మహిళల వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఆదివారం వైజాగ్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఉమెన్స్ వరల్డ్ కప్ ట్రోఫీ ప్రదర్శన కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మహిళల వరల్డ్ కప్‌లో ఐదు మ్యాచ్‌లను వైజాగ్‌లో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాం" అన్నారు. విశాఖలో తొలిసారి జరుగుతున్న ఈ మ్యాచ్ చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన "బ్రేకింగ్ బౌండరీస్ విత్ నారా లోకేష్" కార్యక్రమం రాష్ట్ర క్రీడా అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10 సంవత్సరాల క్రీడా రోడ్‌మ్యాప్లో క్రీడా కోటాను 3 శాతంకు విస్తరించడం, క్రీడాకారులకు విద్యా-ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్యాంశాలుగా ఉన్నాయని ఆయన తెలియజేశారు. అక్టోబర్లో జరగనున్న వరల్డ్ కప్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించామని తెలిపారు. మిథాలీ రాజ్ మెంటార్‌గా, రాబోయే సెంటర్స్ ఆఫ్‌ఎక్సలెన్స్‌తో కలసి గ్రామీణ, పాఠశాలస్థాయి ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు సిద్ధమవుతాయని అన్నారు. మహిళల వరల్డ్ కప్ కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదు >>2



## ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీపై పిడుగులు

### భారీగా చెలరేగిన మంటలు.. భయాందోళనలో స్థానికులు

### అదుపులో పరిస్థితి: ఎమ్మెల్యే గణబాబు

**గాజువాక, సెప్టెంబర్ 7,ప్రభాతవార్త:** నెవల్ డాక్ యార్డ్ సమీపంలో ఈస్ట్ ఇండియా పెట్రోలింగ్ కంపెనీలోని పెట్రోల్ ఫిల్టరింగ్ ట్యాంక్‌పై పిడుగు పడి భారీ స్థాయిలో మంటలు ఎగిసిపడ్డాయి. ఒక ప్రక్క భారీ వర్షం...మరో ప్రక్క అగ్ని ప్రమాదం దింతో ఒక్కసారిగా సమీప పారిశ్రామికప్రాంతం లోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 3గం సమయంలో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సంస్థ తన ఉద్యోగులను బయటకు పంపించి అగ్నిమాపక శాఖ కు సమాచారం అందించింది. దింతో విశాఖ స్టీల్ ప్లాంట్ కు సంబందించిన ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక శకటాల సహాయంతో ఎగసిపడే మంటలను అదుపులోకి తీసుకొంచెందుకు తీవ్ర ప్రయత్నం చేసాయి. పిడుగు పడే సమయంలో ఫిల్టరింగ్ ట్యాంక్ సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దింతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే పి గణబాబు, అర్బర్ డివిజన్ ఏసీపీ కాళిదాసు, సిఐ గొలగాని అప్పారావు, పోలీసు సిబ్బంది సంఘటన ప్రదేశానికి చేరుకొని పరిస్థితితిని ఆరాతీసారు. ప్రజలు ఎవరు బయపడవలసిన >>2



ఆదివారం ముంబయిలోని జుహు బీచ్‌లో బీచ్ క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి భార్య అమృత దేవేంద్ర ఫడ్నవీస్

## అంతర్జాతీయ బ్రాండ్ సృష్టించండి

>> అవసరమైన నైపుణ్యం ఉన్న యువతను తయారు చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 33 శాతం పచ్చదనాన్ని 50 శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆయా దేశాల పేర్లను సూచించేలా పార్కులతో సుందరీకరణ చేపడుతున్నట్టు వెల్లడించారు. యువ పారిశ్రామిక వేత్తలు కొత్త రంగాల్లోకి అడుగుపెట్టి సత్తా చాటాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రస్తుతం నడుపుతున్న సంస్థలను మరింత వృద్ధిలోకి తేవాలని.. ఆంధ్రా ప్రెన్యూర్స్ అనే పేరు నిలబెట్టాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రభుత్వం రూపొందిస్తున్న పాలసీలను వినియోగించుకుని అంతర్జాతీయ స్థాయికి తమ సంస్థలను తీసుకెళ్లాలని సీఎం అన్నారు.

# రెండో తరగతి విద్యార్థినిపై టీచర్ ప్రతాపం

### బెత్తం దెబ్బలకు తోడు 100 గుంజీలు

### బాలికనడవలేని స్థితికి చేరడంతో ఫిర్యాదులు

### టీచర్ తొలగింపు.. హెడ్మాస్టర్ సస్పెన్షన్

**ప్రతాప్‌గఢ్, సెప్టెంబరు 7:** రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు దారుణంగా ప్రవర్తించాడు. క్లాస్ జరుగుతున్న సమయంలో టాయిలెట్ వెళ్లేందుకు అనుమతి అడిగినందుకు కర్రతో కొట్టారు. అంతటితో అగకుండా 100 గుంజీలు తీయించారు. దీంతో ఆ బాలిక నడవలేని పరిస్థితికి వచ్చింది. దీనిపై అధికారులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. ఛత్తీస్‌ఘర్‌లోని సర్గుజా జిల్లా ప్రతాప్‌గఢ్ ప్రాంతంలోని డీఏవీ ముఖ్యమంత్రి పబ్లిక్ స్కూల్‌లో సెప్టెంబర్ 5న జరిగింది. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని టాయిలెట్‌కు వెళ్లేందుకు టీచర్‌ను అనుమతి అడిగింది. ఫోన్ చూస్తున్న టీచర్ నమ్రతా సింగ్, ఆ విద్యార్థిని కర్రతో కాళ్లపై కొట్టి, 100 గుంజీలు తీయించారు. దీంతో బాలిక నడవలేక పోయింది. బాలిక పరిస్థితి చూసిన తల్లిదండ్రులు ఆరా తీయగా, స్కూల్‌లో జరిగిన విషయమంతా చెప్పింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు స్కూల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం వెలుగులో వచ్చింది. టాయిలెట్‌కు వెళ్లేందుకు అనుమతి అడిన విద్యార్థిని నమ్రతా సింగ్ అనే ఉపాధ్యాయుడు కర్రతో కొట్టాడని, 100 గుంజీలు తీయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుంజీలు తీసేటప్పుడు కూడా కొట్టారని చెప్పారు. దీంతో బాలిక కండరాలు గాయాల పాలై నిలబడలేని పరిస్థితికి చేరుకుందని ఆరోపించారు. దీనిపై మొదట ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశామని, అటువంటివి ఏం జరగలేదని చెప్పారని వాపోయారు. ఆ ఉపాధ్యాయుడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అందుకే పోలీసులును ఆశ్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు ఫిర్యాదు ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారి దినేశ్ ఝా భిలాయ్ డీఏవీ పబ్లిక్ స్కూల్స్ ప్రాంతీయ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ లేఖ ఆధారంగా టీచర్ నమ్రతా సింగ్‌ను వెంటనే విధుల నుంచి తొలగించారు. అలాగే, ప్రధానోపాధ్యాయుడు రాజీవ్ సింగ్ నిర్లక్ష్యగా వ్యవహరించినందుకు ఆయనను కొన్ని రోజుల పాటు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని దినేశ్ తెలిపారు.

## సంపూర్ణ చంద్రగ్రహణం

>> 11.41 గంటల సమయంల అత్యంత ఎర్రగా మారి, నారింజ రంగుతో కలిపి బ్లడ్ మూన్‌గా కనువిందు చేశాడు. సంపూర్ణ చంద్ర గ్రహణం అత్యధికంగా 82 నిమిషాల పాటు వుండడం గమనార్హం. ఇటీవల కా లంలో భారత్‌లో ఇంత సుదీర్ఘ సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించలేదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కాగా సంపూర్ణ చంద్ర గ్రహణం ముగింపు మొ దలైన సమయం అర్ధరాత్రి 12.22 గంటలు. గ్రహణం అర్ధరాత్రి 1.26 గంటలకు ముగిసినప్పటికీ పూర్తిగా ముగిసిన సమయం మాత్రి తెల్లవారుజా మున 2.25 గంటల సమయంలో కావడం గమనార్హం. దీని తరువాతే చంద్రుడు ఎప్పటిలాగే నిండు పున్నమిలా కనిపించాడు. సంపూర్ణ చంద్ర గ్ర హణం వ్యవధి మూడు గంటల 28 నిమిషాలు. సంపూర్ణ చంద్ర గ్రహణం వేళ భూమికి దగ్గరగా చంద్రుడు వుండడంతో సాధారణ పున్నమి రోజుల తో పోలిస్తే 30 శాతం ఎక్కువ ప్రకాశవంతంగా కనిపించాడు. ఇక సంపూర్ణ చంద్ర గ్రహణం దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే హిమాచల్ ప్రదేశ్, రాజస్తాన్, లడాఖ్, గుజరాత్, కూర్గ్ తదితర ప్రాంతాలలో స్పష్టంగా కనిపించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతాలలో వాతావరణ కాలుష్యం తక్కువగా వుండడం ఇందుకు కారణంగా అధికారులు తెలిపారు. ఢిల్లీ, ముంబాయి సహా మెట్రో నగరాలలో కాలుష్యం వల్ల చంద్ర గ్రహణం స్పష్టంగా కనిపించలే దని అధికారులు చెబుతున్నారు. తెలు గు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మినహా చాలా ప్రాంతాలలో చంద్ర గ్రహణాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు వీక్షించారు. ఇక దేశంలోని అనేకచోట్ల ఔత్సాహి కులు బైనాక్యులర్స్‌తో పాటు టెలిస్కోప్ సహాయంతో చంద్ర గ్రహణాన్ని వీక్షించారు. హైదరాబాద్‌లోని బిర్లా సెంటర్ సహా మరికొన్నిచోట్ల చంద్ర గ్రహణం వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 150కి పైగా దేశాలలో 85 శాతం మంది ప్రజలు చంద్ర గ్రహణాన్ని వీక్షించా రు. ఈ ఏడాది రెండవది, ఆఖరు చంద్ర గ్రహణం ఇది కావడం గమనార్హం. ఇదిలావుండగా సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా దేశ వ్యాప్తంగా అన్ని దేవాలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచే మూసివేశారు. తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతి, పద్మావతి, బెజవాడ కనకదుర్గ, శ్రీశైలం, యాదగిరిగుట్ట, బాసర, అన్నవరం, సింహాచలం, చిలుకూరు బా లాజి సహా అన్ని దేవాలయాలను మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల మధ్య దర్శనాలను ముగించి ప్రత్యేక పూజల తరువాత మూసివేశారు. సా ్వమివారు, అమ్మవార్ల దేవాలయాలకు కొన్నిచోట్ల తాళాలు వేశారు. శ్రీకాళహస్తి దేవాలయం మాత్రం రాహు, కేతువు కారణంగా తెరిచి వుంచారు. చ ంద్ర గ్రహణం కారణంగా దేశ వ్యాప్తంగా అనేకచోట్ల నదులు, సముద్రాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. కాగా సంపూర్ణ చంద్ర గ్రహణ ప్రభావం కుంభ, మిథున, సింహ రాశుల వారిపై వుంటుందని ఆగమన పండితులు చెబుతున్నారు.

## విదేశీ ఉద్యోగాలు

>> మహిలా సాధికారత కీలక పాత్ర పోషి స్తుంది. మహిళలను కించపర్చే సినిమాలను సైతం విడుదల కాకుండా అడ్డుకోవాలన్నదే తమ అభిమతం' అని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను మంత్రి లోకేష్ సన్మానించారు. వారికి ట్యాబ్‌లు అందించారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి,స్థానిక ఆసుపత్రుల్లో నెలకు రూ.15వేల నుంచి రూ.20 వేలకు పనిచేసే తమకు జర్మనీలో రూ.2.8లక్షల వేతనంతో ఉద్యోగం లభించడం కలగా ఉందని పేర్కొంటూ అభ్యర్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఉద్యోగాలు సాధించిన 14 మందిలో 9 మంది నిరుపేద ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు కాగా, ముగ్గురు బీసీలు ఉన్నారు. జర్మనీలో ఇవే ఉద్యోగాల కోసం కన్సల్టెన్సీలను శిక్షణ కోసం సంప్రదిస్తే రూ.8 లక్షల వరకు అడిగారని, అంత డబ్బు చెల్లించే ఆర్థిక స్తోమత తమకు లేదని పేర్కొన్నారు. సీడాప్ ద్వారా ఒక్క రూపాయి తీసుకోకుండా జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి,ఉద్యోగం వచ్చేలా చేశారని తెలిపారు. తమకలను సాకారం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను జీవితంలో ఎప్పటికీ మర్చి పోలేమన్నారు. ఈకార్యక్రమంలో సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి,సీఈఓ నారాయణస్వామి, నైపుణ్యా భివృద్ధిసంస్థఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

## 13న మరో అల్పపీడనం

>> విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పెరిగింది. కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కావలి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణో గ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోద య్యాయి. రాబోయే బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని చెప్పింది.మధ్య ప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడ నం కొనసాగుతోంది. ఇది పశ్చిమవాయవ్య దిశగా రాజస్థాన్, గుజరాత్ వైపు కదులుతూ ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. అనకాపల్లిలో సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. కొండకోపాక జాతీయ రహదారి వద్ద ఈదురు గాలులకు చెట్టు విరిగి పడిపోయింది. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అన కాపల్లి గ్రామీణ సీఐ అశోక్ కుమార్ సిబ్బం దితో వచ్చి చెట్టు తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. కోనసీమలోని పలు లంక గ్రామాల ప్రజలు వరదతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. 10 లంక గ్రామాల ప్రజలు గోదావరి నదీ పాయలను మరపడవల్లో దాటి రాక పోకలు సాగిస్తున్నారు.

## వారం - వర్జ్యం

08-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
కృ.పాడ్యమి రా.9.12
పూర్వాభాద్ర రా.8.02
వర్జ్యం : రా.8.33-10.30
దు.మ.12.31-మ.1.20,
2) మ.2.59-3.48
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** వాక్చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తిచేస్తారు.

**వృషభం:** దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విద్యార్థులకు అనుకూలమైన కాలం.

**మిథునం:**అనుకోని అవకాశాలు కలిసి వస్తాయి. విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం:**ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**సింహం:**ఊహించని రీతిలో అవకాశాలు దగ్గరకు వస్తాయి. సద్వినియోగం చేసు కోండి.

**కన్య :** అందరిలోనూ ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు.

**తుల :** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృశ్చికం:**రాజకీయ, పారిశ్రామిక వర్గాల వారికి అన్ని విధాలా ప్రోత్సాహం లభిస్తుంది.

**ధనుస్సు:** స్థిరాస్తి వ్యవహారాలు లాభిస్తాయి. కోర్టు వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మకరం:** గృహోపకరమైన పరికరాలు ఇవ్వవలసిన ఋణాలు మొదలయిన విషయాన్ని మీకు అనుకూలంగా మలుపు తిరుగుతాయి.

**కుంభం:** ఎవరినీ లెక్క చేయక మీ పనిని సక్రమంగా నిర్వహించి వృత్తి, ఉద్యోగాలలో లాభపడతారు.

**మీనం :** సంతాన క్షేమం పురోభివృద్ధి మానసిక ప్రశాంతత కలిగిస్తుంది. వస్తులాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గురుకులాల్లో పే ఫోన్లు

>> బెంగపోవడంతో పాటు విద్యపై దృష్టి సారించడానికి అవకాశం కలుగుతుందనేది ప్రభుత్వ భావన.

**రోజుకు రెండు గంటల మాత్రమే అవకాశం..**

రాష్ట్రంలో ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో ఆరు పే ఫోన్లు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. తల్లిదండ్రులు, బంధువులతో ఫోన్ లో మాట్లాడానికి రోజుకు రెండు గంటల సమయం కేటాయించనున్నారు. ఉదయం తరగతలు ప్రారంభానికి ముందు ఒక గంట, సాయంత్రం మరో గంట ఫోన్లో మాట్లాడానికి అవకాశం కల్పిస్తారు. ఆయా పాఠశాలల సౌలభ్యాన్ని సమయం నిర్ణయించుకునే అవకాశం ప్రిన్సిపాళ్లకు ప్రభుత్వం కల్పించింది.

**స్మార్ట్ కార్డుతో ఫోన్ చేసుకునే వీలు.**

విద్యార్థులకు ప్రభుత్వం ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్ కార్డులు అందజేస్తోంది. ఈ కార్డులకు రూ.10లు రీ ఛార్జి చేయాల్సి ఉంటుంది. ఒక్కో నిమిషానికి ఒక్కో రూపాయి వ్యయమవుతుంది. విద్యార్థులే తమ కార్డులకు రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి ఎన్ని పర్యాయాలైన స్మార్ట్ కార్డుకు రీఛార్జి చేసుకోవొచ్చు. తల్లిదండ్రులు సూచించిన నాలుగు ఫోన్ నెంబర్లు మాత్రమే ఆ స్మార్ట్ కార్డులో పొందుపరుచుతారు. విద్యార్థులు ఆ ఫోన్ నెంబర్లకు మాత్రమే ఫోన్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. విద్యార్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న పే ఫోన్లు దుర్వినియోగం కాకుండా ఉండేలా సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు.

**కార్పొరేట్ విద్యా సంస్థల తరహాలో.**

కార్పొరేట్ విద్యా సంస్థల్లో పే ఫోన్లు సౌకర్యం ఉంటుంది. ఇపుడీ అవకాశం ఎంజేపీ స్కూళ్లో చదువుకునే బీసీ విద్యార్థులకు వచ్చింది. ప్రభుత్వ పరిధిలోఉన్న మిగిలిన గురుకుల సంక్షేమ పాఠశాల్లో ఈ తరహా టెలిఫోన్ బాక్సులు ఇంకా ఏర్పాటు చేయలేదు. గురుకుల పాఠశాలల్లో చదివేదే అత్యధిక మంది పేద విద్యార్థులే. తమ బిడ్డలను చూసుకోవడం సుదూర ప్రాంతాల్లో ఉండే పేద తల్లిదండ్రులకు ఆర్థిక భారంతో కూడుకున్నది. పే ఫోన్ల ఏర్పాటుతో తమ బిడ్డలతో రోజూ మాట్లాడుకునే అవకాశం తల్లిదండ్రులకు, బంధువులకు, సంరక్షలకు కులుగుతుంది.

**ప్రభుత్వంపై భారం లేదు.**

110 గురుకుల పాఠశాల్లో ఏర్పాటు చేసే పే ఫోన్ల వల్ల ప్రభుత్వంపై ఎటువంటి భారమూ పడడం లేదు. ఎం.ఆర్.కె.ఆర్.ఐటీ సొల్యూషన్‌సంస్థ ఈఫోన్ల ఏర్పాటుకు ముందు కొచ్చింది. విద్యార్థులు చేసుకునే రీ ఛార్జే ఆ సంస్థకు ఆదాయంగా వస్తుంది. కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ ఇదే తరహాలో టెలిఫోన్ బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు.

**పే ఫోన్లతో విద్యార్థులకు మేలు..**

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా బీసీ హాస్టళ్లు, గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం పెట్టిన డైట్, కాస్మోటిక్ ఛార్జీల బకాయిలను అధికారంలోకి రాగానే చెల్లించాం. హాస్టళ్ల మరమ్మతులకు, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశాం. పౌష్టికాహారం అందజేయడంలో మెనూను సక్రమంగా అమలు చేయిస్తున్నాం.

విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నాం. ఇంటిలో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం నిధులు అందజేశాం. రూ.2,250ల విలువ కలిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు అందజేశాం. గురుకుల పాఠశాలల్లో కంప్యూటర్ లేబ్ లు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఎంజేపీ స్కూళ్లో చదువుకునే విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే లక్ష్యం. 110 ఎంజేపీ స్కూళ్లో పే ఫోన్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో మేలు కలుగుతుంది. తమ వారితో రోజూ మాట్లాడుకునే అవకాశం కలుగుంది. దీనివల్ల విద్యార్థుల్లో మానసిక ధృడత్వం పెరిగి విద్యపై మరింత దృష్టి పెట్టే అవకావం కలుగుతుంది.

# ఎర్రసముద్రగర్భంలో ఇంటర్నెట్‌కేబుల్ కట్

### భారత్ సహా పశ్చిమ, తూర్పు ఆసియాదేశాల్లో నెట్ సేవలకు అంతరాయం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** ఎర్ర సముద్రంలో సముద్రగర్భ కేబుల్ తెగిపోవడం వల్ల భారతదేశం, పశ్చిమ తూర్పు సహా ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం ఇంటర్నెట్ సదుపాయం అంతరాయం ఏర్పడింది. అయితే ఈ సంఘటనకు కారణమేమిటో వెంటనే స్పష్టంగా తెలియలేదు. ఎర్ర సముద్రంలో నీటి అడుగున ఆప్టిక్ కేబుల్స్ తెగిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇంటర్నెట్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇది మైక్రోసాఫ్ట్ అజూర్‌పై కూడా పెద్ద ప్రభావాన్ని చూపింది. ఎర్ర సముద్రంలో వేసిన కేబుల్ ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ యాక్సెస్ లో కీలక పాత్ర పోషిస్తోంది. యూరప్‌ఆసియా మధ్య నడిచే ఇంటర్నెట్‌లో ఎక్కువ భాగం ఈ వైర్లకు అనుసంధానించబడి ఉంటుంది. ఈ సమయంలో ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో 17% అంతరాయం కలిగించడానికి ఇదే కారణం. దెబ్బతిన్న కేబుల్స్‌లో సీకామ్, టిజిఎన్-ఇఎ, ఎఎఇ-1, ఇఐజి వంటి ప్రధాన వ్యవస్థలు ఉన్నాయి. ఇవి ఖండాల మధ్య డేటా ప్రవాహంలో ఎక్కువ భాగాన్ని అంతరాయం కలిగించాయని నిపుణులు చెబుతున్నారు. ఇంటర్నెట్ కేబుల్ విచ్ఛిన్నం మైక్రోసాఫ్ట్ వారి అజూర్‌పై పెద్ద ప్రభావాన్ని చూపింది. మైక్రోసాఫ్ట్ అజూర్ వినియోగదారులు ట్రాఫిక్‌లో, ముఖ్యంగా ఆసియాయూరప్ మధ్య సమస్యలను ఎదుర్కోవచ్చని తెలిపింది. కంపెనీ ప్రకారం, ఈ వైర్లను రిపేర్ చేయడానికి సమయం పట్టవచ్చు. కాబట్టి ప్రస్తుతం ఇతర మార్గాల ద్వారా డేటాను పంపుతున్నారు. వినియోగదారులపై ఈ సమస్య ప్రభావాన్ని తగ్గించడానికి టెక్నికల్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అయితే, కేబుల్స్ ఎలా తెగిపోయాయో అధికారులు ఇంకా కనుగొనలేకపోయారు. ఎర్ర సముద్రంలో జరిగిన మునుపటి సంఘటనలు తరచుగా వాణిజ్య నౌకలు వేసిన యాంకర్లు కారణంగా జరుగుతాయని చెబుతున్నారు. కానీ కొన్ని సందర్భాల్లో ఉద్దేశపూర్వక విధ్వంసం సరికి ఉండవచ్చని అంటున్నారు. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న వివాదం కారణంగా, ముఖ్యమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని, ప్రపంచ కనెక్టివిటీని ప్రభావితం చేస్తాయని నిపుణులు అనుమానిస్తున్నారు. దీంతో పాటు, యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలోని ఇంటర్నెట్ కేబుల్‌లను దెబ్బతీసే అవకాశం ఉందని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. గాజా యుద్ధాన్ని ముగించడానికి ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ఈ చర్య తీసుకున్నారని వారు అంటున్నారు. అయితే, హౌతీ తిరుగుబాటుదారులు దీని గురించి ఏమీ స్పందించలేదు. ఇంటర్నెట్ యాక్సెస్‌ను పర్యవేక్షించే కంపెనీ నెట్‌బ్లాక్స్, ఎర్ర సముద్రం కింద ఏర్పాటు చేసిన అనేక కేబుల్‌లలో సమస్యల కారణంగా, అనేక దేశాలలో ఇంటర్నెట్ కనెక్షన్ నెమ్మదిగా మారిందని తెలిపింది. ఇందులో భారతదేశంపాకిస్తాన్ కూడా ఉన్నాయి. సౌదీ అరేబియాలోని జెడ్డా సమీపంలోని ఎస్ఎండబ్ల్యు4, ఐఎంఇడబ్ల్యుఇ కేబుల్ వ్యవస్థలో లోపం దీనికి కారణమని కంపెనీ తెలిపింది.





న్యూఢిల్లీలోని శాస్త్రీ పార్క్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆదివారం ఆశ్రయం పొందిన ముంపుబాధిత ప్రజలు

## కౌసర్ క్రికెట్ గ్రౌండ్‌లో బాంబుదాడి.. ఒకరు మృతి

**కరాచి, సెప్టెంబరు 7:** పాకిస్థా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని ఓ క్రీడా మైదానంపై జరిగిన ఉగ్రదాడి తీవ్ర సంచలనం సృష్టించింది. బజౌర్ జిల్లాలోని ఖార్ తెహ్సాల్‌లో ఉన్న కౌసర్ క్రికెట్ గ్రౌండులో జరుగుతున్న ఒక క్రికెట్ మ్యాచ్‌పై ఉగ్రవాదులు బాంబు దాడికి పాల్పడ్డారు. ఈ దారుణమైన ఘటనలో ఒకరు మరణించగా పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన జరిగిన వెంటనే మైదానంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స కొనసాగుతోంది. భద్రతా బలగాలు, స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కౌసర్ క్రికెట్ గ్రౌండులో క్రీడాకారులు మ్యాచ్ ఆడుతున్నారు. దీన్ని చూసేందుకు అనేక మంది క్రికెట్ గ్రౌండ్‌కు చేరుకుని వీక్షిస్తున్నారు. ఈ సమయంలోనే ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పెద్ద ఎత్తున శబ్దం రావడంతో అక్కడనున్న వాళ్లంతా ఉలిక్కిపడ్డారు. అయితే ఇది ఐఈడీ ద్వారా జరిగిన లక్షిత దాడి అని బజౌర్ జిల్లా పోలీస్ అధికారి వాకస్ రఫీక్ ధృవీకరించారు.

## ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీపై పిడుగులు

>> అవసరంలేదని,వదంతులు నమ్మొద్దని,పరిస్థితి అదుపులోనే ఉందని ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని గణబాబు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కరణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## మహిళల వరల్డ్ కప్‌కు విశాఖ ఆతిథ్యం

>> - ఇది ఆంధ్రప్రదేశ్ క్రీడా పునరుజ్జీవనానికి సంకేతం అన్నారు . విశాఖ ఈవెంట్ ద్వారా క్రీడా పర్యాటకం, ఉపాధి, మహిళా క్రీడాకారుల అభివృద్ధి కొత్త దారులు తెరుస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయకుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గిరీష్ దొంగిరి తదితరులు పాల్గొన్నారు.

## మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

>> గుంటూరు మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా (బిలీదితివితి), కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా (ళిలీదితివితి)లను మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఈ బ్లాకుల నిర్మాణాలకు కృషి చేసిన ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు, సిబ్బందిని మంత్రి ప్రశంసించారు.

## 'సెట్'ల కౌన్సెలింగ్‌కు షెడ్యూలు విడుదల

>> కాల మార్పునకు 16న అవకాశం కల్పించారు. 18న సీట్ల కేటాయింపు,19,20 తేదీల్లో కళాశాలల్లో చేరేందుకు అవకాశం ఇచ్చారు.వ్యాయామ విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పీఈసెట్ కౌన్సిలింగ్ ఈ నెల 10 నుంచి జరగనుంది. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 10-13వరకు,ధృవపత్రాల పరిశీలనకు 11-14 వరకు,వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 14-16 వరకు,ఐచ్ఛికాల మార్పుకు 17న అవకాశం ఇచ్చారు. 19న సీట్ల కేటాయింపు 22,23 తేదీల్లో కళాశాలల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

>> క్యీవ్‌లోని మంత్రుల భవనం పాక్షికంగా ధ్వంసం అయింది. ఇందులో ఉక్రెయిన్ మంత్రుల నివాసాలు, కార్యాలయాలున్నాయి. శత్రుదేశం దాడిలో తొలిసారి ప్రభుత్వభవనం దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్‌ప్రధాని యూలియా స్వైరెదెన్కో తెలిపారు. భవనం మళ్లీ నిర్మించుకోవచ్చు. కానీ ప్రాణాలు తిరిగి తీసుకురాలేమని ఆవేదన వ్యక్తంచేసారు. ప్రపంచదేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ దాడులను తీవ్రంగా కండించారు. రాజకీయ కక్షతోనే క్రెమ్లిన్ ఇలా దాడులుచేస్తోందని, దృఢసంకల్పంతోనే అడ్డుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌కూడా రష్యాకు చెందిన డ్రుజ్బా చమురుపైప్‌లైన్‌పై ప్రతీకార దాడులుచేసింది.

# కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం లేదు: మంత్రి దుర్గేష్



**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై చేస్తున్నవి అసత్య ఆరోపణలు అని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్. అన్నారు.ఆయన తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పీపీపీ విధానం ద్వారా నిర్మాణాల్లో వేగం పెరుగుతుంది. నిర్మాణం పూర్తైన అనంతరం కాలేజీలపై నియంత్రణ, యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే..తద్వారా వైద్య విద్య ఎక్కువ మందికి అందుబాటులోకి వస్తుంది.పీపీపీ విధానంలో నిర్మిస్తున్న కొత్త మెడికల్ కాలేజీలతో పాటు ప్రతి మెడికల్ కాలేజీలో కనీసం 150 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా పెరిగే అవకాశం.వాస్తవాలను పక్కన పెట్టి రూ.8,500 కోట్ల విలువైన కాలేజీలను రూ.5,000 కోట్లకు బినామీలకు లీజుకు ఇస్తున్నారని వక్రీకరణ చేస్తున్నారు.వైద్య విద్య, ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం.ఆర్థిక సమస్యలతో మూలనపడ్డ కాలేజ్ లను మళ్లీ పిపిపి విధానంలో పట్టాలు ఎక్కించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.సుదీర్ఘ కసరత్తు చేసి కేబినెట్ లో సమగ్రంగా చర్చించి తీసుకున్న నిర్ణయాన్ని వైసీపీ తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పు దోవ పట్టించడం సరైన విధానం కాదుసెల్ఫ్ ఫైనాన్స్ విధానం అని మెడికల్ సీట్ల ఫీజును రూ.12 లక్షలు చేసి అమ్మకానికి పెట్టే విధానాన్ని తెచ్చిన గత ప్రభుత్వం నేడు పిపిపి విధానాన్ని తప్పు పట్టడం విచిత్రంగా ఉందితాము 17 మెడికల్ కాలేజీలు కడితే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేస్తుందని జగన్ చేస్తున్నది విష ప్రచారమన్నారు అన్ని కాలేజ్ లకు కలిపి రూ.8,500 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా వైసీపీ హయాంలో కేవలం 17 శాతం మాత్రమే ఖర్చు పెట్టారు.గత ప్రభుత్వ హయాంలో 5 కాలేజీలు నిర్మించినట్లు చెప్పుకొంటున్న కాలేజీల్లోనూ కనీసం సిబ్బందిని కూడా నియమించని వైనం. అందుబాటు లో లేని హాస్టళ్లు, అడ్మినిస్ట్రేషన్ విధానం. వాటిలో క్లాసులు కూడా ప్రారంభం కాలేదు. మరి మిగతా వాటి పరిస్థితి ఏంటి?:మంత్రి కందుల దుర్గేష్ ప్రశ్నించారుఅర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు:మంత్రి కందుల దుర్గేష్.. 2023- 24 విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో అరకొర వసతులతోనే కళాశాలలు ప్రారంభం.కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో పాడేరులో మెడికల్ కళాశాల ప్రారంభం అవుతుంది.మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పులివెందుల, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుకొండ కళాశాలల నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయమన్నారు..నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కాలేజీలను అప్‌గ్రేడ్ చేసి, ఏడాదిలో కనీసం ఒక్కో కాలేజ్ లో 100 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది:మంత్రి కందుల దుర్గేష్.పీపీపీ విధానంలో మెడికల్ కాలేజ్ లు పూర్తి చేసి సీట్లు అందుబాటులోకి తెస్తుంటే ప్రైవేట్ పరం అంటూ గగ్గోలు చేస్తున్న గత పాలకులకు విద్యార్థుల భవిష్యత్ పట్టదా?:మంత్రి కందుల దుర్గేష్. ప్రశ్నించారు.వైద్య విద్య పేద విద్యార్థులకు దూరం అవుతుందన్న ఆరోపణ పూర్తిగా అవాస్తవమన్నారు.

# తిరుమల సమాచారం

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షల విరాళం



**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడ్డిస్తున్న వెంగమాంబ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు విరాళమిచ్చాడు. ఆదివారం ఉదయం తిరుపతికి చెందిన తిరుమలతిరుపతి హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండి నాగరాజునాయుడు విరాళాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి నరసింహ



**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామసమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనం బాగా జరిగిందని, తిరుమలలో ఏర్పాట్లు బావున్నాయని తెలిపారు.

## 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### 15న విఐపి దర్శనాల సిఫార్సులకు బ్రేక్



**తిరుమల,సెప్టెంబరు 7 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు గాను ఈనెల 16వతేదీ మంగళవారం ఆలయంలో ఆలయ శుద్ది నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమ పవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ప్రతి ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి, ఆణివార ఆస్థానం ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. మంగళవారం అష్టదళపాదపద్మారాధన సేవరద్దుచేశారు. 16వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలు రద్దయ్యాయి.

## 22నుంచి తాతయ్యగుంట గంగమ్మకు నవరాత్రి మహోత్సవాలు



**తిరుపతి,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రాశస్త్యం కలిగిన, తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈనెల 22వతేదీ నుండి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. ఈ తొమ్మిదిరోజులు ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో గంగమ్మ భక్తులకు దర్శనమిస్తారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గంగమ్మ ఆలయంలో ఉభయదారులు భక్తులకు సేవలందిస్తారు. 22వతేదీ సోమవారం ఉదయం శుక్లపాడ్యమిరోజు మహాగణపతిపూజ, కలశస్థాపనతో ఆరంభమవుతాయి. 23వతేదీ మంగళవారం బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో, 24వ తేదీ గాయత్రిదేవి అలంకారం, 25న అన్నపూర్ణాదేవి ఆలంకారం, 26న మహాలక్ష్మీదేవిగా, 27న లలితాత్రిపురసుందరిదేవిగా, 28న వారాహిదేవిగా, 29న సరస్వతిదేవి అలంకారంలో, సెప్టెంబర్ 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1వతేదీ మహిషాసురమర్ధినీదేవి అలంకారంలో, 2వతేదీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో గంగమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో ఆ తొమ్మిదిరోజులు ప్రతిరోజూ ఉదయం 7గంటలకు అభిషేకం, 8గంటలకు హోమం, 9గంటలకు సహస్రనామార్చన, సాయంత్రం 6.30గంటలకు ఊంజల్‌సేవ ఉంటుంది. భక్తులు దేవీనవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఆలయ ఇఒ జయకుమార్ కోరారు.

## ప్రపంచ తెలుగు మహా సభలకు తమిళనాడు గవర్నర్ రవికి ఆహ్వానం

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో 3,4,5 జనవరి 2026 న నందమూరి తారక రామారావు వేదికపై గుంటూరు, అమరావతిలో నిర్వహించనున్న 3 వ ప్రపంచ తెలుగు మహాసభలకు తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి ని కలసి ఆహ్వానించినట్లు పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. తమిళనాడులోని హోసూరు, కోయంబత్తూర్, మదురై, చెన్నై , తంజావూర్, సేలం, తిరుత్తణి , కంచి, చిదంబరం పలు ప్రాం తాలనుండి తెలుగు మహా సభలకు తెలు గుప్రజలు హాజరు కానున్నారని గవర్నర్ ఆర్.ఎన్.రవికి డా.గజల్ శ్రీనివాస్ విన్నవించారు.

జనవరి 3 వ తేదిన ఉదయం 10గం టలకు జరిగే మహాసభల ప్రారంభోత్సవ సభకు విశిష్ఠ అతిథిగా వచ్చి తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు తమిళనాడు గవర్నర్ సుముఖత చూపారని డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు.

## ఫిజియో థెరపిస్టులకు మంత్రి సత్యకుమార్ శుభాకాంక్షలు

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఫిజియో థెరపిస్టులకు కూటమి ప్రభుత్వం శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రతి ఏటా సెప్టెంబర్ 8న ప్రపంచ ఫిజియో థెరపీ డేను జరుపుకుంటున్నారు. అన్ని జబ్బులూ మందులతో నయంకావు. కొన్ని జబ్బులకు ఔషధాలతో పాటు థెరపీ కూడా అవసరం. 1996 నుంచి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 8న అవగాహనా కార్యక్రమాల్ని నిర్వ హిస్తున్నారు. ఈ ఏడాది (2025) వృద్ధాప్యంఆరోగ్యం నినాదంతో కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. వృద్ధులకు ఫిజియో థెరపిస్టులందించే సేవలందించే సవలు ఎంతో ముఖ్యమైనవి. బలహీనపడిన కండరాలను బలోపేతం చేయడంలో వీరి సేవలు ఎంతో అవసరం. ఆర్థరైటిస్, వెన్నుపూస సమస్యలను, శరీరం అదుపు తప్పకుండా చేయడంలోనూ వీరందించే సేవల వల్ల మంచి ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధిలో కూడా వీరి సేవలు ప్రశంసనీయమన్నారు.

## ఇస్కో కిసాన్ సెజ్‌కు 2,776 ఎకరాలు

### పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాచర్లపాడులో కేటాయింపు, మరిన్ని పరిశ్రమలకూ భూములు

**విజయవాడ,సెప్టెంబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ఇస్కో కిసాన్ సెజ్ లిమిటెడ్ సంస్థకు భారీ పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు వీలుగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాచర్లపాడులో 2,776.23 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ ఇక్కడ రూ.870 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా,70 వేల మందికి ఉపాధి లభించనుంది. పలు సంస్థలకు భూములు కేటాయించేలా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, ఇంటిగ్రేటెడ్ రాకెట్ తయారీ, అసెంబ్లింగ్ ,టెస్టింగ్, స్టోరేజ్ ఫెసిలిటీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు వీలుగా తిరుపతి జిల్లాలో రౌతుసురమాల, బీఎస్‌పురం, కొత్తపాలెం గామల పరిధిలో 300 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ స్కైరూట్ ఏరోస్పేస్ రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 300 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలంలో ఆర్టిలరీ కమ్యూనికేషన్ షెల్, టీఎన్‌టీ ఫిల్లింగ్, మల్టీమోడల్ హ్యాండ్ గ్రెనేడ్ తయారీ యూనిట్ కోసం హెచ్ఎఫ్‌సిఎల్ సంస్థకు వెయ్యి ఎకరాలు కేటాయించారు. ఇక్కడ ఆ సంస్థ రూ.1040 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.

870 మందికి ఉపాధి లభించనుంది. జె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు ప్రైవేటు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం విశాఖ జిల్లా పెందుర్తి మండలం గుర్రంపాలెంలో 63.67 ఎకరాలు కేటాయించారు.

ఈ సంస్థ రూ.237.71 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇందులో 5 వేల మందికి ఉపాధి దక్కనుంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లోని నల్లమట్టిపాలెంలో ప్రైవేటు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు వీలుగా వరాహ ఆక్వా ఫామ్స్‌కు 93 ఎకరాలు కేటాయించారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ అంత్రపెన్యూర్స్ ఆఫ్ ఇండియాకు వైఎస్ ఎంఎస్ఎంఈ ఇంటర్నేషనల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు చిత్తూరు జిల్లా కుప్పం మండలం పాలర్లపల్లెలో 13.70 ఎకరాలు కేటాయించారు.

# చంద్రగ్రహణం ముందే శ్రీవారి ఆలయం తలుపులు మూత

### మధ్యాహ్నమే భక్తులు నిలుపుదల

### తిరిగి తెల్లవారు జామున పునఃప్రారంభం





తిరుమల శ్రీవారి ఆలయం తలుపులు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం మూత

**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణచంద్రగ్రహణం సంభవించడానికి కొన్ని గంటల ముందు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ తలుపులను ఆలయ అధికారులు, అర్చకులు, సన్నిధిగొల్ల మూసివేశారు. మధ్యాహ్నం వరకు క్యూలైన్లలో ఉన్న భక్తులందరినీ త్వరగా ఆలయంలోనికి అనుమతించి వెంకన్న దర్శనం చేయించారు. శనివారం సాయంత్రం నుండి వెలుపల క్యూలైన్లలో ఎవరినీ అనుమతించలేదు. ఆదివారం మధ్యాహ్నం 3.30గంటలకు బంగారువాకిలి తలుపులు, వెండివాకిలి, మహద్వారం తలుపులను మూసివేసి అర్చకులు వరుసగా తాళాలు వేశారు. ఆదివారం సాయంత్రం 3.30గంటలకు మూతబడిన తలుపులు తిరిగి నేటి వేకువజామున 3గంటలకు తెరిచేలా చర్యలు తీసుకుంటారు. ఈ సందర్భంగా ఆలయంలో పూర్తిగా అన్ని దర్శనాలను ముందుగానే రద్దుచేశారు. ప్రతిరోజూలాగే సోమవారం వేకువజామున 3గంటలకు ఆలయశుద్ధి, పుణ్యాహవచనం నిర్వహించిన అనంతరం శ్రీవేంకటేశ్వరస్వాకి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. కాగావేకువజామున 2గంటలకు భక్తులను వైకుంఠమ్ క్యూలైన్లలోనికి అనుమతించనున్నారు. ఆ తరువాత ఉదయం 6గంటల నుండి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభంకానుంది. గ్రహణం కారణంగా ఆదివారం 12గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసివేయడం పరిపాటి. ఆలయ తలుపులు మూసివేసిన కార్యక్రమాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పర్యవేక్షించారు. గ్రహణం ప్రబావంతో వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్‌లను మధ్యాహ్నం 12గంటలకే మూసివేశారు. అన్నప్రసాద భవనాన్ని మూసి వేయడంతో వెలుపల ఉన్నభక్తులకు 50వేల పులిహోరప్యాకెట్లను సిద్ధంచేసి సాయం త్రం అందించారు. 3గంటల వరకు 27,525 మంది భక్తులకు శ్రీవారిదర్శనం కల్పించారు. ఆలయంలోపల ఉపఆలయాలు, లడ్డూ వితరణశాలను మూసివేశారు. **తిరుచానూరు అమ్మవారి ఆలయం మూత:** చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయాన్ని ఆలయ అధికారులు, అర్చకులు మూసివేశారు. మధ్యాహ్నం 2.15గంటలకే ఆలయ తలుపులు మూసివేసి సోమవారం ఉదయం 4గంటలకు తెరుస్తారు. ఉదయం 8గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయ డిప్యూటీ ఇఒ పి.హారీంద్రనాథ్ తెలిపారు. అలాగే టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయం, అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయాల తలుపులను అధికారులు మూసివేశారు.

## బ్రహ్మోత్సవాల భద్రతకు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌లు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లు

### అన్ని అత్యవసర విభాగాలతో సమన్వయంగా సేవలు: ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు రెండు వారాల్లో మొదలు కానున్నాయని, అశేషంగా తరలివచ్చే భక్తుల భద్రతకు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లు మరిన్ని ఏర్పాటు చేసుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. అన్ని అత్యవసర విభాగాలతో కలసి సమన్వయంగా ఆ తొమ్మిదిరోజులు అవసరమైనసేవంలదించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రత, రద్దీనియంత్రణ, అత్యవసర సమయంలో భక్తులను కాపాడటం, వైద్యసేవలందించేందుకు మార్గాలు వంటి అంశాలపై ఆదివారం పోలీసు భవనంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 24వతేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంసిద్ధంకావాలన్నారు. గత సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ నియంత్రణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, గరుడసేవరోజు అనుసరించిన వ్యూహంతో చిన్నపాటి పొరబాట్లు, అవాంఛనీయ ఘటనలు లేకుండా చూడగలిగారన్నారు. ఈ సారి అదే వ్యూహంతో మరింత పటిష్టంగా ప్రణాళికాబద్ధంగా పోలీసు అధికారులు సిబ్బంది పనిచేయాలన్నారు. సమన్వయంతో విధులు నిర్వహించి భక్తులకు మెరుగైన సేవలందించాలని ఎస్పీ సూచించారు. తిరుమలలో స్థానికులు నివాసముంటే బాలాజీ నగర్‌తోబాటు పాపవినాశనం ప్రాంతంలో తరచూ నాకాబందీ తరహాలో తనిఖీలు చేయాలన్నారు.

ట్యాక్సీడ్రైవర్లు, జీపుడ్రైవర్లు భక్తులకు మర్యాదపూర్వక సేవలందించేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వారితో త్వరలోనే అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. తిరుమలలో భక్తులకు సేవాభావంతో సేవలందించాలని, అవసరమైన సమాచారం అందించేలా తర్ఫీదుఅవ్వాలన్నారు. కొండపై ఇన్నర్‌రింగురోడ్డు, ఔటర్‌రింగురోడ్డులపై బ్రహ్మత్సవాల సమయంలో డ్రోన్‌తో నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో వాహనదారులకు సూచనలు చేయాలన్నారు. అవసరమైన మేరకు అదనపు ట్రాఫిక్ ప్రాంతాలు గుర్తించి సమస్య లేకుండా చూడాలని తిరుమల డిఎస్పీ విజయశేఖర్‌కు ఎస్పీ సూచించారు. ఆలయం పరిసరాల్లో పటిష్ట భద్రత, నిఘా ఉంచాలన్నారు. నేరాల నియంత్రణకు పాస్‌లైన్, డివైస్‌లైవ్, స్కానర్స్‌ను ఫింగర్‌ప్రింట్స్‌ను ఉపయోగించాలని ఆదేశించారు. ప్రతి సెక్టార్ సిసికెమెరాలతోబాటు ఈ సారి సోలార్ సిసి కెమెరాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు.

రద్దీ సమయాల్లో అత్యవసర సేవలకు రోప్‌పార్టీ సిబ్బంది సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా వారికి జియోట్యాగింగ్ వేయాలన్నారు. టిటిడి విజిలెన్స్‌తో కలసి పోలీసులు సమన్వయంగా పనిచేసి విజయవంతం చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహారాచారి. రామకృష్ణ ,నాగభూషణం, డిఎస్పీ వెంకట నారాయణ, భక్తవత్సలం, శ్యామ్‌సుందర్, రామకృష్ణమాచారి, సిఐలు పాల్గొన్నారు.

## హిందూమత విధ్వంసానికి వైసిపి కుట్ర


### నందిగామ ఘటనపై బిజెపి నేతల మండిపాటు

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వినాయకుడి మందిరం సమీపంలో వైసీపీ నాయకులు ఇటీవల మాంసాహార భోజనాలు ఏర్పాటు చేయడంపై భాజపా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా దమనకాండను ఖండిద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి ఎక్స్‌లో స్పందించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రామతీర్థం, అంతర్వేదిలలో చోటు చేసుకున్న ఘటనలను ప్రస్తావించారు. పల్లెల్లోమత మార్పిళ్ళతో హైందవ మత ధ్వంస రచనను ప్రోత్సహించిన దుర్మార్గులు గణేశుడి మండపాల్లో మాంసాహారాన్ని పంపిణీ చేసిన సనాతన వ్యతిరేకులు అంటూ వైసీపీ నేతల పనితీరునే ఖండించారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసిన నందిగామ ఘటనకు భాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అనకాపల్లి ఎంపీ సిఎం రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. గణపతి మండపం పరిసరాల్లో మాంసాహార భోజనం వడ్డించి హిందువుల మనోభావాలను వైకాపా దెద్భతీసింది. ఇవన్నీ హిందూ సాంప్రతాయాలు, ఆచారాలు, విశ్వాలసాలపై వైకాపా చేస్తున్న నిరంతర దాడులకు నిదర్శనం అని ధ్వజమెత్తారునందిగామలో హిందువుల మనోభావాలను దెబ్బతీసి వైకాపా చర్య దారుణమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఎక్స్‌లో పేర్కొన్నారు. రామతీర్థంలో శ్రీరామ విగ్రహ ధ్వసం అంతర్వేదిలో రథ దహనం, వినాయక చవితి ఉత్సవాలపై ఆంక్షలు వైకాపా హిందూ వ్యతిరేక ధోరణికి నిదర్శనాలన్నారు. నందిగామ ఘటనకు భాధ్యతలైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కారుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వినాయకుడి పందిరి సమీపంలో వైకాపా నాయకులు మాంసాహార భోజనాలు ఏర్పాటు చేయడం హిందువుల మనోభావాలన్ని దెబ్బ తీయడమేనని మంత్రి నారా లోకేష్ మండిపడ్డారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. జగన్ హిందూ వ్యతిరేకి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని, మన సంస్కృతి, సాంప్రదాయాల్ని అవమానించే ఇలాంటి చర్యల్ని సహించబోమని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఎపిలో సంవిత్ పాఠశాల ప్రారంభించండి

### నిర్మలానందనాథ స్వామిని కోరిన మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లాలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠాన్ని ఆయన సందర్శించారు. క్షేత్రంలోని శ్రీకాల భైరవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహకులతో మాట్లాడి మఠం ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఈ క్షేత్రానికి 1,800 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ఈ మేరకు మఠం 72వ పీఠాధిపతి జగద్గురు నిర్మలానందనాథ స్వామి ఆశీర్వాదం పొందినట్లు లోకేశ్ స్పష్టం చేశారు. మఠం ఆధ్వర్యంలో పాఠశాలలు, మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, యూనివర్సిటీలను నిర్వహించడం గొప్ప విషయమని మంత్రి లోకేశ్ కితాబిచ్చారు. పాఠశాలల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థులకు ఎలాంటి ఖర్చు లేకుండా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్నట్లు మఠం నిర్వాహకులు ఆయనకు చెప్పుకొచ్చారు. ఇంటర్ పూర్తయిన తరువాత ఏ రాష్ట్రంలో డిగ్రీ చదవాలనుకున్నా మఠం ఆర్థిక సహాయం అందిస్తుందని వారు వివరించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోనూ పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సంవిత్ పాఠశాల ప్రారంభించాలని కోరినట్లు లోకేశ్ తెలిపారు. తన వినతికి పీఠాధిపతి జగద్గురు నిర్మలానందనాథ స్వామి అంగీకారం తెలిపినట్లు లోకేశ్ వెల్లడించారు.



నిర్మలానందనాథ స్వామి ఆశీర్వాదం అందుకుంటున్న నారా లోకేష్

## సాంస్కృతిక వికాసంపై నిరంతర దృష్టి అవసరం

### రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగిన విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం

### ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య



విజయవాడ ఉత్సవ్ వేదికపై నుంచి ప్రసంగిస్తున్న సౌమ్య

**విజయవాడ, సెప్టెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి మనిషి తన వారసత్వ మూలాలు, జీవన పరిణామ క్రమం, సాంస్కృతిక వికాసంపై నిరంతరం దృష్టి పెట్టాలని శాసనసభలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. మన గురించిన అవగాహన సామాజిక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు విజయవాడలోని పోరంకి మురళి రిసార్ట్స్‌లో ఆదివారం నాడు నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం రాజకీయ, సామాజిక ప్రముఖుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్. ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, శ్రీ రాం తాతయ్య తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం స్థానిక సంస్కృతి, సాంప్రదాయాలను ప్రదర్శించడంతో పాటు, ప్రజలను ఒకచోట చేర్చి సామాజిక సామరస్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు, సాహిత్య చర్చలు మరియు వివిధ సామాజిక కార్యకలాపాలు జరిగాయి. తంగిరాల సౌమ్య గారు తమ ప్రసంగంలో విజయవాడ యొక్క సాంస్కృతిక వైవిధ్యాన్ని కొనియాడారు. విజయవాడ ఎప్పుడూ సాంస్కృతిక, రాజకీయ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఇటువంటి ఉత్సవాలు మన సంప్రదాయాలను రక్షించడంతో పాటు, యువతకు మన సంస్కృతిని పరిచయం చేసే అవకాశం కల్పిస్తాయిఅని ఆమె అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను కూడా తంగిరాల సౌమ్య గారు ప్రస్తావించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రముఖ వ్యాపారవేత్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పోరంకి మురళి రిసార్ట్స్‌లోని అందమైన వాతావరణం, ఉత్సవ నిర్వహణలో చూపిన శ్రద్ధ కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చాయి. ఈ ఉత్సవం విజయవాడ నగరం యొక్క సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడంతో పాటు, రాజకీయ నాయకులు, ప్రజల మధ్య సమన్వయాన్ని పెంపొందించే వేదికగా నిలిచింది.

## ఉచిత బస్సుతో మహిళల సంతోషం

### కూటమి ప్రభుత్వం వచ్చిన 14 నెలల్లోనే 90 శాతం హామీలు నెరవేర్చాం: టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడి

**అనంతపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేసిన తర్వాత మహిళా మణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే 90శాతం హామీలు నెరవేర్చామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. కడపలో జరిగిన మహానాడుకు మించి అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సభ సూపర్‌హిట్ అవుతుందని ఆయన వెల్లడించారు. ఈ నెల 10వ తేదిన అనంతపుఉరంలో జరిగే సూపర్ సిక్స్ విజయోత్సవ సభను పురస్కరించుకుని జిఎంఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న సభకు సంబంధించి ఏర్పాట్లను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఇతర ఎమ్మెల్యేలు, ఎంపిలతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అమిలినేని సురేం ద్రబాబు, దగ్గుపాటి వెంకట ప్రసాద్, ఎంఎస్.రాజు, బండారు శ్రావణిశ్రీ, కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, గుంటూరు మేయర్ కోవెల మూడి రవీంద్ర, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారా యణరాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఏడిసిసి బ్యాంకు అధ్యక్షులు ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి జిల్లా నేతలు నరసానాయుడు, రామలింగారెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపా ధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టిడిపి, బిజెపి, జనసేనలు కలిసి కట్టుగా ఎన్నికలకు ముందు ప్రచారం చేశామని, ప్రజలకు నిర్దిష్టమైన హామీలు ఇచ్చామన్నారు.



అనంతపురంలో బహిరంగ సభ జరిగే ప్రాంతంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యేలు ఇతర నాయకులు

అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోపే 100 శాతం హామీలు నెరవేర్చడం అన్నది గతంలో ఎప్పుడు చూడలేదన్నారు. ముఖ్యంగా తల్లికి వందనం, ఆర్టిసి బస్సుల్లో ఉచితప్రయాణంపై ప్రతి మహిళ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే అనంతపురం భారీ బహిరంగ సభ ద్వారా ప్రజలకు తాము ఇచ్చిన హామీలు ఏ విధంగా అమలు చేశామన్నది చెప్పబోతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, మంత్రి నారాలోకేష్‌తోపాటు రాష్ట్రం లోని అందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, కూటమి పార్టీ నాయకు లందరూ హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్దంగా ఉన్నారన్నారు.

వార్త

జన్మనిచ్చిన తల్లిదండ్రులను పూజనీయులుగా చూడలేనివారు దైవారాధన చేయడం శుద్ధ దండగ.

-సెక్కర్

# ఆశలు అడియాసలాయెనే!

'అనుకున్నదొకటి, అయినదొకటి కాగా శ్వేత సౌధాధిపతి డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు తల పట్టుకుని కూర్చున్నారు. అగ్రదేశాల మధ్య ఆవేశకావేశాలు చల్లారుతున్నాయనుకున్న తరుణంలో ట్రంప్ వారితో సఖ్యతకోసం తాపత్రయపడకుండా మరో సారి సాటి అగ్రదేశాలతో గిల్లికజ్జాలకే ప్రయత్నిస్తుండటం విశేషం. పదేపదే మూడు యుద్ధాలను ఆపానని గొప్పగా చెప్పుకునే ట్రంప్ భారత్, రష్యాలపై అదనపు సుంకాలంటూ అదలించినా బెదిరించినా ఏదేశాధినేతా కాస్తయిన జంకలేదు. గతంలో ఏడు యుద్ధాలను ఆపినట్లు చెప్పిన నోటితోటే ఆయన మాట మార్చి అంకె తగ్గించి మూడుకు సరిపెట్టుకున్నారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం రాజీ కుదిరితే మాత్రం నాలుగు అనేవారే. వైట్‌హౌస్‌లో జరిగిన టాప్ టెక్ కంపెనీల సిఇఒల విందు సమావేశంలో ఆయన మాటలు విడ్డూరంగా తోచాయి. పరిష్కరించలేరని ఎంతో మంది అన్నా తాను పరిష్కరించగలిగానని గొప్పగా చెప్పుకున్నారు.ఈ మధ్య ఆయన మాటలు వింటుంటే అగ్రరాజ్యాధిపతి మాట్లాడాల్సిన మాటలేనా? ఇవి అన్నధోరణి వినిపిస్తోంది. ఇదోరకం వాచాలత. రష్యాతో భారత్‌మైత్రిని 'కటీఫ్' చేస్తే ఉక్రెయిన్ యుద్ధం ఆగుతుందని నమ్మకం కాలబోలు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యాక పుతిన్‌ను బెదిరించి లాభం లేదనుకున్నారో ఏమో! ఆ విషయాన్ని తేలికగా చెప్పేసారు. ఏ మాత్రం లౌక్యం లేకుండా ట్రంప్ చెప్పడాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. భారత్ ఎలానూ లొంగేట్టు లేదు. అయినా ఓ ప్రయత్నం చేశారు. అధిక సుంకాలు వడ్డిస్తానని హెచ్చరించారు. కానీ భారత్ దిగి రాలేదు. తాజాగా చైనాకు కూడా వల విసిరారు. బెదిరించారు. చైనా వాణిజ్యాన్ని దెబ్బకొట్టేందుకు చేయగలిగినదంతా చేశారు. అమెరికాకు చెందిన యాపిల్, గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్ సిఇఒలతో సమావేశమై ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టడం ఆపాలని కోరారు. 'విదేశాల్లో పెట్టుబడులు పెట్టడం ఇక చాలు. స్వదేశానికి వచ్చేయండంటూ' ఆయా కంపెనీలు అమెరికాలో పెట్టే పెట్టుబడుల సమాచారాన్ని పెట్టుబడి పెట్టగల సామర్థ్యాన్ని తెలుసుకుని మరీ సంతృప్తి పడ్డారు. ఇతర దేశాల్లో పెట్టుబడులు కుదరదంటూ వారి ప్రయత్నాలను భగ్నం చేశారు. ఇంత జరిగినా భారత్,రష్యాలు చైనా చెంతకే చేరాయని ట్రంప్ ఇట్లే గ్రహించారు. తన వ్యూహానికి దేశాలు పడలేదని అర్థం చేసుకోడానికి ఎంతో కాలం పట్టలేదు. భారత్, రష్యాలను చైనాకి దగ్గర చేసేందుకు ఉపయోగపడిన తన వ్యూహాత్మక తప్పిదాన్ని గుర్తుకు తెచ్చుకుని బాధపడ్డారు. ఈ విషయాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. ఇటీవల టియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోడీ,రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు భేటీకావడం ట్రంప్‌కు అసలు నచ్చినట్లు లేదు. ట్రంప్ ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. అదే విషయాన్ని ట్రంప్ తన అక్కసును సొంత వేదిక ద్వారా బయట పెట్టారు.ఆయా దేశాలకు తామెంతో సేవ చేసినట్లు స్నేహ హస్తమందించినట్లు చెప్పుకుంటూ ఆందోళన వెలిబుచ్చారు. చైనా విజయం కోసం పెద్ద సంఖ్యలో అమెరికన్లు మరణించారని, వారి పరాక్రమాన్ని, త్యాగాలను గుర్తుంచుకోవాల్సిన అగత్యం చైనాకు ఉందని గుర్తుచేయడాన్ని బట్టి చైనా భారత్ రష్యాలతో కలిసి సాగడం ఇష్టంలేదన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నందుకు పుతిన్, జిన్‌పింగ్‌కు శుభాకాంక్షలు తెలియచేస్తున్నట్లు ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మోడీ, జిన్‌పింగ్, పుతిన్‌లు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేస్తూ చేసిన వ్యంగ్యప్రస్తావనను బట్టి ట్రంప్ తన పాచిక పారలేదని ఆందోళన పడుతున్నట్లుంది. ఇదిలా ఉండగా ఆది నుంచి రష్యాచమురు కొనుగోలుపైభారత్‌ను పదేపదే హెచ్చరించిన అమెరికా పాలకులు తమ పట్టు వదిలి కిందకు రాలేదు. యుద్ధావేశాలు మరింతగా పెరిగాయి.తప్పితే ఏమాత్రం ఎవరూ దిగివచ్చే పరిస్థితి లేదు. వారి మధ్య ఎవరూ ఒడంబడికలు ప్రతిపాదించే స్థాయిలో లేరు. తీరా ట్రంప్ వ్యాఖ్యలు వింటేనే ఏ దేశమూ అంగీకరించేందుకు సిద్ధంగా లేదు.ట్రంప్ వందిమాగధులు కూడా సాటి అగ్రదేశాల పట్ల ముఖ్యంగా భారత్, రష్యాల పట్ల ఏ మాత్రం గౌరవప్రదంగా ప్రవర్తించే తీరులో లేరు. భారత్ పాలకులు వాషింగ్టన్‌ను ఎక్కువకాలం ధిక్కరించలేరని అమెరికా వాణిజ్యమంత్రి హవార్డ్ బట్నిక్ అంటున్నారు. కెనడా దేశం గతంలో అమెరికాతో గొడవపడి టారిఫ్‌లను ఎదుర్కొన్నా దిగిరాక తప్పలేదని అదే తరహాలో భారత్ తనవైఖరిని మార్చుకోనక తప్పదన్నారు.అంతే కాదు కేవలం ఒకటి, రెండు నెలల్లో భారత్ అమెరికాతో రాజీకి వస్తుందని, వారు క్షమాపణలు కోరతారన్న ఆశాభావంతో ఉన్నారు. 50శాతం సుంకాల నుంచితప్పించుకోడానికి భారత్‌కు ఒక అవకాశమిస్తున్నామంటూ అహంకారపూరితంగా అమెరికా పాలకులు గేలిచేస్తున్నారు. అగ్రదేశాలతో అమెరికా సంబంధాలను తన అహంభావానికి బలిపెడ్తూనే మరోపక్క మౌంట్ రష్మోర్‌లో అమెరికా జాతి నిర్మాణంలో దిగ్గజాలైన మాజీ అధ్యక్షులు జార్జ్‌వాషింగ్టన్, థామస్ జెఫర్సన్,థియోడర్ రూజ్‌వెల్ట్, అబ్రహాంలింకన్‌ల సరసన తన శిల్పంకూడా ఉండాలన్న ట్రంప్ ఆకాంక్షలకు చోటులభించే అవకాశం కనపడటం లేదు. ఆ పర్వతంపై మరో ముఖాన్ని చెక్కడం ఆచరణ సాధ్యంకాదని శిల్పులు తేల్చేశారు.ఆసియా దేశాలతో అమెరికన్‌ల ఆశలు, ఆకాంక్షలు తీర్చుకోవాలంటే ట్రంప్‌వైఖరిలో మార్పు అత్యవసరం.



జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు, ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవల్సిందే.

స్వామి వివేకానంద



మీరు చేయబోయే పని ఆధారంగా పేరు ప్రఖ్యాతులు పొందలేరు. చేసిన పని ద్వారా మాత్రమే.


హెన్రీఫోర్డ్

# అక్షరజ్ఞానం అందరి హక్కు

**ఏ దేశమైనా స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే 80 అక్షరాస్యత కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్షరాస్యత సాధనలో చిత్తశుద్ధిగా వ్యవ హరించాలి. నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసి, ఫలితాలు రాబట్టాలి. నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. అందరికీ విద్యచేరువ కావాలంటే ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలి. బాలికా విద్యను ప్రోత్సహించాలి. రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో నైతిక విలువల బోధనకు కేరళ తరహా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలి. సాంకేతికతను అందుపుచ్చుకొనేలాగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించాలి. అక్షరాస్యత మరింతగా పురోగమించాలంటే మౌలిక వసతులను విస్తృతం చేయాలి. బాలిక విద్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. అక్షరంతోనే అభివృద్ధి, అక్షరజ్ఞానం అందరి హక్కు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి.**

డా. షేక్. జాన్ పాషా

నేటి బాలలే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తు నిర్దేశకులూ వారే. జనాభాలో 27 శాతానికి పైగా ఉన్న 14 ఏళ్లలోపు బాలలకు విద్యాబుద్ధులు చెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. విద్య హక్కు చట్టంతోపాటు సమగ్ర శిక్షఅభియాన్, బేటీ బచావో, బేటి పడావో, మధ్యాహ్న భోజనం, పీఎం శ్రీ స్కూల్స్ , ఖేలో ఇండియా విద్యా కేంద్రాలు, ప్రయాస్ యోజన, ఇ.ఎం.ఆర్.ఎస్ స్కూల్స్, నవోదయ పాఠశాలలు, ఇన్స్పైర్ మనక్ పోటీలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది. చదువులకు దూరంగా ప్రాథమిక స్థాయిలో ప్రతి వంద మంది విద్యార్థుల్లో 29మంది మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే. ప్రపంచ సగటు అక్షరాస్యత 86.3 శాతం, భారత దేశంలో అది 74 శాతమేనని యునెస్కో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా మహిళల్లో అక్షరాస్యత మనదేశంలో తీసికట్టుగా ఉంది. ప్రతి ఏడాది సెప్టెంబర్ 8వ తేదీని అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ. 1966వ సంవత్సరం నవంబర్ 17వ తేదీన యునెస్కో సభ్య దేశాల విద్యాశాఖ మంత్రుల మహాసభ అనంతరం 1967వ సంవత్సరం నుండి మానవ హక్కుల గురించి ప్రపంచానికి గుర్తు చేయడం, మరింత అక్షరాస్యత స్థిరమైన సమాజంవైపు అక్షరాస్యత ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, అక్షరాస్యతను వ్యక్తులకు, సంఘాలకు అందించడం. ఇది పిల్లల్ల విద్య పైననే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరిస్తుందనే ముఖ్యోద్దేశంతో ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఈ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అందరికీ నాణ్యమైన, సమానమైన,సమ్మిళిత విద్యను అందించడానికి అక్షరాస్యత అభ్యాసాల ప్రాథమిక ప్రాముఖ్యతను పునరాలోచించడానికి యునెస్కో 1990 సంవత్సరాన్ని 'అక్షరాస్యత సంవత్సరం'గా ప్రకటించి, 2003-2012 దశాబ్దాన్ని 'అక్షరాస్యత దశాబ్దంగా' ప్రకటించింది.'లిటరసీ ఫర్ ఆల్, వాయిస్ ఆఫ్ ఆల్, లర్నింగ్ ఫర్ ఆల్' అనే అంశాల్ని ఈ దశాబ్ది లక్ష్యంగా నిర్దేశించింది. అక్షరాస్యత అనేది ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ కోసం ఐక్యరాజ్యసమితి 2030 ఎజెండాలో కీలకమైన అంశంగా పరిగణించబడింది. 7 సం.ల వయసు పైబడిన వారు ఏదో ఒక భాషలో చదవడం,రాయడం వస్తే వారిని అక్షరాస్యులుగా పరిగణిస్తారు. మహాత్మా జ్యోతిబా పూలే గారు చెప్పినట్లు 'మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే' అని, నోబెల్ బహుమతి గ్రహీత,నిరంతరం అక్షరాస్యత గూర్చి మాట్లాడే మలాల యూసఫ్ జాయ్ చెప్పినట్లు'ఒక పుస్తకం, ఒక పెన్ను, ఒక పిల్ల(వాడు), ఒక ఉపాధ్యాయుడు ఈ ప్రపంచాన్ని మార్చగలరు' అంటే అక్షర జ్ఞానం కలిగిన ప్రతివ్యక్తికి సమాజాన్ని మార్చగలిగే శక్తిఉంటుందని అర్థమవుతుంది. అలాగే ప్రపంచ దేశాల అక్షరాస్యత రేటును గమనిస్తే 100 అక్షరాస్యత సాధించిన ఫిన్లాండ్, లగ్జంబర్గ్, నార్వే,ఉక్రేన్, ఉజ్బెకిస్తాన్, నార్త్ కొరియా దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా, మెరుగైన జీవన ప్రమాణం కలిగిన దేశాలుగా మనగలుగుతున్నాయి. అదేవిధంగా మన భారతదేశ అక్షరాస్యత రేటును పరిశీలిస్తే 1951లో 18.3శాతం,2001లో64.8 శాతం, 2011లో 74 శాతంగా నమోదయ్యాయి. అత్యధిక అక్షరాస్యత సాధించిన రాష్ట్రాల్లో మిజోరాం (98.2)మొదటి స్థానం వహించగా లక్షదీప్, త్రిపుర, కేరళ, గోవాలుతర్వాత స్థానాల్లో ఉన్నాయి. 2025 సం.ఇటీవల ప్రకటించిన విధంగా అందరికీ విద్యను అందించి 98.2శాతం అక్షరాస్యతను సాధించిన మొదటి భారతీయ రాష్ట్రం మిజోరాం.




నిర్దేశించుకున్న లక్ష్యం 95 శాతం అయినప్పటికీనీ లక్ష్యాన్ని ఛేదించి సంపూర్ణ అక్షరాస్యత దిశగా పయనిస్తుంది. ప్రతి దశాబ్దానికి 10 శాతం అక్షరాస్యత పెరుగుతూ 100 శాతం అక్షరాస్యతను 2030 నాటికి సాధించేలాగా కేంద్ర ప్రభుత్వ అంచనాలుంటున్నాయి. భారతదేశ వ్యాప్తంగా డిజిటల్ అక్షరాస్యత రేటు 38 కుటుంబాలకే పరిమితం కాగా, కేరళ రాష్ట్రం సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించడం పట్ల యావత్ భారతదేశం ఆ దిశగా అడుగులు వేయబోతుంది. ముఖ్యంగా కేరళ రాష్ట్రం 14 సంవత్సరాలు పైబడినవారిని డిజిటల్ అక్షరాస్యులుగా మార్చడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని దాదాపు 83 లక్షల కుటుంబాల్లోని 1.5 కోట్ల మంది ప్రజలను సర్వే చేసి, సర్వేలో 21.88 లక్షల మంది డిజిటల్ నిరక్షరాస్యులుగా గుర్తించారు. వారిలో 21.87 లక్షల మందికి డిజిటల్ శిక్షణ ఇచ్చి, శిక్షణ పొందిన వారిలో 99.98 శాతం మంది విజయవంతంగా పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. 90 సంవత్సరాలు పైబడిన 15 వేల మందికి పైగా ఈ శిక్షణలో పాల్గొనడం హర్షించదగినగొప్పవిషయం. మనదేశంలో నిరక్షరాస్యులు 26శాతం మంది ఉన్నారు. ముఖ్యంగా పురుషుల కంటే మహిళల్లో నిరక్షరాస్యత, పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నది. ఈ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికై కేంద్ర ప్రభుత్వం 1988 సంవత్సరంలో జాతీయ అక్షరాస్యత మిషన్‌ను, 2009 సంవత్సరంలో ప్రత్యేకంగా మహిళ నిరక్షరాస్యత తగ్గించుటకై సాక్షర భారత్ (పఢ్ నా లిఖ్ నా అభియాన్) కార్యక్రమాన్ని, అంతేకాక 2022 సం.నుండి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిరక్షరాస్యులను,అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్రం 2027 లక్ష్యంగా'ఉల్లాస్' అనే కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఉంది. 'సబ్ కా వికాస్' ఇతివృత్తంతో కేంద్ర ఆర్థిక మంత్రి 2025-26 కేంద్ర బడ్జెట్ను ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ 50,65,345 కోట్లు కాగా దీనిలో విద్యారంగానికి 1,28,650 కోట్లు (2.54 ) కేటాయించి విద్యారంగ అభివృద్ధికై గేమ్ చెంజర్‌గా ఈ బడ్జెట్ నిలిచిందిగా చెప్పవచ్చు.ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ పెద్దలు ఎన్నికల మేనిఫెస్టోలో విద్యకు 15శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి,2023-24 మొత్తం బడ్జెట్ 2,90,396 కోట్ల రూపాయలుగా ఉంటే, దీనిలో విద్యారంగానికి కేవలం 6.7 శాతం మాత్రమే(19,093 కోట్ల రూపాయలు) కేటాయింపు జరిగింది. 2024-25 సం.పు మొత్తం బడ్జెట్ 2,91,159 కోట్ల రూపాయలుగా ఉంటే, దీనిలో విద్యారంగానికి కేవలం 7.31 శాతం (రూ.21,292 కోట్లు) మాత్రమే కేటాయింపు జరిగింది. ప్రస్తుత (2025-26) సంవత్సరపు మొత్తం బడ్జెట్లో (3,04,965 కోట్లు) విద్యారంగానికి 7.57 శాతం (23,108కోట్లు) మాత్రమే కేటాయించడం జరిగింది. 15 సంవత్సరాల వయస్సుపై పడిన నిరక్షరాస్యులైన వయోజనుల కొరకు న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారాఉల్లాస్ అనే ప్రాయోజిత కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యాశాఖ పర్యవేక్షణలో స్వచ్ఛంద సేవకుల సహకారంతో చేపట్టింది.రాష్ట్రంలోని మొత్తం అక్షరాస్యులు 206.97 లక్షలు. వీరిలో పురుష అక్షరాస్యులు 117.02లక్షలు,మహిళా అక్షరాస్యులు 89.05 లక్షలు అనగా ఇంకను 143.97 లక్షల జనాభా (33.46 ) నిరక్షరాస్యులుగానే ఉన్నారు.వీరిలో 12.45 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుటకై ఇటీవల టాస్, అడల్ట్ ఎడ్యుకేషన్, మెప్మా విభాగాల సహకారంతో,ఎస్సీ ఈఆర్టీ ద్వారా పుస్తకాల రూపకల్పన చేయబడి మంచిర్యాల జిల్లాలోని ఒక గ్రామాన్ని పైలట్‌ప్రాజెక్టుగా ఎంపిక చేసి కార్యరూపం దాల్చబోతోంది.భారతదేశ సామాజిక,ఆర్థిక పురోగతికి అక్షరాస్యత కీలకంగా మారింది.ఏ దేశమైనా స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే 80 అక్షరాస్యత కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్షరాస్యత సాధనలో చిత్తశుద్ధిగా వ్యవహరించాలి. నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసి, ఫలితాలు రాబట్టాలి. నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. అందరికీ విద్యచేరువ కావాలంటే ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలి. బాలికా విద్యను ప్రోత్సహించాలి. రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో నైతిక విలువల బోధనకు కేరళ తరహా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలి. సాంకేతికతను అందుపుచ్చుకొనేలాగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించాలి. అక్షరాస్యత మరింతగా పురోగమించాలంటే మౌలిక వసతులను విస్తృతం చేయాలి. బాలిక విద్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. అక్షరంతోనే అభివృద్ధి, అక్షరజ్ఞానం అందరి హక్కు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి.

# శాంతి చర్చలు హుళక్కేనా?

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రెన్ యుద్ధం రోజు రోజుకు ఉధృతమవుతూనే ఉంది. శాంతి చర్చలు ఏమి ఫలవంతం కావడం లేదు. రెండు దేశాలు పట్టు వీడటం లేదు. ఈ దిశలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న కృషి ఒక కొలిక్కి రావడం లేదు. యుద్ధం ఆగాలి అనే అతని ఆశయం గొప్పది. అయితే రష్యా మాత్రం కీవ్ పై ఆధిపత్య ధోరణే ప్రదర్శిస్తోంది. తాజాగా ఉక్రెన్‌పై 598 డ్రోన్లతో, 31 క్షిపణులతో భీకర దాడి చేసింది. ఈ దాడిలో ఉక్రెన్ బీతిల్లింది. ఈ దాడిని చూసి ఉక్రెన్ తీవ్ర నిరసన తెలియచేసింది. శాంతి చర్చలకు రష్యా ఆటంకాలు కల్పిస్తోందని జెలెన్స్కి ఆరోపించారు. రష్యా చేసిన ఈ దాడిలో అందమైన భవనాలు కూలిపోయాయి ముఖ్యంగా ఉక్రెన్‌లోని పెద్ద నగరంఅందవిహీనంగా మారింది. మేము ఈ దాడిని చూస్తూ ఊరుకోలేదు. రష్యా డ్రోన్‌లను కూల్చివేశాం అని ఉక్రెన్ పేర్కొంది. రష్యాను దెబ్బ తీయాలనే జెలెన్ స్కి భావిస్తూ ఉన్నాడు. శాంతి చర్చల గడువు కూడా రష్యా అతిక్రమించింది. శాంతి ప్రయత్నాలు అన్నీ విఫలం అయ్యాయి అని ఉక్రెన్ పేర్కొంది. ఉక్రెన్ కూడా డ్రోన్లతో దాడి చేస్తోంది, అయితే ఉక్రెన్ దాడిని రష్యా ధీటుగా ఎదుర్కొంది. కాని ఉక్రెన్ మాత్రం రష్యా లోని క్రాస్ నోడార్ లోని అఫిప్స్కి చమురు శుద్ధి కేంద్రం పై డ్రోన్ దాడి చేసి నష్టం కలిగించిదని భోగట్టా. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ సంక్షోభానికి పశ్చిమ దేశాలు, నాటో కూటమి పూర్తి బాధ్యతవహించాలని సంచలన ఆరోపణలు చేశారు. చైనాలోని తింజియన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో ప్రసంగిస్తూ ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చే ప్రయత్నాలే ప్రస్తుత యుద్ధానికి కారణమని ఆయన స్పష్టం చేశారు. పుతిన్ తన ప్రసంగంలో ఉక్రెయిన్ సంక్షోభం రష్యాఆక్రమణ వల్లకాదని, 2014లో పశ్చిమ దేశాల మద్దతుతో కీవ్‌లో జరిగిన మైదాన్ తిరుగుబాటు ఫలితమని పేర్కొన్నారు. ఈ తిరుగుబాటు రష్యా అనుకూల అధ్యక్షుడు విక్టర్ యాంకోవిచ్‌ను అధికారం నుంచి తొలగించి నాటో అనుకూల రాజకీయ నాయకత్వాన్ని స్థాపించడానికి దారితీసిందని ఆయన ఆరోపించారు. ఉక్రెయిన్‌ను నాటోలు చేర్చే పశ్చిమ దేశాల ప్రయత్నాలు రష్యా భద్రతకు సిద్ధంగా ముప్పు కలిగిస్తున్నాయని ఒకదేశం భద్రత కోసం మరొక దేశాన్ని బలిచేయడం సమర్థనీయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పుతిన్ ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారానికి చైనా, భారత్‌లు చేస్తున్న ప్రయత్నాలు అభినందించారు. అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో ఏర్పడిన అవగాహనలు శాంతి మార్గాన్ని సుగమం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశ వివరాలను చైనా అధ్యక్షుడు షి జిన్ పింగ్‌తో సహా ఇతర నాయకులతో పంచుకున్నట్లు తెలిపారు. ఇలా ఈ దేశాలు యుద్ధలపైనే దృష్టి కేంద్రికరించాయి కాని దేశ సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా విస్మరించాయి. వాస్తవంగా రెండు దేశాలలోని సైనికులు పూర్తి గా నిరసించిపోయారు. ఈ యుద్ధం 2022,ఫిబ్రవరి 24 న మొదలయింది. ఇంత వరకు ఫలితం శూన్యం. ఎవరిది పై చేయి అనేది అర్థం కాకుండా ఉంది. తరచి చూస్తే ఉక్రెన్‌కు భారీ నష్టం కలిగిందని అనుకోవచ్చు. వివిధ దేశాధినేతలు శాంతికి నడుం బిగించినా అవి ఫలించలేదు. శాంతి సంస్థ అయిన ఐక్యరాజ్య సమితి సైతం చేతులెత్తేసింది. దాని బాధ్యతను అగ్రరాజ్యం తీసుకున్నా దాని మాటలు రష్యా,ఉక్రెన్ దేశాలు అమలు పరచడం లేదు. శాంతి చర్చలు ఇలా ఫలితం ఇవ్వకుండా పోవడం అగ్రదేశాధినేత ప్రయత్నాలకు గండి పడటం శోచనీయం. భారత్‌ను సందర్శించాలని మోదీ, జెలెన్స్కిని కోరడం, భారత్ యుద్ధం ఆపుతుందని సాంకేతాలు విలు వడుచున్నాయి. ఉక్రెన్ ఊహించినట్లుగా భారత ప్రధాని మోదీ అటు రష్యా పక్షం కాదు, ఇటు ఉక్రెన్ పక్షం కాదు. యుద్ధం ఆగాలి అనే తపన మోదీకి ఉంది. అందుకే పలు మార్లు ఇది యుద్ధాలా యుగంకాదు అని చెప్పడం గమనార్హం. జెలెన్ స్కి, మోడీ మాటవింటే యుద్ధం ఆగుతుందేమో చూడాలి. ఏది ఏమైనా జెకెన్ స్కి భారత్‌కు వస్తే చర్చలు ఫలించవచ్చని కోరుకుందాం. ఉక్రెన్ అటు అగ్రదేశం మాటలు, ఇటు భారత్ మాటలు వింటే కొంత ప్రగతి కనపడుతుంది. లేకపోతే ఎన్ని శాంతి చర్చలు జరిగినా నిష్ప్రయోజనమే అవుతాయి.

# వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించేదెవరు?

డి జె మోహన రావు

భారతదేశ వీధులు కేవలం ప్రయాణ మార్గాలు మాత్రమే కాదు, అవి చిన్న వ్యాపారాలకు, ఆశలకు,కలలకు నిలయాలు. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో, వీధి వ్యాపారులు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారు. వీరు కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను నడిపించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వీధులు, మార్కెట్లు, బస్‌స్టాప్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద ఆహార పదార్థాలు,దుస్తులు, గృహోపకరణాలు, పండ్లు, కూరగాయలు, చేతివృత్తుల వస్తువులు వంటివి విక్రయిస్తూ వీరు సామాన్య ప్రజల దైనందిన అవసరాలను తీరుస్తున్నారు. వీరు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కీలక భాగం. దేశఆర్థిక వ్యవస్థకు అనేక విధాలుగాసహాయం చేస్తున్నారు. భారతదేశంలో అతిపెద్ద అసంఘటిత రంగాలలో లక్షలాది మందికి స్వయం ఉపాధి కల్పిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన వారికి, నిరుద్యోగులకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి ఇది ఒక ప్రధాన ఉపాధి మార్గం. ఈ రంగం సుమారు1.5 కోట్లకు పైగా ప్రజలకు జీవనోపాధి కల్పిస్తున్నట్లు అంచనా. చిన్న మొత్తాల్లో తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నప్పటికీ, వారు ఆర్థిక వ్యవస్థకు భారీగా దోహదం చేస్తున్నారు.మొత్తం వార్షిక టర్నోవర్ వేల కోట్ల రూపాయలలో ఉంటుంది. వీరు అందించే తక్కువ ధరల వస్తువులు, సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటాయి.ఫలితంగా వినియోగం పెరుగుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుంది. వీరిలో ఎక్కువ మంది మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ఉన్నారు. వీరు తమ వ్యాపారాల ద్వారా స్వతంత్రంగా జీవించగలుగుతున్నారు. దీనివల్ల సామాజిక సమానత్వం, ఆర్థిక సాధికారత సాధ్యమవుతుంది. వీధి వ్యాపారులు భారత జీడీపీకి ఎంత దోహదపడుతున్నారు అనేదానికి ఖచ్చితమైన గణాంకాలు లేనప్పటికీ అనేక అధ్యయనాలు దీనికి సంబంధించిన అంచనాలను తెలియజేస్తున్నాయి. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం, వీధి వ్యాపారులు దేశ జీడిపిలో 4 నుంచి 5 వరకుభాగస్వామ్యం వహిస్తున్నారు. ఈ గణాంకాలు ఈ రంగం ప్రాముఖ్యతను స్పష్టంగా చూపిస్తున్నాయి. అయితే వీరు తమ కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు కొన్ని కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వీధి వ్యాపారులకు చట్టపరమైన గుర్తింపు, భద్రత లేకపోవడం ప్రధాన సమస్య. పోలీసులు, మునిసిపల్ అధికారులు తరచుగా వారిని తొలగిస్తుంటారు. వారు



ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారి సామాగ్రిని జప్తు చేయడం, జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకుంటారు. ఇది వారి జీవనోపాధిపై తీవ్రప్రభావం చూపుతుంది. వీధి వ్యాపారులకు వ్యాపారం కోసం నిధులు అవసరం. అయితే వారికి అవసరమైన రుణాలు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి లభించవు. దీంతో వారు అధిక వడ్డీకి అప్పులు తీసుకోవాల్సి వస్తుంది. ఇదివారిని ఆర్థికంగా మరింత బలహీనపరుస్తుంది. వీరికి నీటి సౌకర్యం, టాయిలెట్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు చాలా చోట్ల అందుబాటులో లేవు. ముఖ్యంగా మహిళా వ్యాపారులకు ఇది పెద్ద సమస్య. ఇది వారి ఆరోగ్యానికి, భద్రతకుముప్పు కలిగిస్తుంది. సమాజంలో వీధి వ్యాపారులను తక్కువగా చూడడం అనేది ఒక ప్రధాన సామాజిక సమస్య. ఈ కారణంగా వారు అనేక అవమానాలను ఎదుర్కోవలసి వస్తుంది. రాజకీయ, సామాజిక ఒత్తిళ్లు వారి వ్యాపారానికి ఆటంకం కలిగిస్తుంటాయి. సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకుంటున్నాయి. దీనిలో ప్రధానమైనది వీధి వ్యాపారుల (జీవనోపాధి పరిరక్షణ, వీధి వ్యాపారం నియంత్రణ) చట్టం2014. ఈ చట్టం వీధి వ్యాపారులకు చట్టబద్ధమైన గుర్తింపు, రక్షణ కల్పిస్తుంది. ఈ చట్టం కొన్ని ముఖ్యమైన ప్రణాళికలను అమలు చేస్తుంది. ఈ చట్టం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి వ్యాపారులకు సర్వే చేసి, గుర్తింపు కార్డులు జారీ చేయాలి. ఈ కార్డుల వల్ల వారికి ఒక నిర్దిష్ట ప్రదేశంలో వ్యాపారం చేసుకునే హక్కు లభిస్తుంది. పట్టణాల్లో టౌన్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలు వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించడానికి, వారికి వ్యాపారం చేసుకోవడానికి అనువైన స్థలాలను కేటాయించడానికి కృషి చేస్తాయి. వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకాన్ని అమలు చేస్తుంది. దీని కింద వీధి వ్యాపారులు బ్యాకుల నుండి ఎటువంటి పూచీకత్తు లేకుండానే రుణాలు లభిస్తాయి. వీధి వ్యాపారులు కేవలం వ్యాపారులు మాత్రమే కాదు, వారు మన సంస్కృతి, జీవన శైలిలో అంతర్భాగం. భారత ఆర్థిక వ్యవస్థకు వారి దోహదం గణనీయమైనది. అయితే, వారికి భద్రత, ఆర్థిక సహకారం,గౌరవం అందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు, పథకాలు సరైన మార్గంలో సాగుతున్నాయి. అయితే వీటిని మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. రాష్ట్రప్రభుత్వాలు,స్థానిక సంస్థలు ఈ చట్టాలను, పథకాలను వీధివ్యాపారులకు చేరువయ్యేలా కృషి చేయాలి. ఈ రంగాన్ని సంఘటితం చేసి, వారికి మరింత తోడ్పాటును అందించగలిగితే, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా, సమగ్రంగా వృద్ధి చెందుతుంది. దినితో అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలు మెరుగుపడతాయి. ఇది నిజమైన అభివృద్ధికి దారి తీస్తుంది.

# ప్రజావాక్కు



## ఉన్నత వర్గాల వారికే ఉద్యోగాలా..

నిజానికి మ్యాథమెటిక్స్ ఎప్పుడూ ఇంగ్లీష్ మీడియంలోనే ఉన్నది. మాతృభాషలో అర్థం అవడానికి వీలుగా కొన్ని పదాలను కలుపుతూ ఉంటారు. ఇంగ్లీష్ టీచర్లు కూడా లెసన్స్ ఇంగ్లీష్ టు ఇంగ్లీష్‌లో చెప్పకుండా మాతృభాషలో ట్రెడిషనల్ టీచింగ్ ట్రాన్స్‌లేషన్ మెథడ్‌లోనే విద్యార్థినీ విద్యార్థులకు చేరువ కావడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ప్లస్,మైనస్,ఈజీ ఈక్వల్ టు,ఎస్క్వేర్, బి స్క్వేర్ మొదలగు పదాల్ని తెలుగులో ఎవరూ చెప్పలేరు.అవి ఇంగ్లీషులోనే చెబుతారు. ఫిజిక్స్ కూడా తెలుగు పదాలతో చెప్పలేరు సాధ్యమైనంతవరకు ఇంగ్లీష్‌పదాలతో ఇంగ్లీష్ మీడియంలోనే చెబుతారు. నవోదయ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మ్యాథమెటిక్స్ సైన్స్ ఇంగ్లీష్ మీడియంలో చెబుతూ సోషల్ స్టడీస్ మాతృభాషలో చెబుతారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఖచ్చితంగా ఇంగ్లీష్ మీడియంలోనే ఉండాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పెరుగుతున్న పబ్లిక్ న్యూసెన్స్‌లు

పండుగ రోజుల్లో దీపావళి టపాసుల వినియోగం నానాటికి పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ముప్పుగా తయారైంది. ఊరేగింపులకూ, శుభకార్యాలకు,అశుభ కార్యాలకుసైతం సాంప్రదాయక వాయిద్యాల స్థానంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భారీ శబ్దాలతో టపాసులు, బాంబులు పేలుస్తుంటే వాటి వలన వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా గుండె జబ్బులున్న వారికి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పుడు కొందరి వలన మరొక కొత్త జాడ్యం మొదలైంది.

- టి. సాంబశివరావు, గుంటూరు

## స్వదేశీ ఉత్పత్తులను పెంచాలి

భారత్ నేడు అయిదు వేలకోట్ల డాలర్లవిలువ చేసే కంప్యూటర్లు, మొబైల్‌ఫోన్లు, టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలను దిగుమతి చేసుకుంటోంది. ప్రతీఏడాది ఈ దిగుమతులలో 1శాతం వృద్ధిరేటు వుంటుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. దీనికి బదులుగా మన దేశంలోనే ఎలక్ట్రానిక్స్ రంగంలోవిస్తారంగా పరిశోధనలను ప్రోత్సహించి కనీసం వచ్చే అయిదేళ్ల నాటికైనా ఈ ఎలక్ట్రానిక్స్ పరికరాలను స్వదేశంలోనే ఉత్పత్తి చేయగలిగే విధంగా ప్రభుత్వం తగిన ప్రణాళికలను అమలు చేయాలి.

--సి.హెచ్. ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏప్రభుత్వం అధికారంలోఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయ కక్ష్యలు,కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి.ఆ రాజకీయ కక్ష్యలు,కార్పణ్యాలు గతప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు. గ్రామంలో ఎవరు ఎవరికి ఓటు వేసినా, వేయకపోయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన,మన అనే భేదంలేకుండా మనకు ఓటు వేయమని వారిని ఏ ప్రభుత్వ పథకాలు ఇచ్చి వారిని ఆ ప్రభుత్వం పై మంచి అభిప్రాయం తీసుకురావాలని ఆలోచించాలి.

- పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

## వృక్షో రక్షతి రక్షితః

శబ్ద,వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు. ఇక పశుపక్ష్యాదుల సంగతి సరేసరి. ప్రకృతి అసమతుల్యత వైపుపయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడు మేలుకోలేదన్నవిషయం ఆందోళనకరం.ఇది ముమ్మాటికి మానవ తప్పిదం. మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు,భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తలపెట్టేపనులు ఇకనుంచి అయినా మానుకోవాలి. ప్రపంచ దేశాలకే పెను సవాళ్లుగా ఎదురవుతున్న గ్లోబల్ వార్మింగ్‌కై సమష్టి కృషితో ప్రయత్నించాలి.

- కె.రామారావు , నల్గొండ

## వాహనాల లైటింగ్ తగ్గించాలి

ఒకప్పుడు స్వదేశీ అంబాసిడర్, మారుతి వంటి కార్లు,బస్సులు, ద్విచక్ర వాహనాల వంటి మోటారు వాహనాలు పరిమిత వేగంతో పయనించటమేగాక వాటి హెడ్‌లైట్లపై సగం నల్ల రంగు వేయడటమో నల్ల స్టిక్కర్లు అంటించట మో జరిగేది. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించ కుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కనుక ఇకనైనా వాహన తయారీ కంపెనీలు ఎదుటి వాహనాల కు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలి. దానిని వెంటనే అమలులో పెట్టాలి.

-డి. వెంకటరెడ్డి, ప.గోజిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రత్యామ్నాయ వ్యూహాలతో భారత్ రెడీ



## ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా పలు ప్రణాళికలు

### లక్షలాది ఉద్యోగులను కాపాడేందుకు వ్యూహం

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఔట్‌సోర్సింగ్‌పై కఠిన వైఖరి అవలంబించవచ్చనే భయాలు పెరుగుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. సుమారు 300 బిలియన్ డాలర్ల విలువైన దేశీయ టెక్నాలజీ పరిశ్రమను, దానిపై ఆధార పడిన లక్షలాది ఉద్యోగాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు వెళుతున్నట్లు కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తుకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చూసేందుకు అన్ని వర్గాలు కలిసికట్టుగా పనిచేస్తున్నామని ఆయన భరోసా ఇచ్చారు. అమెరికాలోని ట్రంప్ మద్దతుదారులు 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా)' నినాదంతో అవుట్‌సోర్సింగ్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. దీనిపై కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అంటే జీసీసీలు, భారీ సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో మేం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. అదే సమయంలో అమెరికా, యూరప్, జపాన్, ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతోనూ చర్చిస్తున్నాం. అత్యున్నత నాణ్యతతో కూడిన ఉత్పత్తిని అందిస్తున్న ఈ కీలక పరిశ్రమ చెక్కుచెదరకుండా, మరింత వృద్ధి చెందేలా చూడటమే మా లక్ష్యమని ఆయన వివరించారు. ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలు ఈ ఆందోళనలను మరింత ఆజ్యం పోశాయి. విదేశీ రిమోట్ వర్కర్లపై టారిఫ్‌లు (పన్నులు) విధించాలని, అమెరికాకు రిమోట్‌గా సేవలు అందించే దేశాలు కూడా వస్తువుల మాదిరిగానే పన్నులు చెల్లించాలని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇది నేరుగా భారతదేశ విదేశీ మారకద్రవ్య ఆర్జనపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. భారత ఐటీ సేవల రంగంలో ప్రస్తుతం 56 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశ ఎగుమతి ఆదాయంలో ఈ రంగం వాటా చాలా కీలకం. అయితే, కేవలం సేవల ఎగుమతులపైనే ఆధారపడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను కూడా బలోపేతం చేస్తోందని మంత్రి వైష్ణవ్ తెలిపారు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని శక్తిమంతం చేస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ల తయారీలో మన వాటా గణనీయంగా పెరిగింది. ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని పరికరాలను ఒక్కొక్కటిగా దేశంలోనే తయారు చేసేలా సరఫరా గొలుసును స్థానికీకరిస్తున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటీ ఉద్యోగాలను కాపాడుకుంటూనే, దేశంలోని నైపుణ్యం కలిగిన యువతకు తయారీ రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడమే తమ ద్వంద్వ వ్యూహమని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఐటీ పరిశ్రమల సంస్థ నాస్కామ్ అంచనాల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో భారత టెక్నాలజీ రంగం 5.1 శాతం వృద్ధితో 282.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించనుంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది 300 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటుతుందని అంచనా. ఈ రంగంలో కొత్తగా 1.26 లక్షల ఉద్యోగాలు కూడా రానున్నాయని నాస్కామ్ తన నివేదికలో పేర్కొంది.

# ఆస్తి తగాదాలో మహిళను చెట్టుకు కట్టేసి దాడి



**కడలూరు, సెప్టెంబరు 7:** తమిళనాడులో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన చోటుచేసుకుంది. భూవివాదం కారణంగా ఓ మహిళను నలుగురు మహిళలు కలిసి చెట్టుకు కట్టేసి, విచక్షణా రహితంగా దాడి చేశారు. ఆమెను పాక్షికంగా వివస్త్రను చేసి తీవ్రంగా అవమానించారు. కడలూరు జిల్లా పన్రుటి సమీపంలో జరిగిన ఈ అమానుష ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితురాలికి, నిందితులకు మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. ఇదే కక్షతో నలుగురు మహిళలు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితులలో ఒక మహిళను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ప్రాథమిక విచారణలో భూవివాదమే ఈ దాడికి కారణంగా తెలుస్తోంది. కులం కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన 2.13 నిమిషాల నిడివి గల వీడియోలో అత్యంత దారుణమైన దృశ్యాలు ఉన్నాయి. బాధితురాలిని ఆమె చీరతోనే చెట్టుకు కట్టేసి, నలుగురు మహిళలు చుట్టుముట్టారు. ఒకరు కర్రతో కొడుతుండగా, మరొకరు ఆమె జుట్టు పట్టుకుని లాగుతూ దూషించారు. నువ్వు ఓ కుక్కతో సమానం అంటూ దారుణంగా మాట్లాడారు. ఆమె బ్లౌజ్‌ను పాక్షికంగా తొలగించి అవమానించే ప్రయత్నం చేశారు. బాధితురాలు వారి నుంచి తప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించడం వీడియోలో కనిపించింది. ఆశ్చర్యకరంగా, అక్కడే ఉన్న మరో మహిళ ఈ దాడినంతా వీడియో తీస్తుండగా, మీరంతా జైలుకు వెళ్తారని హెచ్చరించినా నిందితులు ఏమాత్రం లెక్కచేయలేదు. దాడి తీవ్రరూపం దాల్చడంతో మధ్యలో మరో మహిళ కల్పించుకుని వారిని ఆపేందుకు ప్రయత్నించడం కూడా వీడియోలో రికార్డయింది. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర కలకలం రేగగా, పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# పిఎంవో ఎంత బలహీనంగా ఉందో మన్మోహన్ ట్వీట్ నిదర్శనం

## బిజెపి ఐటిచీఫ్ అమిత్ మాలవీయ ధ్వజం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** పన్నెండేళ్ల నాటి ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ఆధారంగా చేసుకుని బిజెపి కాంగ్రెస్ పార్టీపై ఆదివారం తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అధికారిక ఖాతా నుంచి వచ్చిన ఆ పోస్ట్, అప్పటి యూపీఏ ప్రభుత్వంలో ప్రధాని కార్యాలయం (పీఎంవో) ఎంత బలహీనంగా ఉండేదో చెప్పడానికి నిదర్శనమని బీజేపీ ఆరోపించింది. బిజెపి ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ ఈ విషయంపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. 2013 సెప్టెంబర్ 7న ప్రధాని కార్యాలయం చేసిన పోస్ట్‌ను ఆయన ట్యాగ్ చేశారు. అప్పటికి, ఇప్పటికీ ఇదే తేడా అంటూ తన విమర్శలకు పదును పెట్టారు. అప్పట్లో దేశ పరిస్థితి ఎలా ఉండేదంటే, స్వయంగా ప్రధానమంత్రి కార్యాలయం కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ వైఫల్యాలను, గందరగోళాన్ని బయటపెట్టేలా పోస్టులు చేయాల్సి వచ్చిందని ఆయన అన్నారు. 2013లో మన్మోహన్ సింగ్ కార్యాలయం నుంచి వెలువడిన ఆ పోస్ట్‌లో, మిస్టర్ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడానికి నేను సంతోషిస్తాను పీఎం అని ఉంది. ఈ పోస్ట్‌ను ఉటంకిస్తూ మాలవీయ, ఒక దేశ ప్రధాని కార్యాలయం అధికారిక ఖాతా నుంచి ఇలాంటి సందేశాలు పోస్ట్ చేయాల్సి వచ్చిందంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉండేవో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో ప్రభుత్వ పాలనలో పార్టీ జోక్యం ఏ స్థాయిలో ఉండేదో, పీఎంవో వనరులను పార్టీ వ్యవహారాలకు ఎలా దుర్వినియోగం చేశారో దీని ద్వారా తెలుస్తోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పీఎంవో నిర్ణయాధికారంలో ఎంతో స్పష్టత, పటిష్టత ఉన్నాయని, యూపీఏ హయాంలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండేవని మాలవీయ పోల్చి చెప్పారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాల్గొన్న బిజెపి ఎంపీల వర్క్‌షాప్ పార్లమెంట్ ప్రాంగణంలో జరుగుతున్న తరుణంలో అమిత్ మాలవీయ ఈ విమర్శలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇంకెన్నాళ్లు బీహార్ ప్రజలను మోసం చేస్తారు రాహుల్!

## విపక్షనేత పై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ ధ్వజం

**పాట్నా, సెప్టెంబరు 7:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జాతీయ చిహ్నమైన అశోక చక్రం ఉన్న ఫలకాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై స్పందిస్తూ దేశంలో అస్థిరతకు, అగౌరవానికి రాహుల్ గాంధీ కారణమవుతున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ చెప్పినట్టు దేశం నడిస్తే అది కుప్పకూలిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ నుంచి కశ్మీర్ వరకు దేశాన్ని అగౌరవపరిచేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. పాత రాజకీయ వివాదాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తేజస్వి యాదవ్, లాలూ యాదవ్‌లను అడుగుతున్నా, బీహార్‌ను ఇంకెన్నిసార్లు అవమానిస్తారు స్టాలిన్‌ను పిలిపించి తిట్టించారు. బీహార్ డీఎన్ఏను అవమానించిన రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఇప్పుడు కశ్మీర్‌లో ఏం జరిపించారు అని రాహుల్‌ను ఉద్దేశించి నిలదీశారు. శ్రీనగర్‌లోని హాజరత్‌బల్ దర్గాలో జమ్మూకశ్మీర్ వక్ఫ్ బోర్డు చేపట్టిన పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ ఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో ఈ వివాదం చెలరేగింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో జమ్మూకశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ అశోక స్తంభం కేవలం బీహార్‌కు చెందిన అశోక చక్రవర్తి స్తంభం మాత్రమే కాదు. దానిని మన రాజ్యాంగం స్వీకరించింది, యావత్ దేశం దాన్ని గౌరవిస్తోందని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశాన్ని అవమానిస్తుంటే, ప్రధాని మోదీ మాత్రం పేదలు, మధ్యతరగతి ప్రజల గురించి ఆలోచిస్తున్నారని అన్నారు. 27 కోట్ల మంది పేదలను దారిద్ర్యరేఖ నుంచి పైకి తీసుకువచ్చారని, జీఎస్టీని సులభతరం చేసి పండుగ వేళ పేద కుటుంబాలకు మేలు చేశారని గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.

# డ్రగ్స్‌కేసులో కటకటాలపాలయిన బ్రిటన్ లా విద్యార్థిని



**దుబాయి, సెప్టెంబరు 7:** ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన ఓ యువతి జీవితం ఒక్క పొరపాటుతో తలకిందులైంది. చట్టాలపై పట్టు సాధించాల్సిన లా విద్యార్థినే చట్టాలను ఉల్లంఘించి కటకటాలపాలైంది. డ్రగ్స్ కేసులో పట్టుబడిన 23 ఏళ్ల బ్రిటిష్ విద్యార్థిని మియా ఒబ్రెయిన్‌కు దుబాయ్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ప్రస్తుతం ఆమె దుబాయ్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తోంది. లివర్‌పూల్‌కు చెందిన మియా ఒబ్రెయిన్ న్యాయశాస్త్రంలో విద్యనభ్యసిస్తోంది. గతేడాది అక్టోబర్‌లో ఆమె దుబాయ్‌లో అరెస్ట్ అయింది. అప్పటి నుంచి తన కుమార్తెను చూడలేదని ఆమె తల్లి డేనియల్ మెకెన్నా (46) కన్నీటిపర్యంతమవుతున్నారు. నా కుమార్తె తన జీవితంలో ఎప్పుడూ ఎలాంటి తప్పు చేయలేదు. దురదృష్టవశాత్తు కొందరు తప్పుడు స్నేహితులతో కలిసి ఓ తెలివి తక్కువ పని చేసింది. ఇప్పుడు దానికి భారీ మూల్యం చెల్లించుకుంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆమె కుటుంబం నేరం వివరాలను వెల్లడించనప్పటికీ మియా వద్ద 50 గ్రాముల క్లాస్ ఏ డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 2,500 పౌండ్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 3 లక్షలు)ఉంటుందని అంచనా. మియాకు సహాయం చేసేందుకు ఆమె తల్లి 'గోఫండ్‌మీ' ద్వారా నిధులసేకరణ ప్రారంభించినా, ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో దాన్ని తొలగించారు. కొన్నిరకాల తీవ్రమైన నేరాలకు న్యాయ సహాయం కోసం నిధులు సేకరించడాన్ని తమ నిబంధనలు అంగీకరించవని గోఫండ్‌మీ ప్రతినిధి స్పష్టం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమలయ్యే కఠినమైన చట్టాల ప్రకారం జీవిత ఖైదు అంటే 15 నుంచి 25 ఏళ్ల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. డ్రగ్స్ అక్రమ రవాణా, హత్య, మానవ అక్రమరవాణా, ఉగ్రవాద కార్యకలాపాలు వంటి తీవ్రమైన నేరాలకు అక్కడ ఇలాంటి కఠిన శిక్షలు విధిస్తారు.

# భారత్‌పై నవారో వ్యాఖ్యలకు 'ఎక్స్' ఫ్యాక్ట్ చెక్..

**వాషింగ్టన్, సెప్టెంబరు 7:** భారత్‌పై తరచూ తీవ్ర విమర్శలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీనియర్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారోకు ఎలాన్‌మస్క్ సోషల్‌మీడియా ఎక్స్ గట్టి షాకిచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ భారత్ లాభాలు గడిస్తోందని నవారో చేసిన ఆరోపణలు ద్వంద్వ నీతికి నిదర్శనమని పేర్కొంటూ, ఆయన పోస్ట్‌కు ఒక ఫ్యాక్ట్ చెక్ నోట్‌ను జోడించింది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడాన్ని తప్పుబడుతూ నవారో ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. భారత్ విధిస్తున్న అధిక సుంకాల వల్ల అమెరికా ఉద్యోగాలు కోల్పోతోంది. కేవలం లాభం కోసమే భారత్ రష్యా నుంచి చమురు కొంటోంది. ఆ డబ్బుతో రష్యా యుద్ధాన్ని ప్రోత్సహిస్తోంది. భారత్ నిజాలను జీర్ణించుకోలేకపోతోందని ఆయన ఆరోపించారు. అయితే, ఈ పోస్ట్‌కు ఎక్స్ సంస్థ కమ్యూనిటీ నోట్ రూపంలో ఒక ఫ్యాక్ట్ చెక్‌ను జతచేసింది. భారత్ తన ఇంధన భద్రత కోసమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడం కాదు. మరోవైపు, అమెరికా కూడా రష్యా నుంచి యురేనియంవంటి వస్తువులను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను విమర్శించడం ద్వంద్వ నీతి అవుతుందని ఆ నోట్‌లో స్పష్టం చేసింది. ఈ అనూహ్య పరిణామంతో నవారో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఒక పనికిమాలిన నోట్‌అని, ప్రజల పోస్టుల్లో ఇలాంటి ప్రచారానికి ఎలాన్ మస్క్ ఎలా అనుమతిస్తున్నారని మండిపడ్డారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంతో ప్రతీకారంగా ట్రంప్ సర్కార్ ఇటీవల భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నవారో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఇది మోదీ యుద్ధమని, భారత్ టారిఫ్‌ల మహారాజ్ అని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. ఈ సుంకాల వివాదం కారణంగా భారత్-అమెరికా సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది. అయితే, ప్రధాని మోదీతో తనకు మంచి స్నేహముందని, ఇరుదేశాల మధ్య ప్రత్యేక బంధముందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. దీనికి ప్రధాని మోదీ కూడా స్పందించడంతో సంబంధాలు తిరిగి గాడినపడతాయని అందరూ భావిస్తున్న తరుణంలో నవారో వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి.

# పదేళ్లుగా ఓట్ల చోరులను కాపాడుతున్న ఇసి: మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** పదేళ్లుగా భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ఓట్ల చోరులను పరిరక్షిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్లుగా ఈసీ ఓట్ల చోరులను కాపాడుతూ వస్తోందని, కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని ఆరోపించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలక డేటాను ఇప్పటికీ ఎన్నికల సంఘం బయటపెట్టలేదన్నారు. మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే చెప్పారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి, ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఈసీ సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోందని ఖర్గే చెప్పారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదని విమర్శించారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బీహార్‌లోనూ ఓట్ల చోరీకి పాల్పడేందుకు కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

# దక్షిణకొరియా వేదికగా ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీకి రంగం సిద్ధం



**సియోల, సెప్టెంబరు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య మరో కీలక భేటీకి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో దక్షిణ కొరియా లో జరగనున్న ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సులో పాల్గొనేందుకు ట్రంప్, ఆయన ఉన్నతాధికారులు రహస్యంగా సన్నాహాలు చేస్తున్నారని అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా జిన్‌పింగ్‌తో ట్రంప్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. దక్షిణ కొరియాలోని గ్యాంగ్‌జూ నగరంలో అక్టోబర్ చివరి వారం నుంచి నవంబర్ మొదటి వారం మధ్య ఈ ఏపీఈసీ సదస్సు జరగనుంది. ఈ సదస్సు వేదికగా ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక సమావేశంపై తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అయితే ప్రణాళికలు ఇంకా ఖరారు కాలేదని ట్రంప్ పరిపాలన వర్గాలు తెలిపాయి. గత నెలలో జిన్‌పింగ్ ఫోన్‌లో ట్రంప్‌ను చైనా పర్యటనకు ఆహ్వానించగా, ట్రంప్ కూడా సానుకూలంగా స్పందించారు. అయితే పర్యటన తేదీలు ఖరారు కాలేదు. ఈ పర్యటనలో ట్రంప్ కేవలం జిన్‌పింగ్‌తోనే కాకుండా, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో కూడా సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతవారం ట్రంప్‌తో సమావేశమైన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్, ఏపీఈసీ సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించారు. కిమ్‌తో సమావేశానికి ఇది మంచి అవకాశమని కూడా ఆయన సూచించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన ట్రంప్, కిమ్‌తో భేటీకి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆయన నన్ను కలవాలనుకుంటున్నారు. మేం కలుస్తాం, సంబంధాలు మెరుగుపరుస్తాం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల చైనా, రష్యా, భారత అధినేతలు బీజింగ్‌లో సమావేశమవడంపై ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా సైనిక పరేడ్ సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్, మోదీ భేటీ కావడంపై ట్రంప్ సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.




భారీగా యుద్ధనౌకలు, ఫైటర్ జెట్ల మోహరింపు

# వెనెజులాపై యుద్ధానికి ట్రంప్ రెడీ..

**వాషింగ్టన్, సెప్టెంబరు 7:** తాను ఏడు యుద్ధాలను ఆపానని పదేపదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరతీశారు. ఆ మేరకు కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధనౌకలు, జలాంతరాములు, అత్యాధునిక ఫైటర్ జెట్‌లను మోహరించారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెనెజులా చుట్టూ ఇవి సమయం కోసం ఎదురుచూస్తూ కాచుకు కూర్చున్నాయి. దాంతో కరేబియన్ జలాలపై యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనెజులాలో చొరబడవచ్చని ప్రచారం జరుగుతోంది. వెనెజులా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ చాలాకాలంగా చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. మాదకద్రవ్యాల ముఠాలతో వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అతడిని పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 430కోట్లు) బహుమతిగా ఇస్తామని ప్రకటించింది. అంతేగాక మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు.

# 60 శాతం ఆయుధాలు మావే

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**కీవ్, సెప్టెంబరు 7:** మూడేళ్లుగా రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉపయోగిస్తున్న ఆయుధాల్లో 60శాతం తమ దేశంలో ఉత్పత్తి చేసినవేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఇతర దేశాల నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ స్వదేశీ ఉత్పత్తులపైనే ఎక్కువగా దృష్టి పెట్టామన్నారు. ఓ వైపు సంఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ కీవ్ బలమైన, అత్యాధునిక ఆయుధాలను తయారుచేసే స్థాయికి ఎదగడం గర్వకారణమని చెప్పారు. అయితే తాము సాధించాల్సిన లక్ష్యాలు ఇంకా ఉన్నాయని జెలెన్‌స్కీ అన్నారు. ప్రస్తుతం గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇటీవల గగనతల రక్షణ వ్యవస్థలతోపాటు రెండు కొత్త బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేసినట్లు కీవ్ వర్గాలు తెలిపాయి. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 2025 బడ్జెట్‌లో ఉక్రెయిన్ సర్కారు భారీ కేటాయింపులు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే చైనా పర్యటన తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ యుద్ధం ముగింపుపై చర్చలు జరపడానికి మాస్కోకు రావాలని జెలెన్‌స్కీను ఆహ్వానించారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ యుద్ధం ముగింపు కోసం ఓ నిర్ణయం తీసుకోవాలనే ఆలోచన పుతిన్‌కు ఉంటే ఆయనే కీవ్‌కు రావాలన్నారు.

# జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా రాజీనామా



**టోక్యో, సెప్టెంబరు 7:** జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జూలైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంతపార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఇషిబా నుంచి ఈ ప్రకటన వెలువడింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికలు నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై చర్చించేందుకు లిబరల్ డెమొక్రటిక్ పార్టీ సెప్టెంబరు 8న నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. దీనికి ఆమోదం పొందితే ప్రధానిపై వర్చువల్ అవిశ్వాసతీర్మానం పెట్టే అవకాశం ఉంది. ఈనేపథ్యంలోనే మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా రాజీనామా ప్రకటించారు.

## సంక్షిప్తంగా..

# అమెరికా లోకల్ రైలులో మహిళ దారుణ హత్య



**వాషింగ్టన్, సెప్టెంబరు 7:** రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో భయాందోళనల మధ్య బతకలేక అమెరికాకు వలస వచ్చిందో మహిళ ప్రాణాలు కాపాడుకోవడానికి వలస వచ్చిన సదరు మహిళ అమెరికాలో దారుణ హత్యకు గురైంది. లోకల్ రైలులో ప్రయాణిస్తుండగా ఓ దుండగుడు కత్తితో దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ హత్యకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. గత నెలాఖరులో జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. రష్యా దాడుల నేపథ్యంలో నిత్యం భయంభయంగా గడపలేక ఉక్రెయిన్ మహిళ ఇరినా జరుత్స్కాను అమెరికాకు వలస వచ్చింది. నార్త్ కరోలినాలో ప్రశాంతమైన జీవితం గడుపుతోంది. ఈ క్రమంలోనే గత నెల 22న షార్లెట్ లో లోకల్ రైలులో ప్రయాణిస్తుండగా ఓ దుండగుడు ఆమెపై దాడి చేశాడు. రైలులో ఇరినా వెనక సీటులో కూర్చున్న దుండగుడు. జేబులో నుంచి కత్తి తీసి ఒక్కసారిగా ఇరినాపై దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు, రక్తస్రావంతో ఇరినా అక్కడికక్కడే చనిపోయింది.

# ఛాతీలో కత్తితో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన స్కూలు విద్యార్థి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** దేశ రాజధాని ఢిల్లీలో దిగ్భ్రాంతికరమైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల పాఠశాల విద్యార్థి తన ఛాతీలో కత్తి దిగి ఉండగానే నడుచుకుంటూ పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడం తీవ్ర కలకలం రేపింది. పాత పగ నేపథ్యంలో అతడి స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులే ఈ దాడికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. సెంట్రల్ ఢిల్లీలోని ఓ పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల బాలుడు పహార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. అతడి ఛాతీలో కత్తి దిగి ఉండటం చూసి పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. పాఠశాల గేటు వద్ద తన ముగ్గురు స్నేహితులు తనపై దాడి చేసి కత్తితో పొడిచారని బాధితుడు పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు అతడిని వెంటనే తొలుత కళావతి శరణ్ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేసి కత్తిని తొలగించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు దాడి జరిగిన మరుసటి రోజు సాయంత్రం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.



# గోశాలగా మారిన పోలీస్ స్టేషన్

**రాంచి, సెప్టెంబరు 7:** జార్ఖండ్‌లోని ఓ పోలీస్ స్టేషన్ రెండు రోజుల పాటు గోశాలగా మారిపోయింది. అక్రమ రవాణా ఆరోపణలతో పట్టుకున్న సుమారు 200 పశువులను ఉంచేందుకు మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో పోలీసులు వాటిని స్టేషన్ ఆవరణలోనే కట్టేశారు. ఈ అనూహ్య ఘటన గర్వా జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పశువులను అక్రమంగా తరలిస్తున్నారంటూ భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు సోను సింగ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సుమారు 170 నుంచి 200 పశువులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, వాటిని ఉంచడానికి తక్షణమే గోశాల అందుబాటులో లేకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్ ప్రాంగణానికే తరలించారు. శుక్రవారం రాత్రి వరకు ఆ పశువులు అక్కడే ఉన్నాయి. ఈ ఘటనపై భజరంగ్ దళ్ నేత సోను సింగ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ పశువులను వధశాలల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. స్మగ్లర్లు మాపై, పోలీసులపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నించారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద వ్యక్తులు ఉన్నారని ఆరోపించారు.

# మధ్యప్రదేశ్ పిసిసి చీఫ్ ఇంట్లో చోరీ



**భోపాల్, సెప్టెంబరు 7:** మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు (పీసీసీ చీఫ్) జీతూ పట్వారీ ఇంట్లో జరిగిన చోరీ ఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. ఇండోర్ రాజేంద్ర నగర్‌లోని బిజల్‌పూర్ కాలనీలో ఉన్న ఆయన నివాసంలోకి ఆరుగురి కంటే ఎక్కువ మంది దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చోరులు చాలా వ్యూహాత్మకంగా మొదటగా ఆ ఇంటికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ తర్వాత బయట ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఇంట్లోఉన్న కార్యాలయంలోకి వెళ్లిఅక్కడి డ్రాలు, లాకర్లను పగలగొట్టారు. అయితే ఈ చోరీ వెనుక ఉన్న ఉద్దేశంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దొంగలు ఇంట్లో ఉన్న మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను వదిలి పెట్టి కొన్ని సాధారణ వసువులను మాత్రమే తీసుకువెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు సహా పోలీసులు అంతా షాక్ అవుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలందాలి:కలెక్టర్ నాగరాణి

భీమవరం సెప్టెంబర్ 7(ప్రభాతవార్త : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఆదివారం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులను సందర్శించి, రోగులతో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు, మీ పట్ల మర్యాదగా వ్యవహరిస్తున్నారా, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా, రక్త పరీక్షలు ఇక్కడే చేస్తున్నారా అని పలు ప్రశ్నలు వేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారు ఆసుపత్రి సేవలు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వైద్యులను అభినందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రికి పేద, మధ్యతరగతి వర్గాలు ప్రజలు వైద్యానికి వస్తారని వారినీ మర్యాదతో పలకరించడంతోపాటు, మంచి సేవలు అందించాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలలో అందుతున్న వైద్య సేవలలో మీ అందరి కృషి వలన రాష్ట్ర స్థాయిలో ప్రధమ స్థానంలో ఉన్నామని, ఇదే స్ఫూర్తిని ఇకముందు కూడా కొనసాగించేలా మరింత



మెరుగైన సేవలను ప్రజలకు అందించాలని తెలిపారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# సూపర్ సిక్స్ పథకాల అమలపట్ల ప్రజల్లో సంతృప్తి, సంతోషం.

**- అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం..**

**- రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు.**





పాలకొల్లు ప్రభాత వార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ పథకాల పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పాలకొల్లు తహసిల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ అధికారం ఇస్తే అభివృద్ధి వైపు నడపాలని, విధ్వంసం వైపు కాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం ప్రజలందరూ చూస్తూనే ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన సుమారు 15 లక్షల కోట్ల అప్పులను తీర్చే లక్ష్యంగా కృషి చేస్తూనే, అప్పులకు వడ్డీలను కూడా కడుతూ ఉండటంతో ఆర్థిక పరిస్థితి సహకరించకపోయిన, మంచి పరిపాలన దక్షత కలిగిన మన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని పరిస్థితులను చక్కదిద్దుతూ సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. సామాజిక పించన్లు రూ.4 వేలు, దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు పెంచి అందించడంతోపాటు, మంచానికే పరిమితమైన వారికి రూ.10 వేలు, రూ.15 వేలు పెన్షన్లను అందించడం మన ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్లను అందించడం లేదన్నారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలు బాగా చదువుకుని ఉద్యోగం రావాలని కోరుకుంటారని, మెగా డీఎస్సీ పేరిట 16,350 టీచర్ల పోస్టులను భర్తీ చేసుకోవడం జరిగిందన్నారు. అన్న క్యాంటీన్లలో తక్కువ రేటుకే అల్పాహారం, భోజనం అందజేయడం ద్వారా ప్రతిరోజు సుమారు 2.50 లక్షల పేదవారికి ప్రయోజనం కలుగుచున్నదన్నరు. రైతాంగానికిగానికి సంవత్సరానికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామన్న హామీ అమల్లో భాగంగా తొలి విడతగా కేంద్ర, రాష్ట్ర సాయంగా రూ.7 వేలు అందజేయడం జరిగిందన్నారు. పిల్లలు బాగా చదువుకుంటేనే కుటుంబం ఆర్థికంగా ఉన్నతంగా ఉంటుందనే ఆలోచన చేసిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కుటుంబంలో ఎంత పంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.13 వేలు తల్లికి వందనం పేరిట జమ చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు 15న స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించకోవడం జరిగిందన్నారు. మత్స్యకారులకు రూ.20 వేలు అందజేశామని, అలాగే చేనేత కార్మికులకు జీఎస్టీ తగ్గించడం, పవర్ సబ్సిడీ, మగ్గం ఉన్నవారికి రూ.25 వేలు అందజేయడానికి క్యాబినెట్లో ఆమోదించడం జరిగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ముందుకు తీసుకెళుతూనే, మన ఉప ముఖ్యమంత్రి పల్లె పండగ పేరిట ప్రతి గ్రామంలోనూ వాడవాడల సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే రాష్ట్రంలో గుంటలు లేని రహదారుల నిర్మాణాలను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు.

# 13 న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ



ప్రభాతవార్త నరసాపురం : ఈ నెల 13వ తారీకు న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ పై ప్రత్యేక దృష్టి సారించాలని , కక్షిదారులకు తక్కువ సమయంలో సమ న్యాయం అందించుటలో పోలీస్ అధికారులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని నర్సాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి ఈ రోజు కోర్ట్ హాల్ నందు పోలీసు ఉన్నతాధికారులతో, న్యాయవాదులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్నారు. ఇప్పటికే ఆయా పోలీసు స్టేషన్ లు గుర్తించిన రాజీ పడతగిన కేసులను ప్రీ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయవలసినదిగా, అందుకు న్యాయవాదులు కూడా తమ వంతు సహకరించవలసినదిగా సూచించారు. సివిల్ కేసుల్లోనూ , చెక్ బౌన్స్ కేసుల్లోనూ న్యాయవాదులు ఇరుపార్టీల కు లోక్ అదాలత్ యొక్క ప్రాముఖ్యతను వివరించి ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా ఇంతకుముందు కంటే ఎక్కువ కేసులు రాజీ అయ్యేట్లు ఇటు పోలీసు వారు, అటు న్యాయవాదులు తమ వంతు కృషి చేయవలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారిణి జి. శ్రీ వేద, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. విశ్వేశ్వరరావు, ఎ.పి.పి సిద్ధార్ద్ , నరసాపురం పట్టణ గ్రామీణ , పాలకొల్లు గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ లు నర్సాపురం టౌన్, మొగల్తూరు, యలమంచిలి, మొగల్తూరు సబ్ ఇన్స్పెక్టర్ లు కోర్ట్ లైజన్ అధికారి సూర్య భాస్కర్ రావు ఆయా పోలీస్ స్టేషన్ లకు చెందిన కోర్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే రాధాకృష్ణ పై కారుమూరి ఆరోపణలు

తణుకు, సెప్టెంబర్ 7(ప్రభాత వార్త): కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అవినీతి చేశారని మాజీ మంత్రి కారుమూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తన దగ్గర ఆధారాలు ఉన్నాయని త్వరలోనే బయట పెడతానంటూ వ్యాఖ్యానించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో వ్యవసాయరంగం అధోగతి పాలై రైతులు అప్పులపాలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్, జగన్ హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించారని, వ్యవసాయం దండగన్న చంద్రబాబు ఆ వ్యాఖ్యలను కొనసాగిస్తూ రైతుల ఉసురు తీస్తున్నారని విమర్శించారు. రైతులు తమ పంట మంచి దిగుబడి రావాలనే ఉద్దేశ్యంతో యూరియా కోసం పాకులాడుతున్నారని, క్యూలైన్‌లలో మహిళలు కూడా నిల్చోవాల్సి వస్తుంటే చంద్రబాబు వెటకారంగా యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని, పురుగుమందుల వాడకం తగ్గించాలని అనడం బాధాకరమన్నారు. ఏడాది పొడవునా వరి పంట పండుతూ అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్‌ను ఎడారిగా మార్చి రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్నారని దుయ్యబట్టారు. పెట్టుబడి సాయంలేక, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల భీమా వంటివి అమలు చేయకపోవడంతో రైతులు పంట పండించేందుకు అప్పులపాలవ్వాల్సి వస్తుందని అన్నారు. రైతాంగాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం అమరావతి రూ. కోట్లు ఖర్చుచేస్తూ భ్రమరావతిని తయారుచేస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ అద్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 9వ తేదీన తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ర్యాలీగా తరలివెళ్లి వినతిపత్రాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై 'అన్నదాత పోరు' పోస్టర్‌ను కారుమూరితోపాటు పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ఎంపీపీ రుద్రా ధనరాజు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, తణుకు మండల అధ్యక్షుడు పెనుమర్తి వెంకటరామన్న, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.


# జిల్లాస్థాయి యోగాసన పోటీలు- విజేతలకు బహుమతులు

ఆగిరిపల్లి, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రాంగణంలోని మడుపల్లి రామ నాగలక్ష్మి నారాయణరావు కస్తూరి దంపతుల కళ్యాణ మండపం నందు ఆదివారం జిల్లాస్థాయి యోగాసన ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. నూజివీడు కి చెందిన కుమార్ గురువు పర్యవేక్షణలో జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు యండూరు నరసింహమూర్తి, కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు, కోశాధికారి పోతులూరి వీర బ్రహ్మాచారి ల నేతృత్వంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో 8 సంవత్సరాల వయస్సు నుండి 60 సంవత్సరాలు ఆ పై వయసున్న పురుషులు, మహిళలు పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆగిరిపల్లి శోభనాపురం వడ్లమాను నూజివీడు ముసునూరు ప్రాంతాలకు చెందిన 56 మంది పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన 15 మంది విజేతలుగా నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రము మెడల్స్ పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న మడుపల్లి గోపాలకృష్ణ కుమార్ ఎండూరు ప్రణీత్ వేదాంతం శేషబాబు మురళీధర్ లుఅందజేశారు.



# చింతలపూడి ఎఎంసి చైర్ పర్సన్ గా చీదరాల దుర్గా పార్వతి

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: చింతలపూడి ఏఎంసి చైర్ పర్సన్ గా రాష్ట్ర ప్రభుత్వం జనసేన చింతలపూడి మండల అధ్యక్షులు చీదరాల మధు బాబు సతీమణి దుర్గా పార్వతిని నియమించింది. కూటమి ప్రభుత్వంలో ప్రధాన మిత్రపక్షమైన జనసేన పార్టీకి ఈ పదవి లభించినందున చింతలపూడి నియోజకవర్గంలోని జనసేన పార్టీ శ్రేణులు ఆనందోత్సవాల్లో ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రధానమైన నామినేషన్ పదవులు కొన్నిటిని జనసేనకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ పదవి కోసం పలువురు టిడిపి నాయకులు విశ్వ ప్రయత్నం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు నామినేషన్ పోస్టుల భర్తీ లో గతంలో తను ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏఎంసి పదవిని జనసేన పార్టీకి కేటాయించారు. జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం కోసం అవిరళ కృషి చేశారు. దాంతో మధుబాబు సతీమణి దుర్గా పార్వతికి ఈ పదవి లభించింది. చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పడిన గత 50 సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వంలో ప్రధానంగా ఏఎంసీ చైర్ పర్సన్ పదవి దుర్గ పార్వతిని వరించింది. ఇప్పటివరకు టిడిపి ప్రభుత్వంలో మొదటి ఏఎంసి చైర్ పర్సన్ పదవి మహిళ అయిన దుర్గా పార్వతికి దక్కడం విశేషం. ఇప్పటివరకు పది మంది వరకు చైర్మన్ పదవిని అలంకరించారు. స్వర్గీయ కోటగిరి విద్యాధరరావు, రావి సాంబ శివ రావు,పడాల వీరేంద్రనాథ్, జగ్గవరపు ముత్తారెడ్డి,బొడ్డు వెంకటేశ్వరరావు,మేడవరపు అశోక్ శ్రీనివాస్ రావు ,తూత లక్ష్మణరావు, కోనేరు వెంకట సుబ్బారావు, మందలాపు సాయిబాబ, జగ్గవరపు జానకి రెడ్డి ఉన్నారు. త్వరలోనే ఏఎంసి పాలకవర్గం పూర్తిస్థాయిలో ఏర్పరిచిన తర్వాత చైర్ పర్సన్ దుర్గా పార్వతి ప్రమాణ స్వీకారం చేసి,అధికారికంగా పదవి బాధ్యతలు తీసుకోనున్నారు.



# రంపచోడవరం కేంద్రంగా మరొక ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: రంపచోడవరం కేంద్రంగా రాష్ట్రంలో మరొక ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ మరియు జిల్లా ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుట్టాయిగూడెం మండలం మర్రిగూడెం లో ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు కొమరం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివాసి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, నాయకులు తెల్లం గంగరాజు, తెల్లం లక్ష్మణరావు, రవ్వా బసవరాజు, పోడియం కొవ్వాడియ్య, కోర్స తులసిరావు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల పంపిణీ చేయాలి

## జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్



ఏలూరు, ఆగస్టు 7 ( ప్రభాత వార్త) : రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను అందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతులకు ఎరువుల పంపిణీపై ఆదివారం వ్యవసాయ శాఖ, సహకార, మార్క్ ఫెడ్ అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రైతులకు ఎరువుల పంపిణీలో జిల్లాలో ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎరువుల పంపిణీలో ఎటువంటి సమస్యలు రాకుండా వ్యవసాయాధికారులు పటిష్టమైన ప్రణాళికతో పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి, మమేకమవ్వాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలో ఎరువులకు ఎటువంటి కొరత లేదని, ఈనెల 10, 13 తేదీలలో మరో వెయ్యి టన్నుల యూరియా జిల్లాకు రానున్నదన్నారు. ఎరువుల పంపిణీ విషయంలో ఎటువంటి ఆందోళన చెందవద్దన్న విషయాన్నీ రైతులకు తెలియజేయాలన్నారు. ఒకే రైతుకు ఎక్కువ మొత్తంలో ఎరువులను పంపిణీ చేయవద్దన్నారు. జిల్లాకు చేరుకున్న ఎరువులు సొసైటీలకు వెంటనే చేర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నుండి ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటుచేయాలన్నారు. ఎరువుల కోసం సొసైటీలకు వచ్చే రైతులు ఎండా తీవ్రతకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా షామియానాలు వేయించాలని, కుర్చీలు, త్రాగునీరు వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, జిల్లా సహకార శాఖాధికారి ఆరిమిల్లి శ్రీనివాసరావు, మార్కెఫెడ్ జిల్లా మేనేజర్ సిహెచ్. ప్రసాద్ గుప్త, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, మండల వ్యవసాయాధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ స్మార్ట్ కార్డులు పంపిణీ

## ఎం.పీ.డీ.వో.సత్యనారాయణ

ముసునూరు, సెప్టెంబరు 07 ప్రభాతవార్త: అర్హులైన ప్రజలందరికీ నూతనంగా వచ్చిన రేషన్ కార్డులైన స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం కొనసాగుతుందని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని 16 గ్రామపంచాయతీలు వాటి శివారు అన్ని గ్రామాలలో రైస్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. సంబంధిత గ్రామం లోని స్థానిక ప్రజా ప్రతినిధులు సహకారంతో ప్రజలకు అంద చేస్తున్నామన్నారు. ఆదివారం రమణక్కపేట, సూరేపల్లి, చెక్కపల్లి చింతలవల్లి, ముసునూరు గ్రామాలలో ఎం.పీ.డీ.వో పరిశీలించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామంలో సచివాలయ సిబ్బంది వీ.ఆర్వో.లు అందరూ స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఉన్నారని పేర్కొన్నారు. ఎవరికైనా కార్డులు అందకపోతే గ్రామ సచివాలయ సిబ్బంది , తాసిల్దార్, ఎం.పీ.డీవో.లకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో



ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ , రేషన్ డీలర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నరసింగపాలెం సొసైటీని బిజెపికి కేటాయించటం పై హర్షం

నూజివీడు, సెప్టెంబరు07 ప్రభాతవార్త: నూజివీడు మండలం నరసింగపాలేం సహకార సంఘం (సొసైటీ) కి నూతనంగా ఎన్నికైన చైర్మన్ బిజెపి కుటుంబ సభ్యులు ఎర్ర బాబు కి ముసునూరు మండలం బిజెపి పార్టీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలియజేసినట్లు ముసునూరు మండల బిజెపి అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, బీసీ సెల్ మండల కార్యదర్శి వరుగు. రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముసునూరు మండలంలో బిజెపి అభివృద్ధికి, ప్రజల సంక్షేమా ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నో ప్రజలకు ఉపయోగకరమైన పథకాలు అమలు చేస్తూ ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎన్నో జ్ఞాపకాలకు వారి సేవలే మూలం





ప్రభాతవార్త నరసాపురం :నరసాపురం పట్టణంలోని ఫణి శ్రీ ఫంక్షన్ హాల్‌లో పశ్చిమ గోదావరి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ నూతన కమిటీ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఫోటోగ్రాఫర్ల సేవలు సమాజానికి ఎంతో ముఖ్యమని, ప్రతి ఆనందకరమైన క్షణాన్ని జ్ఞాపకంగా నిలుపుతూ అందరికీ మధురమైన గుర్తులు అందించడంలో వారి పాత్ర విశిష్టమని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ పదాధికారులు, సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆలయాలు మూసివేత

ఆగిరిపల్లి సెప్టెంబర్ 7 ప్రభాతవార్త : స్థానిక శ్రీ శోభనాచల వ్యాగ్ర లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం, శ్రీ దుగ్గిరాల బాల రావమ్మ ఆలయం, శ్రీ బాలా త్రిసుందరి సమేత ముక్తేశ్వర స్వామి వారి ఆలయం, కనకదుర్గమ్మ ఆలయం, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి, కోదండ రామాలయం, వేణుగోపాల స్వామి వారి ఆలయం శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాలు, మండల పరిధిలోని తోటపల్లి కనసనపల్లి శ్రీ దుగ్గిరాల బాల రావమ్మ ఆలయాలు, అడ్డరోడ్డు ఆంజనేయ స్వామి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలు మండలంలోని ఆలయాల చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేయడం జరిగింది. సంప్రోక్షణ అనంతరం ఆలయాల్లో దర్శనం ఏర్పాట్లు జరుగుతాయి ఆలయ అర్చకులు తెలియజేశారు.



# విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ.

ఆగిరిపల్లి సెప్టెంబర్ 7 ప్రభాతవార్త రీజినల్ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారి పి మహేష్ కు రాబడిన సమాచారం మేరకు ఏలూరు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలలో విజిలెన్సు, రెవిన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా వివిధ ప్రాంతాలలో ఏక కాలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఆదివారంఎరువులు షాపులు ఆకస్మిక తనిఖీ చేయగా ఆగిరిపల్లి మండలం నేకకాలం గొల్లగూడెం లో (1) మేస్సేర్స్ హనుమాన్ ఏజెన్సీస్, ఆగిరిపల్లి లో (2) మేస్సేర్స్ ఎండూరు శ్రీరామచంద్ర మూర్తి మరియు కాళ్ళ మండలం బొండాడ లో (3) మేస్సేర్స్ స్వామి అయ్యప్ప ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ల నందు తనిఖీ చేశారు. మేస్సేర్స్ హనుమాన్ ఏజెన్సీస్ నందు రు.2,75,550/- విలువ కలిగిన 12.650 టన్నుల ఎరువులు వ్యత్యాసము గుర్తించి వాటిని సీజ్ చేసి షాపు యజమాని పై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6(ఎ )కేసులు నమోదు చేయడమైనది , 'ఫారం లేనందున రు.1,17,810/- విలువ కలిగిన 3.850 టన్నుల ఎరువులు అమ్మకాలు నిలుపుదల చేయడం జరిగింది. ఈ తనికీ లోవిజిలెన్సు డీఎస్పీసింగులూరి వెంకటేశ్వర రావు, విజిలెన్సు ఇన్స్పెక్టర్ శివరామ కృష్ణ, విజిలెన్సు ఏవోమీరయ్య, విజిలెన్సు ఎస్సైరంజిత్ కుమార్, నాగరాజు, సీతారాము, ఆగిరిపల్లి, కాళ్ళ మండల వ్యవసాయ శాఖాధికారులు , రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఇంతవరకు 76 వేల 177 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ



ఏలూరు, సెప్టెంబర్,7: జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు ఇప్పటివరకు 76 వేల 177 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. సెప్టెంబర్, 10, 13 వ తేదీలలో మరో వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నదన్నారు. ప్రస్తుతం జిల్లాలో 2 వేల 400 మెట్రిక్ టన్నుల యూరియా, 2 వేల 982 మెట్రిక్ టన్నుల డిఏపి , 4 వేల 612 మెట్రిక్ టన్నుల ఎంఓ పి , 13 వేల 320 మెట్రిక్ టన్నుల ఎన్ పి కె, 5 వేల 715 మెట్రిక్ టన్నుల ఎస్.ఎస్.టి., మొత్తం కలిపి 29 వేల 029 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని రైతులకు ఎటువంటి ఎరువులు కొరత లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎప్పటికప్పుడు మార్కెఫెడ్, వ్యవసాయ, సహకార శాఖాధికారులను అప్రమత్తం చేయడంతో జిల్లాలో ఎరువులు పంపిణీలో ఎటువంటి సమస్యలు లేకుండా రైతులకు సజావుగా ఎరువులు అందిస్తున్నామన్నారు.

## జనార్ధనవరం లడ్డు మాజీ సర్పంచ్ కైవసం

చాట్రాయి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త : చాట్రాయి మండలం జనార్ధనవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు నవరాత్రులు పూర్తిచేసుకుని శనివారం నిమజ్జనానికి బయలుదేరారు. ఈ సందర్భంగా లడ్డు వేలంపాట నిర్వహించగా ఆ గ్రామం మాజీ సర్పంచ్ పలగాని దుర్గారావు 52 వేలకు పాడి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడు ఎటువంటి విఘ్నాలు లేకుండా గ్రామ ప్రజలను తన కుటుంబ సభ్యులను కాపాడాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఆది దేవుడైన వినాయకుడిని పూజిస్తే ఎటువంటి దోషాలు లేకుండా గ్రామం మొత్తం సస్యశ్యామలంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ వినాయకుడు ఆశీస్సులు అందరికీ అందాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు కన్నుల విందుగా కొనసాగింది. సాంప్రదాయమైన మేళతాళాలతో



వినాయకుడిని నిమజ్జనానికి సాగనంపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు గావించారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా...
ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, దెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా...
ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించవలెను.
ఫోన్:9704502377

## మానవత్వంతో పని చేసేది కూటమి ప్రభుత్వం.



పాలకొల్లు ప్రభాత వార్త :రాష్ట్రంలో మానవత్వంతో పని చేసే కూటమి ప్రభుత్వం ను అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని.. జరిగిన మేలును పదిమందికి చెప్పాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మానవత్వంతో పేద వర్గాలకు వైద్య ఖర్చులు అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించారన్నారు. పాలకొల్లు లో ఆయన కార్యాలయంలో నియోజకవర్గం లో పేద వర్గాలకు వైద్య ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిగా 53 మందికి రూ22 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడన్నారు. పేదలకు వైద్య సాయం అందించలేక మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలోనే ఏడాది కాలంలో 6 కోట్లు50 లక్షలు వరకు అందించమన్నారు. వారం వారం పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయంగా వైద్యానికి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి వర్గాలు వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ సాయం కోసం ఒకసారి దరఖాస్తు చేసుకుంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మంజూరు అయిన తర్వాత పిలిచి ఇస్తున్నామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో వైసీపీ నాయకులకు దరఖాస్తు చేసుకుంటే డ్రైన్ల, కాలువల వెంబడి పడవేసేవారని ఆ పార్టీ నాయకుడు దరఖాస్తు చేసుకుంటేనే దిక్కు లేదన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ చంద్రబాబు ఫోటోలు ఇంట్లో పెట్టుకుని ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా క్షేమంగా సంతోషంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఒకే రోజు 53 మందికి 22 లక్షలు వైద్యసాయం అందించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి రామానాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లబుచ్చారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు ధనాన్ని సూర్య ప్రకాష్ మీసాల రాము మండాది అవినాష్ అల్లం తాతాజీ కూటమి నాయకులు భాను నరసయ్య కొల్లి కొండ కుమార్ శిడగం సూరి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కారుమూరికి ఎమ్మెల్యే రాధాకృష్ణ సవాల్

### -రైతు సంక్షేమానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం -ఘాటు వ్యాఖ్యలు చేసిన తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, ఆగస్టు 7 ( ప్రభాత వార్త) : ఏడాది కాలంలోనే రూ. 1200 కోట్లు అవినీతి జరిగిపోయిందని చెబుతున్న మాజీ మంత్రి కారుమూరి ఇందులో కనీసం రూ. 12 అవినీతి జరిగిందని దమ్ముంటే నిరూపించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సవాల్ విసిరారు. ఆధారాలు ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు ఆదివారం తణుకు కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో కారుమూరి చేసిన అవినీతిని తణుకు నియోజకవర్గ ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు. గాలి కబుర్లు పోగుచేసి బుడదజల్లాలని ప్రయత్నిస్తే ఖబర్దార్ కారుమూరి అంటూ మండిపడ్డారు. గత ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా కారుమూరి చేసిన అవినీతి అంతా రికార్డెడ్ గా ఉందన్నారు. కరోనా పేరు చెప్పి నియోజకవర్గంలో ఎంత దోచుకున్నావో అందరికీ తెలుసని అన్నారు. గోల్డ్ షాపులు, ఫ్యాక్టరీలు, ఆయిల్ డీలర్లు, రైస్ మిల్లర్లు ఇలా అందరి దగ్గర దోచుకున్న సంగతి ఇప్పటికి మర్చిపోలేదని అన్నారు. ఇప్పటికీ రైసు మిల్లర్లను వదలలేని పరిస్థితి ఉందని విమర్శించారు. మున్సిపాలిటీ, ప్రభుత్వాసుపత్రి, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బందిని ఐదేళ్లపాటు సొంత అవసరాలకు ఇంట్లో వాడుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇంత అవినీతి చేసి ఇప్పుడు ఏదో ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నట్లు ముసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. పేకాట, బెట్టింగులు చేసే వాళ్లంతా నీ చుట్టూ తిరుగుతున్నారనే విషయం అందరికీ తెలుసని కారుమూరిని ఉద్దేశించి అన్నారు. వారానికోసారి వచ్చి నోరు ఉంది కదా అని నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని అన్నారు. కారుమూరి నియోజకవర్గంలో చేసిన దుర్మార్గమైన పాపాలు ఇంకా ఉన్నాయని అన్నారు. దోపిడీ చేయడానికి పనికిరాని భూములన్నీ ఇళ్ల స్థలాల కోసం కొనిపించారని విమర్శించారు. కారుమూరి నటన చాతుర్యానికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు. ఎక్కడెక్కడ గనులను దోచేశారో అన్ని రికార్డెడ్ గా ఉన్నాయని అన్నారు. నేనెంత అవినీతి చేశానో... నువ్వెంత అవినీతి చేసావో వస్తే కూర్చుని తేల్చుకుందామని సవాల్ విసిరారు. కరోనా సమయంలో వసూలు చేసిన సొమ్ములో 20 శాతం ఖర్చుపెట్టి, 80 శాతం దోచుకుని దాచుకున్నారని వ్యాఖ్యానించారు

**రైతు సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం:**


రైతు సంక్షేమానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతులను ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓటమి నాయకులు ఎప్పటికప్పుడు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు. ఐదేళ్లపాటు మొద్దు నిద్రపోయిన జగన్మోహన్ రెడ్డి, స్థానికంగా మంత్రిగా పనిచేసిన కారుమూరి రైతుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. నవరత్నాలు పేరు చెప్పి నవ



మోసాలు చేసిన వైసీపీ నాయకులు రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచేసారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 ఇస్తామన్న హామీను నిలబెట్టుకున్నామని అన్నారు. యూరియా కొరత అంటూ ముసలి కన్నీరు కారుస్తున్న కారుమూరికి తణుకు నియోజకవర్గంలో ఎక్కడ కొరత ఏర్పడిందో చెప్పాలని కోరారు. ఇటీవల రబీకు సంబంధించి 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి ఒక నెల ఆలస్యంగా అయినా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో ఆరు నెలలకు కూడా రైతులకు డబ్బులు జమ కాలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి బకాయిలు ఉంచిన రూ.1600 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. వైసీపీలో ఉన్న రైతులతో మాట్లాడితే వాస్తవాలు తెలుస్తాయని హితవు పలికారు. రైతుల గురించి వ్యవసాయం గురించి మాట్లాడే అర్హత జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి కారుమూరికి అర్హత లేదని అన్నారు. రైతు పోరుబాట పేరుతో వైసిపి దగా కోరు బాట నిర్వహిస్తోందని ఎమ్మెల్యే రాధాకృష్ణ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అన్న దాతల పోరు పోస్టర్ ఆవిష్కరణ.

ఆత్తిలి – సెప్టెంబర్ 7( ప్రభాత వార్త ):అత్తిలి మండలం అత్తిలి గ్రామంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సెప్టెంబర్ 9వ తేదీన చేపట్టనున్న "ఎరువుల బ్లాక్ మార్కెట్, గిట్టుబాటు ధరపై అన్నదాతల పోరు – రైతన్నలకు బాసటగా వైయస్సార్సీపీ" కార్యక్రమ పోస్టర్ ను మాజీ మంత్రి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆవిష్కరించారు. వైసీపీ నాయకులు భరణి ప్రసాద్, జెడ్పి కోఆప్టెడ్ సభ్యుడు హ్యాబిబుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షులు రంభ సూరిబాబు,మద్దాల బాపిరాజు, రాపెటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



## యూరియా సమపాళ్లలో వినియోగించాలి

### - వ్యవసాయ అధికారి శివశంకర్

చాట్రాయి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త : యూరియాను మురిపంటకు సమపాళ్లలో వినియోగించాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ చెప్పారు. చాట్రాయి మండలం బూరుగు గూడెం, నరసింహారావు పాలెం సహకార సంఘాల ద్వారా 25 మెట్రిక్ టన్నుల యూరియాను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు ఎకరాకు యూరియా ఏ దశలో ఏవిధంగా చల్లా లో ఆయన రైతులకు వివరించారు. రైతులు పండించే ప్రతి పంట ఈక్రాప్ ద్వారా నమోదు చేయడం జరిగిందని గ్రామ రైతు సేవ కేంద్రాలలో మొన్న వ్యవసాయ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నానని చెప్పారు. వరి పైరుకు ప్రస్తుతం రెండు మూడు కోటాల వేయు దశలో ఉన్నదని అందువల్ల రైతులందరికీ అందుబాటులోకి వీడియో తీసుకు వస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నరసింహారావు



పాలెం గ్రామంలో యూరియా పొందిన రైతు సింగపాము వెంకటేశు కు యూరియా తల్లి విధానాన్ని వ్యవసాయ అధికారి తెలియచెప్పారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందే పని లేదని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు యూరియా పరిస్థితి పై నివేదిక అందిస్తున్నామని అందువల్లే సహకార సంఘాలకు యూరియా వస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముఠా హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

### ఏ.ఐ.టి.యు.సి రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్

**నూజివీడు, సెప్టెంబరు07 ప్రభాతవార్త:** :ముఠా హమాలి కార్మికుల మహాసభ స్థానిక ముఠా కార్మిక భవన్లో ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటియుసి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని. వెంకట రామారావు మాట్లాడుతూ ముఠా హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మిక హక్కులపై నిరంకుశ దాడులకు పాల్పడుతున్న కార్పొరేట్ వర్గాల తీరుపై ఉద్యమించడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా దేశంలో అసమానతలు,పేదరికం పెరిగిపోతున్నాయని, పేదల విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండగా, ధనికులు మరింత ధనికులుగా మారుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ లను అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అదే జరిగితే కార్మికులు కట్టు బానిసలుగా మారిపోతారని అన్నారు. కార్మికులకు సంఘాలు పెట్టుకునే హక్కు,సమ్మె హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే సాంకేతికత పేరుతో కార్మిక వర్గంపై ఒత్తిడి పెంచుతున్నారని 8 గంటల పని విధానం కుంటుపడుతోందన్నారు. పనిగంటలు పెంచడంతోపాటు వర్క్ ఫ్రం హోం . పేరుతో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఈ రకమైన వైఖరిని అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. సమస్యల నుండి ప్రజల దృష్టిని మరలించడం కోసం మతతత్వ రాజకీయాలకు మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల పరం చేసి కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు కార్మిక వర్గం ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస డంగే, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి ఎం.నరసింహ ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక:**

ఈ కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.



నూజివీడు ముఠా యూనియన్ గౌరవ అధ్యక్షులుగా చలసాని వెంక రామారావు, అధ్యక్షులుగా ఎం. రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ గా క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శిగా కే దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శిగా పీ.నాగేశ్వరరావు, ట్రెజరర్ గా టి. శ్రీరాములు, కమి సభ్యులుగా జి శ్రీనివాసరావు, కే వెంకట్రావు, ఏ సత్యనారాయణ ఎం సురేష్, కే అవతారం, ఎస్ కన్నమ నాయుడు, కే రామకృష్ణ ఎం లక్ష్మణరావు, ఎస్ శ్రీనివాసరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడ జరిగింది.

## మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు





ఏలూరు, ఆగస్టు 7 ( ప్రభాత వార్త) : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి పి . రాజబాబు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మరియు అసిస్టెంట్ బీటీ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఏలూరులోని పలు పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలను ఆదివారం రాజబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను ఎటువంటి సమస్యలు లేకుండా నిర్వహించాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అభ్యర్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని, త్రాగునీరు వంటివి అందించాలన్నారు. ఈ పరీక్షలు ఆఫ్‌లైన్ OMR విధానంలో ఉదయం 10.00 నుండి 12.30 వరకు, మధ్యాహ్నం 3.00 నుండి సాయంత్రం 5.30 వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. జిల్లాలోని 17 పరీక్షా కేంద్రాలలో మొత్తం 7078 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఉదయం సెషన్ లో జరిగే పరీక్షలకు 6128 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 6128 అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారని, 1017 మంది పరీక్షలకు హాజరు కాలేదన్నారు. ఏలూరు నరసింహారావుపేటలోని శ్రీ చైతన్య కళాశాలలు, సి.ఆర్. రెడ్డి పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు, సత్రంపాడులోని జిల్లాపరిషత్ హై స్కూల్ లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలను, ఆయా కేంద్రాలలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను రాజబాబు పరిశీలించారు. కార్యదర్శి వెంట జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కలిగిపూడి సరోజినికి పితాని నివాళులు,



పెనుమంట్ర ప్రభాతవార్త : మండలలో బ్రాహ్మణ చెరువు తెలుగుదేశం పార్టీ తరఫున ఏకైక ఎస్సీ అభ్యర్థి కలిగిపూడి సరోజినీ అనారోగ్యంతో మృతి చెందారు. సరోజినీ పార్థిక దేహం పై ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ఆమెకు నివాళులర్పించారు. కలిగిపూడి సరోజినీ పెనుమంట్ర మండల పరిషత్ అధ్యక్షురాలుగా 2014 లో బాధ్యతలు తీసుకొని 2019 వరకు పెనుమంట్ర ఎంపీపీగా పార్టీ పరంగా మంచి గుర్తింపు తెచ్చుకుని పెనుమంట్ర గ్రామంలో ఉన్న ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతిపై అప్పటి కార్మిక శాఖ మంత్రివర్యులు పితాని సత్యనారాయణ ద్వారా అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సి బి సి ఐ డి ఎంక్వయిరీ వేయించడం జరిగింది. అప్పట్లో రైతులకు రుణమాఫీ విషయంలో జరిగిన సంఘటనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ. 32.00 కోట్ల రూపాయల అవినీతిని బయట పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బుల్లి రామిరెడ్డి, మాజీ టిడిపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సత్తి సాయి ఆదినారాయణ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ చింతపల్లి సత్యనారాయణ, రాష్ట్ర విఆర్ఓ సంఘం అధ్యక్షులు. భూపతిరాజు రవీంద్ర రాజు ,గ్రామ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు గంట వాసు, సూరయ్య, కిషోర్, బబ్బి, బండ, సురేష్, త్రిమూర్తులు, కనకారావు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జుత్తిగ పిఎసిఎస్ ను జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ,



పెనుమంట్ర–ప్రభాతవార్త : మండలంలోని జుత్తిగ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎదురవుతున్న సమస్యల గురించి స్వయంగా తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని అన్నారు. ముఖ్యంగా యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. యూరియా కొరతపై ఆందోళన అవసరం లేదని రైతులకు సూచించారు. ఎరువులు, పురుగుమందుల విక్రయాల్లో ఎలాంటి దోపిడీకి తావులేకుండా చూడాలని, అసలు ధర కు మించి ధరలు వసూలు చేస్తే సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## గ్రహణంతో మూత పడిన దేవాలయాలు.

అత్తిలి –సెప్టెంబర్ 7 (ప్రభాత వార్త ):చంద్రగ్రహణం సందర్భంగా అత్తిలి మండలంలోని దేవాలయాలు ఆదివారం మధ్యాహ్నం మూసి వేశారు. గ్రహణం రాత్రి సంభవిస్తున్నందున ఆలయాలను మూసివేసి సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం దేవాలయాలను తెరవ ను న్నట్లు ఆలయాల అర్చకులు తెలిపారు.అత్తిలి లో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి,, ఉమా సిద్దేశ్వర స్వామి,వెంకటేశ్వర స్వామి, గోపాలస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలను మూసివేశారు.

## పారిజాత గిరి ఆలయం మూసి వేయబడింది

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: పట్టణంలోని గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మహా నివేదన అనంతరం మూసివేశారు. మరల సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి స్వామివారి దర్శనం ఉంటుందని ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు.

## గురుబ్రహ్మ అవార్డు అందుకున్న డా. తిరువీధుల రాజరాజేశ్వరి

ప్రభాతవార్త పాలకొల్లు : స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు.విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సేవాసంస్థ మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన పురస్కార మహోత్సవ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యనిర్వాహక సభ్యులు మరియు విజయవాడ నగర ప్రముఖుల చేతులమీదగా రాజరాజేశ్వరి ఈ అవారును అందుకున్నారు.సామాజిక సేవాకార్యక్రమాలలోనూ,విద్యారంగంలోనూ విశేషంగా కృషిచేసిన వారికి ప్రతి సంవత్సరం గురుబ్రహ్మ అవార్డుతో సత్కరిస్తుంటామని మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వహకులు తెలియజేసారు. గురుబ్రహ్మ అవార్డు అందుకున్న కళాశాల ప్రిన్సిపాల్ డా రాజరాజేశ్వరి కి కాలేజీ డెవలప్ మెంట్ కౌన్సిల్ సెక్రటరీ డా వీరరాఘవయ్య ,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ టి కృష్ణ,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

## ఘనంగా అన్న సమారాధన.



అత్తిలి– సెప్టెంబర్ 2( ప్రభాత వార్త): అత్తిలి పెద్ద వంతెన వద్ద గల వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రకాల స్వీట్లు, పులిహెూరా, కూరగాయలతో అన్నసమారాధన జరిపారు. నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరు సురేష్,మండల ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, టిడిపి నాయకులు ఆల్తి సత్యనారాయణ, కొరిపల్లి ప్రసాద్, మెంతు రాజకుమార్,కొరిపల్లి విజయకుమార్, వైట్ల రుద్రరాజు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: ఏలూరు జిల్లా కైకలూరు మండలం దానగూడెం మాల దళితులపై జనసేన పార్టీ కాపు సామాజిక వర్గం అత్యంత కిరాతకంగా మారణాయుధాలతో దాడి చేసి, గాయపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర రాజ్యాంగాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందుగుల ఫ్రాన్సిస్, డాక్టర్ అలుగు ఆనంద్ శేఖర్, తొర్లపాటి శ్రీనివాస్, కలపాల రాజకుమార్, ఎం. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లు పట్టివేత



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: టుబాకో బోర్డు విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారం ప్రకారం 6వ తేదీన వేగవరం గ్రామ సమీపాన్న లేలాండ్ దోస్తీ లో అక్రమంగా తరలిస్తున్న సుమారు 12 ఎఫ్ సి వి పొగాకు బాళ్లను బోర్డు విజిలెన్స్ అధికారులు స్వాధీన పర్చుకున్నారు. ఈ బేళ్లను అక్రమ రవాణాగా గుర్తించి జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు కు తరలించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి సునీల్ కుమార్, సాయి ప్రశాంత్,గణేష్,బోర్డు సిబ్బంది ఠాగూర్,వంశి,హర్ష, తదితరులు పాల్గొన్నారు.

## క్వాంటం టెక్నాలజీతో దేశ అభివృద్ధి

నూజివీడు,సెప్టెంబర్ 07 ప్రభాతవార్త:ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వైపు చురుగ్గా వెళ్తున్నట్టే క్వాంటం టెక్నాలజీస్ వైపు కూడా మగ్గు చూపించాలనే ఉద్దేశంతో ట్రిబుల్ ఐటీ యాజమాన్యం,ఆదివారం ఉదయం ఐబీఎం క్వాంటం ఇండియా లీడ్ ఎల్వి. సుబ్రహ్మణ్యం తో లెక్చర్ సీరీస్ ప్రారంభించారు . ప్రపంచ దేశాల్లో భారత దేశాన్ని ముందు దశలో ఉంచడం తన ఆశయం అని తెలిపారు. విద్యార్థులకు క్వాంటం టెక్నాలజీస్ పైన అవగాహన కల్పించి వారి సందేహాలను తొలగించారు. తదనంతరం సిడి ఏసి నాలెడ్జ్ అసోసియేట్ అయిన అభిజిత్ తేజ్ వద్దేబోయిన , క్వాంటం టెక్నాలజీస్ పైన విద్యార్థులకు కావలసిన రిసోర్సెస్ ను అందించారు. అభిజిత్ ట్రిబుల్ ఐటీ పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఈ కార్యక్రమంలో నూజివీడు రిజిస్ట్రార్ డైరెక్టర్ అయిన ప్రొ.అమరేంద్ర కుమార్ , ఏ.వో. డా. బి .లక్ష్మణరావు , సెంట్రల్ డి ఓ ఏ శ్రావణి , ఈఐటిపి డీన్ పి శ్యామ్, ఇతర అధ్యాపకులు, ఉపాధ్యాయులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు వస్తున్న ఇన్చార్జి మంత్రి

ఏలూరు ప్రభాతవార్త :రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి,జిల్లా ఇన్చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 8వ తేదీ ఏలూరు రానున్నారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్ లో ఎరువుల సరఫరా పై అధికారులతో సమీక్షించనున్నారు.సమావేశంలో గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, శాసనసభ్యులు పాల్గొననున్నారు.

# సైమా.. 2025 అవార్డ్స్ ఉత్తమ నటుడు అల్లు అర్జున్

**ప్రతిష్ఠాత్మక** సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) 2025 వేడుకలు దుబాయ్‌లో ఘనంగా జరిగాయి. దుబాయ్ ఎగ్జిబిషన్ సెంటర్, ఎక్స్‌పో సిటీలో అంగరంగవైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో తొలిరోజు తెలుగు చిత్రాలకు అవార్డులు అందజేశారు. ఉత్తమ చిత్రంగా కల్కి ఎంపికైంది. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ దర్శకుడిగా సుకుమార్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్)గా ప్రశాంత్ వర్మ, ఉత్తమ నటుడు (క్రిటిక్స్)గా తేజ సజ్జా అవార్డులు అందుకున్నారు.

**సైమా2025 అవార్డ్ విన్నర్స్ (తెలుగు)**

ఉత్తమ చిత్రం – కల్కి
ఉత్తమ దర్శకుడు – సుకుమార్
ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) – ప్రశాంత్ వర్మ
ఉత్తమ నటుడు – అల్లు అర్జున్
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) – తేజ సజ్జా
ఉత్తమ నటి – రష్మిక మందన్నా
ఉత్తమ నటి (క్రిటిక్స్) – మీనాక్షి చౌదరి
ఉత్తమ సహాయ నటుడు – అమితాబ్ బచ్చన్
ఉత్తమ సహాయ నటి – అన్నే బెన్
ఉత్తమ సంగీత దర్శకుడు – దేవి శ్రీ ప్రసాద్
ఉత్తమ గీతరచయిత – రామ్ జోగయ్య శాస్త్రి
ఉత్తమగాయకుడు – శంకర్ బాబు కందుకూరి
ఉత్తమగాయని – శిల్పారావు
ఉత్తమ ప్రతినాయకుడు – కమల్‌హాసన్
ఉత్తమ పరిచయ నటి – పంకూరి, భాగ్యశ్రీ బోర్సే
ఉత్తమ పరిచయ నటుడు – సందీప్ సరోజ్
ఉత్తమ పరిచయ దర్శకుడు – నంద కిషోర్ యేమని
ఉత్తమ కొత్త నిర్మాత – నిహారిక కొణిదెల
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ – రత్నవేలు
ఉత్తమ హాస్యనటుడు – సత్య.



## రెండు అవార్డులతో సత్తాచాటిన 'కమిటీ కుర్రోళ్లు'



పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై పద్మజ కొణిదెల, జయలక్ష్మి ౖ అడపాక నిర్మించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. నటిగా, నిర్మాతగా నిహారిక కొణిదెల ఈ చిత్రంతో అవార్డులు, రివార్డులు అందుకుంటూనే ఉన్నారు. థియేటర్లో కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించింది. రూ.9 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ థియేట్రికల్‌గా రూ.18.5 కోట్లు వసూళ్లను రాబడితే, నాన్ థియేట్రికల్‌గా రూ.6 కోట్లు బిజినెస్ జరిగింది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో 'కమిటీ కుర్రోళ్లు' మూవీకి మంచి గుర్తింపు లభించింది.

## రేపటి నుంచి 'మన శంకరవరప్రసాద్ గారు' సాంగ్ షూటింగ్

**మెగాస్టార్ చిరంజీవి,** హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ప్రస్తుతం, చిరంజీవి, నయనతార, ఇతర ప్రధాన తారాగణం కీలకమైన టాకీ పార్ట్ షూటింగ్‌లో బిజీగా వున్నారు.

రేపటి నుంచి మెగాస్టార్ చిరంజీవి, నయనతారలపై ఒక పాటను హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నారు. చార్ట్‌బస్టర్, మాస్‌అప్పీల్ ట్రాక్‌లను అందించడంలో పాపులరైన భీమ్స్ సిసిరోలియో ఈ సినిమా కోసం అద్భుతమైన ఆల్బమ్‌ను రూపొందించారు. ఈ పాటను డ్యాన్స్ మాస్టర్ విజయ్ పోలంకి కొరియోగ్రఫీ చేస్తారు. ఫస్ట్ లుక్, గ్లింప్స్, వినాయక చవితి స్పెషల్ పోస్టర్ అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. చిరంజీవిని స్టైలిష్ బెస్ట్ అవతార్‌లో ప్రజెంట్ చేయడం అభిమానులని అలరించింది.

ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, తమ్మిరాజు ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహ రచయితలుగా ఉన్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. మేకర్స్ ఇటీవలే అనౌన్స్ చేసినట్లుగా..మన శంకర వర ప్రసాద్ గారు 2026 సంక్రాంతి పండుగకు వస్తున్నారు.

తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, విటివి గణేష్



రచన, దర్శకత్వం అనిల్ రావిపూడి
నిర్మాతలు సాహు గారపాటి సుస్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్
సమర్పణ శ్రీమతి అర్చన
సంగీతం భీమ్స్ సిసిరోలియో
డీవోపీ సమీర్ రెడ్డి
ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్
ఎడిటర్ తమ్మిరాజు
రచయితలు ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎస్ కృష్ణ
జునీశ్రీ సూపర్‌వైజర్ లవన్ కుషన్ (దీగిలీ), నరేంద్ర లోగిసా
లైన్ ప్రొడ్యూసర్ నవీన్ గారపాటి
ఎడిషినల్ డైలాగ్స్ అజ్జు మహంకాళి, తిరుమల నాగ్
చీఫ్ కోడైరెక్టర్ సత్యం బెల్లంకొండ
పిఆర్ఒ: వంశీశేఖర్, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా

## రాంచరణ్- సుకుమార్ సినిమాలో హీరోయిన్‌గా రుక్మిణి!




**గ్లోబల్ స్టార్ రాం చరణ్** పెద్ది తర్వాత చేస్తున్న సినిమా సుకుమార్ డైరెక్షన్‌లో ఉంటుందని తెలిసిందే. సుకుమార్ చరణ్ ఈ కాంబినేషన్ అంటే చాలు మరో రంగస్థలం లాంటి సినిమా వస్తుందని మెగా ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. పెద్ది తర్వాత చరణ్‌తో సుకుమార్ మరో క్రేజీ సినిమాతో రాబోతున్నారు. ఈ సినిమా కథ ఓకే అవ్వగా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఐతే ఈ సినిమాలో హీరోయిన్ విషయంలో ఒక కన్ ఫర్మేషన్ వచ్చేసినట్టు తెలుస్తుంది. ఇంతకీ చరణ్‌తో జత కట్టే ఆ ఛాన్స్ ఎవరికి ఇస్తారంటే అది కన్నడ భామ రుక్మిణి వసంత్ అని టాక్. కన్నడ నుంచి వచ్చే హీరోయిన్స్‌కి తెలుగులో మంచి క్రేజ్ ఉంటుంది. అంతేకాదు వాళ్ల టాలెంట్‌తో ఆడియన్స్ కూడా ఇంప్రెస్ అవుతారు. సప్త సాగరాలు దాటి సినిమాతో పాపులర్ అయిన రుక్మిణి ఆ సినిమాతోనే యూత్ ఆడియన్స్‌ని మెప్పించింది. ఆ సినిమా తర్వాత రుక్మిణిని ఫాలో అయ్యే ఆడియన్స్ సంఖ్య పెరిగింది. లేటెస్ట్‌గా మదరాసి సినిమాతో వచ్చిన రుక్మిణి అందులో కూడా ఇంప్రెస్ చేసింది. ఇక తెలుగులో ప్రస్తుతం ఎన్‌టిఆర్ ప్రశాంత్ నీల్ కాంబో సినిమాలో నటిస్తుంది అమ్మడు. ఆ నెక్స్ట్ ఎవరితో చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ఐతే మదరాసి తెలుగు ప్రమోషనల్ ఇంటర్వ్యూస్‌లో రుక్మిణి తనకు చరణ్ అంటే చాలా ఇష్టమని చెప్పింది. సో మెగా ఫ్యాన్స్ సుకుమార్ సినిమాలో చరణ్‌కి జతగా రుక్మిణిని ఫిక్స్ చేయండని అడిగేస్తున్నారు.

రుక్మిణి వసంత్ కూడా తప్పకుండా చరణ్‌తో సినిమా ఛాన్స్ అంటే నో చెప్పదు కావొచ్చు. సో చరణ్, రుక్మిణి వసంత్ కాంబోని సుకుమార్ ఫిక్స్ చేస్తే మాత్రం మెగా ఫ్యాన్స్ సూపర్ ఖుషి అవుతారు. తెలుగులో కూడా రుక్మిణికి మంచి ఫ్యాన్ బేస్ ఏర్పడింది. తారక్ సినిమా రిలీజ్ తర్వాత అమ్మడి రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంటుంది.

రుక్మిణి వసంత్ కూడా సౌత్‌లో ముఖ్యంగా తెలుగు, తమిళ్‌లో తనకు వస్తున్న ఈ క్రేజీ ఫాలోయింగ్ చూసి సర్ ప్రైజ్ అవుతుంది. సప్త సాగరాలు దాటి సినిమా రెండు భాగాల్లో ఆమె నటన యూత్‌కి నచ్చేసింది. ఆ సినిమాలో ప్రియ రోల్‌లో ఆకట్టుకున్న రుక్మిణి ప్రేక్షకుల హృదయాల్లో కూడా ప్రియమైన వ్యక్తిగా నిలిచింది.

సో తెలుగులో కూడా స్టార్ ఛాన్స్‌లు అందుకుంటుంది కాబట్టి అటు రష్మిక తర్వాత టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా రుక్మిణి అదరగొట్టే ఛాన్స్ ఉన్నట్టే కనిపిస్తుంది. మరి రుక్మిణి నెక్స్ట్ లైనప్ ఎలా ఉంది.. ఆ ఫలితాలు ఆమెను ఏ ప్లేస్‌లో నిలబెడతాయి అన్నది చూడాలి.

## 'భద్రకాళి' నుంచి పవర్ ఫుల్ సాంగ్ రిలీజ్



**తెలుగు ప్రేక్షకులను** అలరించిన ..మార్గన్. విజయం తర్వాత విజయ్ ఆంటోనీ మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్‌తో 'భద్రకాళి' వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్‌మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ తాజాగా జిల్ జిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని పవర్ ఫుల్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. భోలే షావలి స్వయంగా రాసి పాడిన ఈ సాంగ్ హై ఎనర్జీతో ఆకట్టుకుంది. సాంగ్‌లోని పవర్ ప్యాక్డ్ విజువల్స్ సినిమాపై చాలా క్యూరియాసిటీ పెంచాయి. తెలుగులో మార్గన్ సినిమాను విజయం దిశగా నడిపించిన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను కూడా తెలుగులో రిలీజ్ చేస్తుంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఉండడంతో ప్రాజెక్ట్‌పై మంచి బజ్ ఉంది. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తున్నారు. షెల్లీ కాలిస్ట్ డీవోపీ, విజయ్ ఆంటోనీ స్వయంగా మ్యూజిక్ అందిస్తున్నారు. రేమండ్ డెరిక్ ఎడిటర్. రాజశేఖర్ ఫైట్ మాస్టర్. శ్రీరమన్ ఆర్ట్ డైరెక్టర్. తెలుగులో డైలాగ్స్‌ని రాజశేఖర్ రెడ్డి రాశారు. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది.

## డైమండ్ మెరుపుల చీరలో క్వీన్ వైబ్స్



**అవును.. చూడగానే** రాణిని తలపిస్తోంది. వజ్రంలోని మెరుపులు కెంపుల సొగసు ఆమె మేని విరుపుల్లో కనిపిస్తున్నాయి. ఇంతకీ ఎవరు ఈ క్వీన్? అంటారా? బర్మింగ్‌హామ్ 2025లో కరీనా కపూర్ ఖాన్ తనదైన అద్భుత సౌందర్యంతో యువత రాన్ని ఆకర్షించింది. ప్రఖ్యాత డిజైనర్ మనీష్ మల్హోత్రా రూపొందించిన ఈ వజ్రాల మెరుపుల చీరలో కరీనా రారాణిని తలపించిందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. సీక్విన్స్ అండ్ ఫ్లూయిడ్ డిజైన్.. లిక్విడ్‌మెటల్ ఫినిషింగ్‌తో అలంకరించిన ఈ చీర కరీనా అందాన్ని పదింతలు పెంచిందని చెప్పాలి. సాంప్రదాయ చీరకట్టుకు తగ్గట్టు బోల్డ్ హాల్టర్‌నెక్ బ్లౌజ్‌తో కరీనా క్లాసిక్‌గా కనిపించింది. ఈ ఫోటోలకు బర్మింగ్‌హామ్ 2025 అని క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్‌లో జోరుగా వైరల్ అవుతున్నాయి. మెరిసే డైమండ్ చాంద్‌బలి చెవిపోగులు, చక్కని గాజుతో యాక్సెసరైజ్ చేసిన ఈ ఆభరణాలు అందాన్ని మరింత పెంచాయి. బెబో కరీనా ఫ్యాషన్ సెన్స్ ఎప్పుడూ ప్రత్యేకమైనది! అంటూ కితాబిచ్చేస్తున్నారు యువతరం. టైమ్‌లెస్ స్టైల్ ఐకాన్ అనే పదానికి కరీనా ఒక సింబల్. ఈవెంట్ కోసం విచ్చేసిన కరీనా బ్లాక్ కార్ నుంచి నేరుగా లగ్జరీ హోటల్‌లో అడుగుపెట్టింది. లాంజ్ నుంచి బయటకు వెళ్లి చూడగానే, భారీ ఫాలోవర్స్ వీధి పొడవునా కనిపిస్తున్నారు. మొత్తానికి పాపులర్ డైమండ్స్ మర్చెంట్‌కి ప్రచార హంగామా హోరెత్తిపోతోంది. ఎంపిక చేసుకున్న బ్రాండ్‌కి బెబో పర్ఫెక్ట్ యాప్ట్ మోడల్ అని చెప్పాలి. తైమూర్ అలీఖాన్, జేహ్ జన్మించాక కరీనా కపూర్ ఖాన్ కొంత కాలం సినిమాలకు దూరమైంది. కానీ ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లవుతుంటే, తిరిగి నటిగా బిజీ అవుతోంది.

## వాణీ విశ్వనాథ్ కూతురికి తెలుగులో క్రేజ్!



సినీ ఇండస్ట్రీలో ఒక వెలుగు వెలిగిన తర్వాత.. తమ తదనంతరం తమ వారసులకి కూడా ఇండస్ట్రీలో అదే హోదా కల్పించాలని సెలబ్రిటీలు ప్రయత్నాలు చేస్తూ ఉంటారు.. అందులో భాగంగానే వారసులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తూ.. తమ బాధ్యతను నెరవేర్చుకుంటూ ఉంటారు. అయితే ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత సక్సెస్ అందుకోవడం అనేది ఆ వారసులపైనే ఆధారపడి ఉంటుంది. ఇప్పటికే ఎంతోమంది సెలబ్రిటీలు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు..అందులో కొంతమంది గ్లోబల్ స్టార్ గా మారితే.. మరికొంతమంది పత్తా లేకుండా పోయారు. ఇదిలా ఉండగా ఇప్పుడు ఒక సీనియర్ హీరోయిన్ కూతురు మాత్రం తెలుగులో భారీ క్రేజ్ సొంతం చేసుకుంది..తన అందాలతో ప్రేక్షకులను అలరిస్తోంది కూడా ఆమె ఎవరో కాదు ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగిన హీరోయిన్ వాణి విశ్వనాథ్ కూతురు. ఒకప్పుడు వాణీ తెలుగు, మలయాళం చిత్రాలలో దాదాపు అందరి స్టార్ హీరోలతో నటించి మెప్పించింది. అలాంటి ఈమె ఇప్పుడు తన కూతుర్ని ఇండస్ట్రీకి పరిచయం చేసింది. వాణీ విశ్వనాథ్ కూతురు ఇప్పటికే మూడు తెలుగు సినిమాలలో నటించగా.. ఇప్పుడు మరో నాలుగో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆమె ఎవరో కాదు వర్షా విశ్వనాథ్. వాణి విశ్వనాథ్ చెల్లెలు ప్రియా విశ్వనాథ్ కుమార్తెనే ఈ ముద్దుగుమ్మ. 2022లో 'రెడ్డి గారి ఇంట్లో రౌడీయిజం' అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది వర్షా విశ్వనాథ్. ఈ సినిమా పెద్దగా ప్రేక్షకులను మెప్పించలేదు. మలయాళంలో కూడా ఒక సినిమా చేసింది కానీ అది కూడా ప్రేక్షకులను పెద్దగా అలరించలేదు. ప్రస్తుతం 'మటన్ సూప్' అనే సినిమాలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## 'మిరాయ్' పండగ లాంటి సినిమా
### కన్నడ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో ధ్రువా సర్జా



**సూపర్ హీరో** తేజ సజ్జా మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా సూపర్ హీరో విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, ట్రైలర్ మ్యాసీవ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. సెప్టెంబర్ 12న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా మేకర్స్ బెంగళూరులో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో ధ్రువ సర్జా ముఖ్య అతిధిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో ధ్రువా సర్జా మాట్లాడుతూ, 'సెప్టెంబర్ 12న ఒక పండగ లాంటి మిరాయ్ సినిమా విడుదలవుతుంది. చాలా అద్భుతమైన నటీనటులు టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం పని చేశారు. తేజ, మంచు మనోజ్, జగపతిబాబు, జయరాం డైరెక్టర్ కార్తిక్ టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. విశ్వప్రసాద్ చాలా పాషనేట్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని చాలా అద్భుతంగా నిర్మించారు. తేజ చేసిన హనుమాన్ సినిమా నాకు చాలా ఇష్టం. మిరాయ్ టీజర్ ట్రైలర్ చాలా అద్భుతంగా ఉన్నాయి. తప్పకుండా ఈ సినిమాని కన్నడ ప్రేక్షకులందు చూసి గొప్పగా ఆదరిస్తారని కోరుకుంటున్నాను.

హీరో తేజా సజ్జా మాట్లాడుతూ,కన్నడ ప్రజలందరికీ నమస్కారం. ఇంత వానలో మాకోసం వచ్చినందుకు చాలా థాంక్స్. మీ ప్రేమను నిలబెట్టుకోవడానికి ఎంత కష్టమైనా పడతాను. మీ ప్రేమ నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చిన యాక్షన్ ప్రిన్స్ ధ్రువ అన్నకి థాంక్యూ సోమచ్. హనుమాన్ సినిమాకి కూడా చాలా సపోర్ట్ చేశారు. ఆయన నాకు లక్కీ చార్మ్. ఈ సినిమాతో కూడా అది రిపీట్ కాబోతోంది. మిరాయ్ యాక్షన్ అడ్వెంచర్స్ ఫాంటసీ గ్రేట్ ఎక్స్‌పీరియన్స్ ఉన్న ఫిల్మ్. పిల్లలు పెద్దలు అందరూ కలిసి థియేటర్లో ఎక్స్‌పీరియన్స్ చేయిదగ్గర సినిమా. అందరూ తప్పకుండా థియేటర్స్‌కి రండి. చాలా బిగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తాం. మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నాను. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు. భవిష్యత్తులో కూడా నా సినిమాలన్నీ బెంగుళూరులో రిలీజ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.


నిర్మాత విశ్వప్రసాద్ మాట్లాడుతూ, మీ అందరి సపోర్ట్‌కి ధన్యవాదాలు. మా సినిమాని సపోర్ట్ చేయడానికి వచ్చిన ధ్రువకి థాంక్యూ సో మచ్. ఆయనతో కలిసి సినిమా చేయబోతున్నాం. మిరాయ్ కోసం చాలా హార్డ్ వర్క్ చేసాం. చాలా లార్జ్ స్కేల్లో తీసిన సినిమా ఇది. మీ అందరిని అలరిస్తామని నమ్మకం ఉంది. సెప్టెంబర్ 12న అందరూ థియేటర్స్‌కి వచ్చి ఈ మిరాయ్ ఎక్స్‌పీరియన్స్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు.

## ప్రభాస్‌ని చూసి భయపడ్డా: సందీప్ రెడ్డి వంగా



**సెన్సేషనల్ చిత్రాల** దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం తన నెక్స్ చిత్రం స్పిరిట్ కోసం రెడీ అవుతున్నాడు. ఇక ఈ సినిమాలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో సందీప్ రెడ్డి ఎలాంటి ఫీట్స్ చేయిస్తాడా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, తాజాగా ఓ టాక్ షోలో మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా.. తాను ప్రభాస్‌ని చూసి భయపడిన విషయాన్ని రివీల్ చేశాడు. తనకు బాహుబలి 2 చిత్ర ఇంటర్వెల్ బ్యాంగ్ అంటే చాలా ఇష్టమని.. ఆ సినిమాలోని ఇంటర్వెల్‌లో ప్రభాస్ పర్ఫార్మెన్స్ చూసి అందరు కేకలు వేస్తూ అరవడం తాను ఇప్పటికీ మర్చిపోలేదని ఆయన అన్నారు. తాను అలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేయగలనా లేదా అనే సందేహంలో ఉన్నట్లు సందీప్ రెడ్డి తెలిపారు. మొత్తానికి ప్రభాస్ పర్ఫార్మెన్స్, క్రేజీ చూసి సందీప్ రెడ్డి భయపడటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మరి స్పిరిట్ సినిమాలో ఆయన ప్రభాస్‌ను ఎలా చూపెడతాడో వేచి చూడాలి.





రైల్వేస్టేషన్‌లో విధులంటే సవాలే కాదు సాహసోపేతం కూడా గుంపులుగుంపులుగా ప్రయాణికులు తరలివచ్చేప్పుడు ప్రమాదాలు జరగకుండా చూడాలి. చోరీల్ని నియంత్రించాలి. చాంతాడంత క్యూలో ఉన్న ప్రయాణికులకి రైలు వచ్చేలోగా టకటకా టికెట్లు జారీ చేయాలి. స్టేషన్‌లోకి వచ్చే, వెళ్లే రైళ్లకు పక్కాగా సిగ్నళ్లు ఇవ్వాలి. దీంతో క్షణం ఏమరుపాటుగా ఉన్నా జరిగే నష్టం అంతాఇంతాకాదు. ప్రయాణికులతో కిక్కిరిసిపోయే రైల్వే స్టేషన్ల నిర్వహణ ఆషామాషీ అసలే కాదు. ఇంత క్లిష్టమైన విధులను మహిళా రైల్వే ఉద్యోగులు

# కూ..చుక్ చుక్.. అన్నీ మనమే!



భుజాన వేసుకుని సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ విశేషమైన అంశం... ఆ రైల్వే స్టేషన్లలో బుకింగ్ క్లార్క్ నుంచి భద్రత చూసే పోలీసుల వరకు... మాస్టర్ నుంచి విచారణ సిబ్బంది వరకు అంతా మహిళలే. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తెలంగాణ లోని బేగంపేట, విద్యానగర్, గుండ్లపోచంపల్లి, ఆంధ్రప్రదేశ్‌లో రామవరప్పాడు, చంద్రగిరి రైల్వేస్టేషన్లలోని మహిళా అధికారులే ఆయా స్టేషన్లను చూసుకుంటూ, రైళ్ల రాకపోకలను విజయవంతంగా నడిపిస్తున్నారు.

అందరూ ఉద్యోగినులయ్యారు మహిళా ప్రయాణికులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆయా స్టేషన్లలో కమర్షియల్ క్లార్క్, ఎంక్వైరీ కమ్ రిజర్వేషన్ క్లార్క్, సగ్ఇన్ స్పెక్టర్, స్టేషన్ మాస్టర్ వంటి పోస్టుల్లో ఉద్యోగినులు ఉన్నారు. విజయవాడలోని వ్యాగన్ డిపోలోని ఓవర్‌హోలింగ్ విభాగంలో 35 మంది ఉద్యోగులే. గూడ్సు రైళ్ల వ్యాగన్ల నిర్వహణలో ఈ విభాగానిది కీలకపాత్ర. మహిళల విభాగం ఏర్పాటు తర్వాత ఇక్కడ పనితీరు మెరుగైందని దక్షణమధ్య రైల్వే అధికారులు చెబుతున్నారు. ❑


# 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'

# వాహనమేదైనా.. చోదక శక్తితో..

**కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి వయసుతో పనేముంది? అంటున్నారు కొందరు మహిళలు. ఈ కోరికనే లేటు వయసులో తమ ప్రతిభను చాటుతూ అందరిచేతా ఔరా డాక్ అనిపించుకుంటున్నారు. కేరళకు చెందిన మణి అమ్మ అలియాస్ రాధామణి ఇదే కోవకు చెందుతారు. ప్రస్తుతం 74 ఏళ్ల వయసున్న ఈ బామ్మ ఏ వాహనాన్నైనా ఇట్టే నడిపేయగలదు. ఇప్పటికే 11 రకాల డ్రైవింగ్ లైసెన్స్‌లు సంపాదించి..** ఎక్కువ లైసెన్స్‌లు పొందిన మహిళగా పేరు సంపాదించుకున్నారు. ఇక ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారీ గ్రానీ, ఇటీవల దుబాయ్ 'రోల్స్ ఘోస్ట్' కారు నడిపి అందరి దృష్టినీ ఆకర్షించారు రాధ. ఈ వీడియో సోషల్ మీడియాలో పంచుకోగా ప్రస్తుతం అది వైరలవుతోంది. ఈ వయసులోనూ ఆమె ప్రతిభ, నిండైన ఆత్మవిశ్వాసాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

**భర్త ప్రోత్సాహంతో....** రాధామణిది కేరళలోని తొప్పుంపడి అనే ప్రాంతం. ఆమె భర్త లలన్ 1970లో కొచ్చిలో 'డ్రైవింగ్ స్కూల్'ని కనుగొన్నారు. అక్కడే రాధామణి డ్రైవింగ్ కెరీర్ మొదలైంది. ఆమె మొదట కారు నడిపారు. అప్పటికి ఆమె వయసు 30 సంవత్సరాలు. అంటే నలభయ్యేళ్ల క్రితం అన్నమాట. నిజానికి ఆ సమయంలో ఆడవారు సైకిల్ తొక్కితేనే వింతగా చూసేవారు. అయితే రాధామణికి కూడా మొదట ఇలాంటి చేదు అనుభవాలే ఎదురయ్యా! అయినా భర్త ప్రోత్సాహంతో విజయవంతంగా కారు నడిపారు. అదే ఆసక్తితో, ట్రక్కు వంటి భారీ వాహనాలను నడపడం కూడా నేర్చుకున్నారు. అలా 1988లో 33 కిలోమీటర్ల దూరం పాటు బస్సు నడిపి భారీ వాహనాలు నడిపే లైసెన్సును పొందారామె. కేరళ రాష్ట్రంలోనే హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన మొదటి మహిళగా గుర్తింపు పొందారు.

**భారీ వాహనాలూ...** రాధామణి దంపతుల జీవితం డ్రైవింగ్ స్కూల్‌తో సాఫీగా గడిచిపోతున్న సమయంలో ఆమెకు అనుకోని సంఘటన జరిగింది. 2004లో ఓ ప్రమాదంలో రాధామణి భర్త లలన్ మరణించారు. దాంతో పిల్లలను పోషించడం కోసం తనే డ్రైవింగ్ స్కూల్ బాధ్యతలు తీసుకున్నారు. వందల మందిని డ్రైవింగ్‌లో నిష్ణాతుల్ని చేశారు. ఈ కావాలనే తానూ క్రేన్లు, ట్రక్కులు, ప్రొక్లెయినర్లు, రోడ్ రోలర్లు.. వంటి భారీ వాహనాలను నడపటం నేర్చుకున్నారు. ఇలా ఇప్పటివరకు 11 రకాల వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సలను సొంతం చేసుకున్నారు మణి అమ్మ. వయసు సహకరించి ఉంటే విమాన పైలట్, లోకో పైలట్ వంటి లైసెన్స్‌లు కూడా సంపాదించేదానిని ఓ సందర్భంలో



చెప్పుకొచ్చారీ బామ్మ.

**దుబాయ్ లో.. రోల్స్ రాయిస్‌లో.!** కేవలం ఇక్కడ భారీ వాహనాలు నడిపేందుకు కావాల్సిన లైసెన్స్‌లు పొందడమే కాదు.. విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి వాహనాలు నడిపేందుకు కావాల్సిన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ (ఐడీపీ)'నూ సొంతం చేసుకుంది. ఈ అవసరాలపైనే ప్రస్తుతం దుబాయ్ ట్రిప్లో ఉన్న ఆమె.. అక్కడి రోడ్ 'రోల్స్ రాయిస్ ఘోస్ట్' కారులో చక్కర్లు కొట్టారు. తెలుపు రంగు కసావు చీర ధరించి.. తన ఐడీపీని చూపిస్తూ, ఆపై దర్జాగా కారు నడుపుతూ.. ఇలా తన దుబాయ్ డ్రైవింగ్ జర్నీ ఓ చిన్న వీడియో రూపంలో ఇన్‌స్టాలో పోస్ట్ చేయబడింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. చాలామంది సూచనలూ.. ఈ వయసులోనూ ఆమె డ్రైవింగ్ ప్రతిభ, ఆత్మ విశ్వాసాన్ని ప్రశంసిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా జీవితాన్ని మనకు నచ్చినట్లుగా ఆస్వాదించడమెలాగో ఈ బామ్మను చూసి నేర్చు కోవచ్చు.. అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు.

**మహీంద్రా ప్రశం!** "తన డ్రైవింగ్ నైపుణ్యాలతో ఎంతోమంది దృష్టిని ఆకర్షించిన రాధ.. ఓసారి ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ప్రశంసలు అందుకున్నారు. ఆమె తన డ్రైవింగ్ వీడియోని తరచుగా ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో ఓ వీడియో మహీంద్రాను ఆకట్టుకుంది. ఆమె తన 'మండే మోటివేషన్' అంటూ రాధను ప్రశంసల్లో ముంచెత్తిన ఆమె దృష్టి సాదించాలన్న కోరిక. తనే నా మండే మోటివేషన్' అంటూ ఎక్స్‌లో రాసుకొచ్చారీ బిజినెస్ మ్యాన్. అప్పట్లో ఈ వార్త ట్రెండింగ్‌లో నిలిచింది.

**స్కూటీ నడపడమే ఇష్టం ..!** రాధామణి ప్రస్తుతం అటు డ్రైవింగ్ స్కూల్ బాధ్యతలు చూసుకుంటూనే.. ఇటు సందర్భం వచ్చినప్పుడల్లా స్టీరింగూ పట్టుకుంటున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు. మరో ఆసక్తికరమైన విషయమేంటంటే ఆమె కారు 10 ఏళ్ల తర్వాత బైక్ నడపడం నేర్చుకున్నారట. అయితే ఇన్ని భారీ వాహనాలు నడిపిన తనకు స్కూటీ తోలడమంటేనే ఎక్కువగా ఇష్టమంటూ ఓ సందర్భంలో సరదాగా చెప్పుకొచ్చారామె. ఇలా తన డ్రైవింగ్ నైపుణ్యాలతో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ గ్రానీ.. ఈ రంగంలో మహిళలకు అనేక ఉపాధి అవకాశాలున్నాయని.. వాటిని అందిపుచ్చుకోవడానికి మహిళలు ధైర్యంగా ముందుకు రావాలంటూ వాళ్లలో స్ఫూర్తి నింపుతున్నారు. 11 డ్రైవింగ్ లైసెన్స్‌లతో 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించిన రాధామణి.. 'ఇన్‌స్పిరేషనల్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2022' అవార్డును అందుకున్నారు. ❑

# శక్తికి రూపాలు ఈ మొలకలు



**మహిళలు ఇంటిల్లిపాది ఆకలిని తీరుస్తారు కానీ, తమ శరీరానికి అవసరమయ్యే పోషకాలు తగినంతగా అందుతున్నాయా లేదా అన్నది గమనించండి. దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తప్పవు. వీటిని సులువుగా అధిగమించాలంటే తృణధాన్యాలతో చేసిం మొలకలు చక్కగా ఉపయోగపడతాయి. అదెలాగో తెలుసుకుందామా!**

**రాగి, సజ్జ, జొన్నలు, కొర్రలు...** వంటి చిరుధాన్యాల మొలకల్లో ఫోలెట్, ఇనుము, విటమిన్ సి, జింక్, మెగ్నీషియం, ప్రొటీన్... ఎక్కువగా ఉంటాయి. ఇవి మొలకెత్తే ప్రక్రియ... ఫైటిక్ యాసిడ్ స్థాయులను తగ్గిస్తుంది. దీనివల్ల శరీరం ఈ పోషకాలను సులువుగా గ్రహిస్తుంది. ఫలితంగా మహిళల్లో రోగనిరోధకశక్తి, శక్తి స్థాయులు పెరుగుతాయి. జీవక్రియా రేటు మెరుగు పడుతుంది. ★ మొలకెత్తిన చిరుధాన్యాల్లో యాంటీ ఆక్సిడెంట్లు (ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్లు) అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గిస్తాయి. కొన్ని రకాల క్యాన్సర్ల నివారణలోనూ, ఈస్ట్రోజన్ స్థాయులను మార్పు చేయడంలోనూ సాయపడతాయి. మిల్లెట్ స్ప్రౌట్స్‌లో ఫోలెట్ పుష్కలంగా ఉంటుంది. గర్భస్థ శిశువు మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడుతుంది. అలానే మహిళల్లోని రక్తహీనతను నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు వీటిని ఎంత తీసుకుంటే అంత మేలు. వీటిలో లభించే పీచు జీర్ణవ్యవస్థ పనితీరును పెంచుతుంది. ★ మొలకల్లో జింక్, ఇనుము, కాల్షియం ఎక్కువగా లభిస్తాయి. ఇవన్నీ శరీరంలోని అన్ని అవయవాలకూ ఆక్సిజన్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తాయి. ముఖ్యంగా జింక్ సంతాన సాఫల్య సమస్యలను దూరం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ❑


# బ్యాక్టీరియా పొట్టలో చేరితే..

చిన్న వయస్సులో అనారోగ్యం ! చిన్న వయస్సులోనే బిపి, రక్తంలో కొవ్వులు, అధిక బరువు.. ఇలా రకరకాల అనారోగ్యాల బారినపడుతుంటారు. దీనికి గల కారణం.. జన్యు పరంగా సంక్రమించే వాళ్ల పొట్టలోని బ్యాక్టీరియానే అంటోంది యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ. ఇందుకోసం వీళ్ల రకరకాల వ్యాధులతో బాధపడుతోన్న వాళ్ల పొట్టలోని బ్యాక్టీరియాని పరిశీలించి చూశారట. వాళ్లలో అది ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన



సమ్మేళనంతో ఉందట. ముఖ్యంగా పద కొండు రకాల బ్యాక్టీరియా శాతంలోని హెచ్చు తగ్గుల కారణంగా శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, ఎగ్జిమా, బీపీ, కొవ్వు, అధిక బరువు... ఇలా 28 రకాల వ్యాధులు వస్తున్నట్లు గుర్తించారు. ఉదాహరణకు రుమినోకాకస్ బ్యాక్టీరియా అధికశాతంలో ఉంటే బీపీ పెరుగుతున్నట్లు తేలింది. దీని ఆధారంగా ఆ మైక్రోబయోమ్ సమ్మేళనంలో మార్పులు చేయగలగడం ద్వారా వ్యాధుల్ని నిరోధించగలిగేందుకు ప్రయత్నిస్తున్నారు సంబంధిత శాస్త్రనిపుణులు. ❑

## హార్డ్ మెలన్




కివానో గురించి ఎప్పుడైనా విన్నారా! దక్షిణాఫ్రికాకి చెందిన ఈ పండ్లను నమీబియా, బోత్స్వానా, జాంబియా, జింబాబ్వే, మొజాంబిక్, అంగోలా దేశాల్లోనూ పండిస్తున్నారు. ఇది దోస, కర్బూజా, పుచ్చ జాతులకు చెందినది. ముళ్లు కనుక ఉంటాయి 'హార్డ్ మెలన్', ఆఫ్రికన్ హార్డ్ కుకుంబర్ లాంటి పేర్లతోనూ పిలుస్తారు. నారింజ రంగులో ఉండే కివానో లోపల పసుపు రంగుల కలయికలా కనిపిస్తుంది. విత్తనాలు అచ్చం దోస గింజల్లానే ఉంటాయి. ఈ పండును అలాగే తినొచ్చు లేదంటే సలాడ్ చేసుకోవచ్చు. వీటిని కొన్ని అలంకరణల్లోనూ వాడతారు. విటమిన్లు, ఫొలెట్, కాల్షియం, కాపర్, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, భాస్వరం, జింక్లతో కివానో మంచి పోషకాహారం. ఇక రుచి గురించి చెప్పాలంటే అరటి, దోస, నిమ్మ, ప్యాషన్ ఫ్రూట్లను కలగలిపి తయారుచేశారా అన్నట్టుండి, ఆహా అనిపిస్తుంది. అందులో సివిటమిన్ మెండుగా ఉంటుందని దాన్ని కూడా తింటారు కొందరు.







# దీప కాంతుల విహంగాలు



దీపాలకు ఇంటికి సహజకాంతి ఎంత ముఖ్యమో, మనం ఎంచుకునే ఇండోర్ ల్యాంప్లూ అంతే ముఖ్యం. అందుకే, కాంతులిచ్చే దీపాల పైన మరింత శ్రద్ధ పెడుతున్నారు. అందులో భాగంగానే... 'బర్డ్ కేజ్ ల్యాంప్' ట్రెండ్ అవుతున్నప్పుడు. అటు వింటేజ్ లుక్తోపాటు, ఇటు ఆధునిక హంగులు ఉండటమూ దీనికి ఓ కారణం. రంగు రంగుల పక్షులు, సున్నితమైన వైర్‌వర్క్, డార్క్ పూర్తి ఫినిషింగ్‌తో ఉంటే ఈ పంజరపు దీపాలు... నోస్టాల్జియా ఫీలింగ్ తెస్తాయనడంలో సందేహం లేదు. అందుకే, పెండెంట్ లైట్లు, టేబుల్ ల్యాంపులు, షాండ్లియర్లు... ఇలా అనేక రూపాల్లో ఇంటింటికి భాగమవుతున్నాయి. బెడ్రూమ్, డైనింగ్ ఏరియా, లింగ్రూమ్... ఇలా ఎక్కడ ఉంచినా సరే, అక్కడి వాతావరణాన్ని ఇట్టే మార్చేస్తాయి. మీకూ నచ్చాయా? ఇంకేం, ఇంటీరియర్ డిజైన్‌లో క్రేజ్ ఉన్న ఈ కేజ్ ల్యాంపులను మీ ఇంట్లోకీ తెచ్చేయండి మరి...









త్రిమూర్తుల అంశ దత్తాత్రేయ

దత్తాత్రేయుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అంశలతో అవతారమెత్తిన దివ్యమూర్తి, ఆ స్వామి మేడి చెట్టు (ఔదుంబర్) నీడలో కొలువై ఉంటాడు. మూడు శిరస్సులు, ఆరు చేతులు కలిగిన దత్తాత్రేయుని భిక్షువు రూపం అహంకార నాశనానికి ప్రతీక సదా ఆయనను వెన్నంటి ఉండే గోవు ధరణికి, శునకాలు వేదాలకు ప్రతీకగా భావిస్తారు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మ పురాణం, రామాయణం, భారత, భాగవతాల్లో దత్తాత్రేయుని ప్రస్తావన ఉంది. ముఖ్యంగా శ్రీగురు చరిత్రలో దత్తాత్రేయుని అవతారాల గురించి వివరంగా లిఖితమైంది. ఆధ్యాత్మిక ప్రేరణ కల్గించే ఈ గ్రంథంలో దత్తాత్రేయుని గురుతత్వం, దైవత్వం, ఆధ్యాత్మిక బోధనలు ఉన్నాయి. దత్త జయంతిని పురస్కరించుకొని భక్తులు శ్రీ గురుచరిత్ర పారాయణ చేస్తారు. ఇలా చేయటం వల్ల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని భక్తుల విశ్వాసం. దత్తాత్రేయుడు తన ఆత్మనే గురువుగా భావించాడు తనకు ఎంతో కొంత జ్ఞానాన్ని ప్రసాదించిన 24 చరాచరాలను గురువులుగా భావించాడు. అవి 1. భూమి 2. జలం 3. అగ్ని 4. వాయువు 5. ఆకాశం 6. చంద్రుడు 7. సూర్యుడు 8. పావురం 9.

# త్రిమూర్తుల అంశ దత్తాత్రేయ



కొండచిలువ 10. తేనెటీగ 11, తేనెటీగల పెంపకందారుడు 12 గద్ద. 13. సముద్రం 14. చిమ్మట కీటకం 15 ఏనుగు 16. జింక 17. చేప 18. వేశ్య 19. శిశువు 20. కన్య 21. సర్పం 22 విలుకాడు 23 సాలీడు 24. గొంగళిపురుగు

దత్తాత్రేయుని ఆలయాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో దత్తాత్రేయుని ఆలయాలు ఉన్నాయి. పిఠాపురం, శ్రీశైలం, వారణాసి, మాహుర్, నరసింహవాడి గిరనార్, కారంజా ఔదుంబర్, గాణగాపూర్, కురువపురం మొదలైన ప్రముఖ దత్త క్షేత్రాలు, దత్తాత్రేయుని ఆలయాల్లో వినిపించే ఖిదిగంబరా దిగంబర శ్రీపాద వల్లభ దిగంబర మంత్రం భక్తుల హృదయాల్లో ప్రశాంతత ఆవరిస్తుంది. ❑

ఆధ్యాత్మికం


**ఎంతో ఖరీదైన పట్టు చీరలను మహిళలు కట్టుకోవటం కంటే అల్మారాల్లోనే ఎక్కువ రోజులు దాచుకుంటూ ఉంటారు.** ఏదో ఫంక్షన్‌కు కాసేపు కట్టుకుని మళ్లీ అల్మారాకే పరిమితం చేస్తారు. మరి అలాంటి పట్టుచీరలను పదేపదే ఉతకటం సాధ్యం కాదు. కాబట్టి... కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మనసుకు నచ్చిన చీరలను ఏళ్ల తరబడి పదిలంగా కాపాడుకోవచ్చు.

# పట్టు చీరల పదిలంగా ..

అదెలాగంటే...పట్టు చీరలను ఏళ్ల తరబడి పదిలంగా కాపాడుకోవాలంటే...

ఒకసారి వాడిన చీరను రెండు మూడు గంటలసేపు నీడలో గాలి తగిలేలా ఆరేయాలి. ఆ తరువాత పైట చెంగు లోపలివైపు వచ్చేలా మడతపెట్టాలి. పైటంచు భాగం లోపలివైపు ఉంటే మంచిది. పొడిగా ఉండే తెల్లటి కాటన్ లేదా మస్లిన్ వస్త్రంలో చుట్టి బీరువాలో పెట్టాలి.

పట్టుచీరలను మూడు నెలలకోసారి బయటకు తీసి కాసేపు నీడపట్టున ఆరేయాలి. ఆ తరువాత గతంలో వేసిన మడతను మార్చాలి. ఒకే మడతలో ఎక్కువ రోజులుంటే పోగులు తెగిపోవచ్చు. వీటిని డ్రైక్లీనింగ్‌కు ఇవ్వాలి. చీర మీద కాఫీ, టీ మరకలు పడితే అక్కడ రెండు చుక్కలు



షాంపూ వేసి చన్నీటితో శుభ్రం చేయాలి.

పట్టుచీరలను హ్యాంగర్‌లకూ తగిలించొచ్చు. కానీ హ్యాంగర్‌కు ఒక్క చీరే ఉండాలి. వేరే హ్యాంగర్లకు మధ్య దూరం ఉండేలా చూసుకోవాలి. స్టీలు/ ఇనుప హ్యాంగర్ల వల్ల చీరలపై మెటల్ మరకలు పడే ప్రమాదముంది కాబట్టి చెక్క హ్యాంగర్లనే వాడాలి. నాఫ్తలిన్ ఉండలను వేసి మూటకట్టి చీరల మధ్య పెడితే పురుగుల బెడద ఉండదు. మంచి పరిమళమూ వస్తుంది. అలాగే ఎండు వేపాకులను మూటకట్టి చీరల అడుగున పెట్టాలి. దీనివల్ల చిన్నచిన్న పురుగులు దరిచేరకుండా పట్టుచీరలకు చిల్లులు పడకుండా ఉంటాయి. ❑

# గుమ్మాడమ్మా గుమ్మడి !

గుమ్మడి గింజలను మిఠాయిల్లో వేస్తాం కానీ., విడిగా పెద్దగా తినం. నిజానికి ఇవి కూడా బాదం, జీడిపప్పుల్లానే బలాన్నిస్తాయి. వీటిలో భాస్వరం, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, జింక్, సోడియం, మాంగనీస్, కాపర్, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు ఉన్నాయి. గుమ్మడి గింజలు తినడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. రక్తపోటు క్రమబద్ధంగా ఉంటుంది. టైప్ 2 మధుమేహం నుంచి ఉపశమనం లభిస్తుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. ఊబకాయం రాదు. ఆరోగ్యంగా ఉంటాయి.



వీటిలోని పీచు జీర్ణప్రక్రియను మెరుగుపరిస్తే ట్రిప్టోఫాన్, అమినో యాసిడ్స్ చక్కగా నిద్రపట్టేలా చేస్తుంది. గుమ్మడి గింజలు రొమ్ము క్యాన్సర్ను నివారించడంలో తోడ్పడతాయి. ఎముకలు, దంతాలు దృఢంగా ఉంటాయి. వీటిలో ప్రొటీన్ల శాతం ఎక్కువగా ఉండటాన తగినంత మోతాదులోనే తినాలి. ఒక్కోసారి ఇవి గొంతులో అడ్డుపడి ఊపిరాడకుండా చేసే అవకాశం ఉంది. కనుక నెమ్మదిగా తినాలి. ఈ గింజలను పచ్చిగానూ తినొచ్చు, వేయించి తినొచ్చు. స్వీట్లు, కూరలు, సలాడ్స్, స్మూరీస్లో వేస్తే అదనపు రుచి, బలం. ❑

## వుషు వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో..

# అపర్ణ, కరీనా, శివానీలకు రజతాలు

### దహియాకు కాంస్యం




**న్యూఢిల్లీ:** వుషు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ అథ్లెట్లు అపర్ణ, కరీనా, శివానీలు రజత పతకాలు సాధించారు. పురుషుల 56 కేజీల సందా విభాగంలో సాగర్ దహియా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బ్రెజిల్‌లోని బ్రసిలియాలో జరిగిన 2025 ప్రపంచ వుషు ఛాంపియన్‌షిప్‌లో సాండా వర్గం నుండి భారత్ అద్భుతమైన ప్రదర్శనను కనబరిచి, నాలుగు పతకాలను గెలుచుకుంది. తొలిసారిగా, భారత్‌లో ముగ్గురు మహిళా సందా అథ్లెట్లు అపర్ణ (52 కిలోలు), కరీనా కౌశిక్ (60 కిలోలు), మరియు శివాని (75 కిలోలు) ఫైనల్స్‌కు చేరుకున్నారు. కానీ ఎవరూ బంగారు పతకాన్ని సాధించలేకపోయారు. అపర్ణ బంగారు పతక పోరులో వియత్నాంకు చెందిన న్గో థి ఫువాంగ్ న్గా చేతిలో ఓడిపోగా, కరీనా ఆసియా క్రీడల ఛాంపియన్ చైనాకు చెందిన జియావోయ్ వు చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోయింది. చివరి బంగారు పతక మ్యాచ్‌లో, ఇరాన్‌కు చెందిన షర్బానో మన్సౌరియన్ షెమిరోమిపై శివానీకి ఎటువంటి అవకాశం రాలేదు. మన్సౌరియన్ మొత్తం బౌట్‌లో ఆధిపత్యం చెలాయించగా, శివానీ ఒక్క కిక్ కూడా వదలలేదు. అలాగే పురుషుల విభాగంలోపతక పోటీలకు చేరుకున్న ఏకైక అథ్లెట్ భారత్‌కు చెందిన సాగర్ దహియా (56 కిలోలు) విక్రాంత్ బలియాన్ (75 కిలోలు) తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో చైనా అథ్లెట్ చేతిలో ఓడిపోయాడు. క్రిగిజ్, దక్షి ణ కొరియా అథ్లెట్లపై వరుసగా రెండు విజయాలు సాధించిన తర్వాత సాగర్ తన పతకాన్ని నిర్ధారించుకున్నాడు. కానీ తన పరుగును పొడిగించలేక ఫిలిప్పీన్స్‌కు చెందిన కార్లోస్ బేలోస్ జూనియర్ చేతిలో 0–2 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు.

## ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్..

# భారత్‌కు తొలిసారి స్వర్ణం

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తొలిసారిగా పురుషుల కాంపౌండ్ టీమ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అయితే మిక్స్‌డ్ కాంపౌండ్ జట్టు ఫైనల్‌లో ఓటమిని ఎదుర్కొని, రజత పతకంతో సరిపెట్టుకుంది. దక్షి ణ కొరియాలోని గ్వాంగ్జులో ఆదివారం జరిగిన ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల కాంపౌండ్ జట్టు తొలి బంగారు పతకాన్ని సాధించింది. రిషబ్ యాదవ్, అమన్ సైని మరియు ప్రథమేష్ ఫుగే త్రయం చివరి సెట్‌లో ఫ్రెంచ్ జట్టును ఓడించి 235–233 తేడాతో బంగారు పతక పోరును గెలుచుకుంది. మూడు సెట్ల ముగింపులో రెండు జట్లు 176–176తో సమంగా ఉన్నాయి. కానీ భారత్ నుండి వచ్చిన 59 పరుగుల అద్భుతమైన సెట్ ఫ్రెంచ్ జట్టుపై ఒత్తిడిని పెంచింది. చివరికి వారు 57 పరుగులు చేసి, టోర్నమెంట్‌లో భారత్‌కు మొదటి స్వర్ణాన్ని అందించారు. కాగా మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ ఫైనల్ తర్వాత ఈ రోజు భారతదేశం బంగారు పతకం సాధించిన రెండవ మ్యాచ్ ఇది. ఈ మ్యాచ్‌లో రిషబ్ యాదవ్ మరియు జ్యోతి సురేఖ వెన్నం జోడీ నెదర్లాండ్స్ చేతిలో ఓడిపోయింది.



ఈ జంట తొలి సెట్‌లో ఆధిక్యంతో మ్యాచ్‌ను ప్రారంభించారు, కానీ తర్వాత 37 పాయింట్ల సబ్‌పార్ సెట్ నెదర్లాండ్స్‌కు మ్యాచ్‌లో ఆధిక్యాన్ని ఇచ్చి రజతంతో సరిపెట్టుకుంది.

# యుఎస్ ఓపెన్ క్వీన్‌గా సబలెంకా

### అమండాను ఓడించి టైటిల్ కైవసం



**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్ క్వీన్‌గా అరినా సబలెంకా కిరీటాన్ని దక్కించుకుంది. అమండా అనిసిమోవాను 6–3, 7–6(3) తేడాతో ఓడించి వరుసగా రెండో యుఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుంది. ప్రపంచ టాప్ ప్లేయర్‌గా తన హోదాను పదిలం చేసుకుంది. ఈ విజయంతో, 2014లో సెరెనా విలియమ్స్ తర్వాత ఫ్లషింగ్ మెడోస్‌లో తన సింగిల్స్ కిరీటాన్ని నిలబెట్టుకున్న మొదటి మహిళగా సబలెంకా నిలిచింది. టాప్ సీడ్, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఈమె ఎనిమిదో సీడ్ అమెరికన్ క్రీడాకారిణిపై శక్తివంతమైన ప్రదర్శన ఇచ్చింది. 2025 సీజన్‌లో ఆమె మొదటి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను, ఆమె కెరీర్‌లో నాల్గవ ప్రధాన ట్రోఫీని గెలుచుకుంది. ఇది ఆమె కెరీర్‌లో 100వ గ్రాండ్ స్లామ్ మెయిన్ డ్రా విజయాన్ని, సీజన్‌లో 56వ విజయాన్ని కూడా నమోదు చేసింది. కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్, రోలాండ్ గారోస్ రెండింటిలోనూ సబలెంకా ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ రెండు సందర్భాలలోనూ విఫలమైంది. ఆమె తన రెండవ వరుస గ్రాండ్ స్లామ్ ఫైనల్‌కు చేరుకున్న అనిసిమోవాను అద్భుత ప్రదర్శనతో అధిగమించి టైటిల్ సాధించింది. తొలి సెట్‌లో ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఐదు సర్వీస్ బ్రేక్‌లు జరిగాయి, చివరికి సబలెంకా పైచేయి సాధించింది. ఆమె అనిసిమోవాను మూడోసారి బ్రేక్ చేసి 5–3తో ఆధిక్యంలోకి వెళ్ళింది. తర్వాత అనిసిమోవా ఫోర్‌హ్యాండ్ వైడ్‌ను కోల్పోవడంతో సెట్‌ను ముగించింది. రెండవ సెట్‌లో, సబలెంకా 5–4తో సర్వ్ చేస్తూ మ్యాచ్‌ను ముగించే స్థితిలో ఉన్నట్లు కనిపించింది. కానీ 30 ఆల్ వద్ద ఓవర్‌హెడ్ మిస్ అవ్వడంతో అనిసిమోవా తిరిగి బ్రేక్ అప్ అయ్యి సెట్‌ను టైబ్రేక్‌కు నెట్టింది. అయితే, సబలెంకా ప్రారంభం నుండే టైబ్రేక్‌ను నియంత్రించి, తన మూడవ ఛాంపియన్‌షిప్ పాయింట్‌పై విజయాన్ని నమోదు చేసుకుంది.




# ఆసియా కప్ మూడోసారి టి20 ఫార్మాట్

### ఫస్ట్‌టైమ్ భారత్ విక్టరీ.. రెండో టోర్నీ శ్రీలంక కైవసం

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025కు కౌంటౌన్ స్టార్ట్ అయింది. యూఏఈ వేదికగా మరో 24 గంటల్లో ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు కప్పు కోసం పోటీపడనున్నాయి. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనుండడంతో ఈ సారి ఆసియా కప్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే టీ20 ఫార్మాట్‌లో ఆసియా కప్‌ను నిర్వహించడం ఇది మూడోసారి మాత్రమే. ఇప్పటి వరకూ టీ20 ఫార్మాట్‌లో 2016, 2022లో ఆసియా కప్‌ను నిర్వహించారు. ఆసియా కప్ 2016కు బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇవ్వగా, ఆసియా కప్ 2022కు యూఏఈ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సారి కూడా యూఏఈనే ఆతిథ్యం ఇస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు రెండు సార్లు టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఆసియాకప్ టోర్నీని టీమిండియా, శ్రీలంక కైవసం చేసుకున్నాయి. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని నాయకత్వంలో భారత్ ఆసియాకప్ 2016లో బరిలోకి దిగింది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఆ తరువాత పాకిస్థాన్‌పై విజయం సాధించింది. అనంతరం శ్రీలంక, యూఏఈ లపై విజయాలు సాధించి ఫైనల్‌కు చేరుకుంది. భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 5 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. ఆ తరువాత శిఖర్ ధావన్ (60), విరాట్ కోహ్లీ (41 నాటౌట్), ఎంఎస్ ధోని (20 నాటౌట్) లు రాణించడంతో లక్ష్యాన్ని 13.5 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. చివరిసారి టీ20 ఫార్మాట్‌లో నిర్వహించిన ఆసియా కప్ 2022ను శ్రీలంక జట్టు గెలుచుకుంది. ఈ మెగా టోర్నీలో శ్రీలంక అసాధారణంగా ఆడింది. సూపర్ ఫోర్‌లో భారత్‌ను ఓడించిన లంక జట్టు ఫైనల్‌లో పాక్‌తో తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన లంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. 171 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 147 పరుగులకే పరిమితమైంది. దీంతో లంక జట్టు 23 పరుగుల తేడాతో గెలుపొందింది. మరి తాజాగా ముచ్చటగా మూడోసారి టీ20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఆసియా కప్‌ను ఏ జట్టు కైవసం చేసుకుంటుందనేది ఆసక్తికరమైంది.

# గ్రాండ్ స్విస్‌లో వైశాలి మూడో విక్టరీ

ఆట

**న్యూఢిల్లీ:** గ్రాండ్ స్విస్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి దూసుకెళుతూ ఏకైక ఆధిక్యంలో ఉంది. ఇక డి గుకేశ్, ఆర్ ప్రజ్ఞానంద, ఎరిగైసి అర్జున్ ఓపెన్ కేటగిరీలో మూడో రౌండ్ గెలిచిన తర్వాత రెండో స్థానంలో నిలిచారు. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్కండ్‌లో జరిగిన ఈ టోర్నీలో వరుసగా మూడో విజయంతో డిఫెండింగ్ ఛాంపియన్, గ్రాండ్ మాస్టర్ రమేష్‌బాబు వైశాలి 2025 గ్రాండ్ స్విస్ టోర్నమెంట్‌లో తన ఘన విజయాన్ని కొనసాగించింది. వైశాలి 37మూవ్‌ల గేమ్‌లో ఆస్ట్రియాకు చెందిన ఓల్గా బాడెల్కాను ఓడించింది. ఇక ఓపెన్ కేటగిరీలో గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్ టోర్నమెంట్‌లో 2.5 పాయింట్లతో సంయుక్తంగా 2వ స్థానానికి చేరుకున్నారు. వారు ప్రస్తుత నాయకుడు పర్హామ్ మాగ్సూద్లూ కంటే కేవలం అర పాయింట్ వెనుకబడి ఉన్నారు. ప్రజ్ఞానంద, గుకేష్ ఇద్దరూ ఇజ్రాయెల్‌కు చెందిన బోరిస్ గెల్ఫాండ్, స్పెయిన్‌కు చెందిన డేనియల్ యుఫాపై వరుసగా బ్లాక్ పావులతో విజయం సాధించారు. అలాగే అర్జున్ స్లోవేనియన్ గ్రాండ్‌మాస్టర్ ఆంటోన్ డెమ్‌చెంకో యొక్క పెట్రోవ్ డిఫెన్స్‌ను అధిగమించి తెల్లటి పావులతో 65మూవ్‌ల మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ విదిత్, నిహాల్ సరిన్ మూడవ రౌండ్‌లో డ్రాగా ఆడి, మూడు ఆటలలో 2 పాయింట్లతో టాప్ 30 వెలుపల స్థానాల్లో మరింత దిగజారారు. మహిళల విభాగంలో, హారిక ద్రోణవల్లి వరుసగా మూడో డ్రా ఆడగా, వంతిక అగర్వాల్ మూడో రౌండ్‌లో టోర్నమెంట్‌లో తొలి ఓటమిని ఎదుర్కొంది.



## వాణిజ్యం

# రూ.1.08 లక్షలకు చేరిన తులం బంగారం

### వెండికూడా అదే దారి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6:** బంగారం ధరలు రోజురోజుకూ దూసుకుపోతున్నాయి. ఇప్పటికే లక్ష రూపాయల పైకి చేరుకున్న పుత్తడి రోజుకొక గరిష్ఠ స్థాయిని తాకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ ఉండటంతోపాటు దేశీయంగా పండుగ సీజన్ కూడా తోడవడంతో పుత్తడి పరుగు పందెంలో విజేతగా నిలుస్తున్నది. ప్రస్తుతం రూ.1.08 లక్షల స్థాయిలో కదలాడుతున్న గోల్డ్ ధర త్వరలో రూ.1.10 లక్షలు అధిగమించే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు చెబుతున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ తులం ధర రూ.850 అధికమై రూ.1,08,620కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.800 పెరిగి రూ.99,600 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.870 అధికమై రూ.1,08,490 పలికింది. అంతకుముందు ఇది రూ.1,07,620గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ తులం ధర రూ.800 ఎగబాకి రూ.98,650 నుంచి రూ.99,450 పలికింది. మొత్తం మీద గడిచిన నెల రోజుల్లో గోల్డ్ ధర రూ.7,500 ఎగబాకినట్టు అయింది. వచ్చే రెండువారాల్లో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. బంగారంతోపాటు వెండి పరుగులుతీస్తోంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. ఇదే క్రమంలో వారాంతంలో కిలో ధర మరో రూ.2 వేలు ఎగబాకి రూ.1,38,000కి చేరుకున్నది. రిటైల్ మార్కెట్‌తోపాటు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లోనూ పుత్తడి రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. ఈ నెల మొదటి నుంచి ఇప్పటివరకు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లో తులం ధర రూ.3 వేలు ఎగబాకి రూ.1,06,856కి చేరుకున్నది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గినప్పటికీ ధరలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావచ్చునని వర్తకులు హెచ్చరిస్తున్నారు.



# విదేశీ కరెన్సీ ఖజానా కళకళ

**ముంబయి, సెప్టెంబరు 7:** గతమాసాంతంలో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.36కు చేరుకోవడంతో ఫారెక్స్ నిల్వలు అనుకోకుండా 3.51 బిలియన్ డాలర్లుపెరిగి మొత్తం 694.2 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్బీఐ ప్రకటించింది. అంతకుముందువారంలో అంటే ఆగస్టు 22వ తేదీ వారంలో అయితే 4.38 బిలియన్ డాలర్లు తగ్గి 690.72 బిలియన్ డాలర్లకు మాత్రమే ఉన్నాయి. గడచిన వారంలో పెరుగుదలకు కారణం విదేశీ కరెన్సీ ఆస్తుల పెరుగుదలేనని చెప్పాలి. అంతేకాకుండా బంగారం నిల్వలు, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ వంటివి కీలకమని ఆర్బీఐ అంచనావేసింది. దలాల్‌స్ట్రీట్ ఇటీవలిపరిణామాలతో ఇప్పటికీ స్థిరపడలేదనే అంచనా. దీనికితోడు డాలరుతో రూపాయి మారకం విలువలుకూడా 11 పైసలు క్షీణించి 88.32గానే నిలిచింది. దీనితో ఆర్బీఐ జోక్యంచేసుకుని రూపాయి క్షీణతను కొంతమేర కట్టడిచేసింది. ఇక ఆగస్టు 29 నాటికి విదేశీ కరెన్సీ ఆస్తులు 1.68 బిలియన్ డాలర్లుపెరిగి 583.94 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ వంటి వాటి మారకం విలువలు కూడా ఈ రిజర్వుల్లో చేరతాయి. ఇక బంగారం నిల్వలవరకూ వస్తే 1.76 బిలియన్ డాలర్లు పెరిగి మొత్తం 86.76 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇక ఎస్‌డిఆర్‌లు అయితే గతవారంలో 40 మిలియన్ డాలర్లుపెరిగి మొత్తంగా 18.77 బిలియన్ డాలర్లకు చేరాయి. దీనితో భారత్‌లోని విదేశీ కరెన్సీ నిల్వల స్థితి చెప్పుకోదగినంతగా మారింది.

# ఈ స్మాల్‌క్యాప్‌ఫండ్‌లో భారీ రిటర్నులే!



**ముంబయి, సెప్టెంబరు 7:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో హైరిటర్న్లు వస్తాయన్న వాదనను చాలా ఫండ్స్ నిరూపించాయి. లాంగ్ టర్మ్‌లో కొన్ని మంచి రాబడులు అందిస్తుంటే కొన్ని మాత్రం చాలా తక్కువ సమయంలోనే ఊహించనిదాని కంటే ఎక్కువ రాబడులు ఇస్తుంటాయి. అలాంటి 202 ఫండ్స్‌ను పరిశీలించి హైరిటర్న్లు ఇచ్చిన 6 మ్యూచువల్ ఫండ్స్ ఈకేటగిరీలో ఉన్నాయి. గడిచిన 5 సంవత్సరాల కాలంలో ఈ స్కీమ్స్ లంప్‌సమ్ పెట్టుబడులపై సగటున వార్షిక రాబడి 30 శాతం మేర అందించాయి. మొత్తం ఆరు పథకాల్లో 5 స్కీమ్స్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌కి సంబంధించినవే. ఇక అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల విషయానికి వస్తే ఆరు వేరు వేరు ఏఎంసీల నుంచి మార్కెట్లోకి లాంచ్ అయ్యాయి. ఈ ఆరింట్లో అత్యధిక రాబడులు ఇచ్చిన స్కీమ్‌గా క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ నిలిచింది. ఈ స్కీమ్ గత 5 సంవత్సరాల కాలంలో వార్షిక రాబడి రేటు 34.98 శాతంగా ఉంది. దీని ప్రకారం లక్ష రూపాయలు లంప్ సమ్ పెట్టుబడి పెట్టి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.4.48 లక్షలు అవుతుంది. ఆ తర్వాతి స్థానంలో మోతీలాల్ ఓస్వాల్ మిడ్ క్యాప్ ఫండ్ నిలిచింది. ఈ స్కీమ్ గత 5 సంవత్సరాల కాలంలో లంప్‌సమ్ పెట్టుబడి రాబడి 33.6 శాతం చొప్పున అందించింది. ఇందులో ఐదేళ్ల క్రితం లక్ష పెట్టి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.4.25 లక్షలు అవుతుంది. ఇక మూడో స్థానంలో నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ ఉంది. ఈ స్కీమ్ లంప్ సమ్ రాబడి 5 ఏళ్లలో సీఏజీ ఆర్ రేటు 32.5 శాతంగా ఉంది. లక్ష రూపాయల పెట్టుబడిని 5 ఏళ్లలో రూ.4.08 లక్షలు చేసింది. ఇక బంధన్ స్మాల్ క్యాప్ ఫండ్ గత 5 ఏళ్లలో లంప్ సమ్ రాబడులు 30.68 శాతంగా అందించింది. ఇందులో లక్ష రూపాయలు పెట్టి ఇప్పటి వరకు కొనసాగితే ఆ విలువ రూ.3.81 లక్షలు అయ్యేది. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చిన ప్రముఖ ఈక్విటీ స్కీమ్ హెచ్‌డీఎఫ్‌సీ స్మాల్ క్యాప్ ఫండ్ సైతం అదరగొట్టింది. గడిచిన 5 సంవత్సరాల రాబడి చూస్తే లంప్ సమ్ పెట్టుబడులై సగటున వార్షిక రాబడి రేటు 30.41 శాతంగా అందించింది. లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.3.77 లక్షల వరకు అవుతుంది. పెట్టుబడి లక్షకు రూ.2.77 లక్షలు వడ్డీ రూపంలోనే లభించినట్లయింది. ఆ తర్వాత హెచ్‌ఎస్‌బీసీ స్మాల్ క్యాప్ ఫండ్ సగటు వార్షిక రాబడి 30.06 శాతంగా ఉంది. లక్ష రూపాయల లంప్ సమ్ పెట్టుబడి రూ.3.72 లక్షలు అవుతుంది.




## ఫండ్స్, మార్కెట్ సంస్థలపై


# సెబీ ఫోకస్

### 12న బోర్డు డైరెక్టర్ల సమావేశంలో సమీక్ష

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** మూచువల్‌ఫండ్స్, మార్కెట్ మౌలికవనరుల సంస్థలకు సంబంధించి సెబీ కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఈనెల 12వ తేదీ జరిగే బోర్డు సమావేశంలోనే ఈకీలక ప్రతిపాదనలపై చర్చలుజరిపి ఆమోదిస్తారని అంచనా. సుదీర్ఘకాలంగా మార్కెట్‌మౌలికసదుపాయాల సంస్థల పనితీరును మరింతపటిష్టంచేయాలన్న ఆలోచన ఉంది. కీలకమైన విభాగాలకు నేతృత్వం వహించేందుకు పాలకబోర్డులోపనిచేసేందుకు ఇద్దరు స్వతంత్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తప్పనిసరి నియామకం ఉంటుంది. ఇక జాతీయ సంక్లిష్ట సమాచార మౌలికవనరులపరిరక్షణ కేంద్రాలు (ఎన్‌సిఐఐపిసి) మార్గదర్శకాలకు అనుగుణంగా మార్కెట్ మౌలికవనరుల కేంద్రాల్లో ఎండిలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కీలక సాంకేతిక అధికారుల పాత్రలు బాధ్యతలకు కొన్ని కఠిన నిబంధనలు అమలులోకి తీసుకురావాలని సెబీ యోచిస్తోంది. ఇందుకు సంబంధించి నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌షిప్‌లకు కొన్ని పరిమిత మినహాయింపులు అనుమతించబడతాయని అంచనా. ఎంఐఐలనుంచి ఎఎంసిలవరకూ సవరణలతోపాటు కొన్ని సడలింపులతో కూడిన నిబంధనలు అమలుకు తీసుకురావాలని చెపుతున్నారు. కొన్ని స్పష్టమైన క్లయింట్‌లకు ఒకే పాన్‌కు లింక్‌చేసిన బహుళ క్లయింట్‌కోడ్‌లను కూడా అనుమతించాలన్న ప్రతిపాదనలు కూడా బోర్డులో చర్చించనున్నారు.

# ఈ వారంలో మార్కెట్‌కు పదికంపెనీల ఐపిఓలు

**ముంబయి, సెప్టెంబరు 7:** స్టాక్ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. లిస్టింగ్ గెయిన్స్ కోసం చూస్తున్న మార్కెట్ ఇన్వెస్టర్లకు దసరా ముందే వచ్చినట్లుగా ఉంది. ఈ వారంలో ఏకంగా 10 కంపెనీల ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్ కోసం వస్తున్నాయి. ఇందులో మూడు మెయిన్ బోర్డ్ కంపెనీలు ఉండగా, ఏడు ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి వస్తున్నాయి. మెయిన్ బోర్డు విభాగంలో చూసుకుంటే శ్రింగర్ హౌస్ ఆఫ్ మగళసూత్ర ఐపీఓ, దేవ్ యాక్సిలరేటర్ ఐపీఓ, అర్బన్ కంపెనీ ఐపీఓలు ఉన్నాయి. ఈ కంపెనీలపై ఇన్వెస్టర్లు ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొత్త ఐపీఓలతో పాటు మరో 8 కంపెనీల ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్ ముగించుకుని ఈ వారమే మార్కెట్లలోలిస్టవుతున్నాయి. మెయిన్ బోర్డ్ ఐపీఓల్లో శ్రీంగర్ హౌస్ ఆఫ్ మంగళసూత్ర కంపెనీ మెయిన్ బోర్డు నుంచి వస్తోన్న ఐపీఓ. ఈ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10వ తేదీన మొదలవుతోంది. సెప్టెంబర్ 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.155 నుంచి రూ.165 మధ్య నిర్ణయించారు. దేవ్ యాక్సిలరేటర్ కంపెనీ ఐపీ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ ఐపీఓలో షేర్ల ధర ఒక్కొక్కటి రూ.56 రూ.61గా నిర్ణయించారు. అర్బన్ కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సైతం సెప్టెంబర్ 10వ తేదీన మొదలై 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఒక్కో షేరుకు రూ.98 నుంచి రూ.103 మధ్య ధర నిర్ణయించారు. స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సెగ్మెంట్ నుంచి 7 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. ఈ జాబితాలో కృపాలు మెటల్స్, నిలాచల్ కార్బో మెటాలిక్స్ కంపెనీల సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 8వ తేదీన మొదలవుతోంది. అలాగే కార్బన్ స్టీల్ ఇంజినీరింగ్, తౌరియాన్ ఎంపీఎస్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 9వ తేదీతో మొదలవుతోంది. జయ్ అంబే సూపర్ మార్కెట్స్, ఎయిర్ ఫ్లో రైల్ టెక్నాలజీ, ఎల్ టీ ఎలవేటర్ కంపెనీల సబ్‌స్క్రిప్షన్ 10వ తేదీ నుంచి మొదలవుతుంది. మెయిన్ బోర్డు పబ్లిక్ ఇష్యూలో అమంత హెల్త్ కేర్ ఐపీఓ సెప్టెంబర్ 9వ తేదీన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టింగ్ కానుంది.




# స్టాక్ విభజించిన స్మాల్‌క్యాప్ సెక్టార్ రోలెక్స్ రింగ్స్

**ముంబయి, సెప్టెంబరు 7:** స్మాల్ క్యాప్ కేటగిరిలోని ఆటో యాన్సిలరీస్ సెక్టార్ స్టాక్ రోలెక్స్ రింగ్స్ లిమిటెడ్ కొన్న వారికి బంపర్ ఆఫర్ వచ్చింది. తమ షేర్ హోల్డర్లకు రోలెక్స్ రింగ్స్ కంపెనీ బోర్డు ఇటీవలే సమావేశమై స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. దీంతో 1 షేరు కొనుగోలు చేసి ఉంటే వారికి 10 షేర్లు ఖాతాలోకి వస్తాయి. ఈ స్టాక్ స్ప్లిట్ తర్వాత స్టాక్ ధర ప్రస్తుతం రూ. 1390 నుంచి రూ. 139 స్థాయికి పడిపోనుంది. కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల భేటీలో 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు ఆమోదం లభించింది. అంటే ప్రస్తుతం రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న ఒక షేరుని రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండేలా 10 షేర్లుగా విభజిస్తారు. ఈ స్టాక్ స్ప్లిట్‌లో అర్హత సాధించేందుకు షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు డేట్ త్వరలోనే వెల్లడిస్తామని కంపెనీ తెలిపింది. ఆలోపు షేర్లు కొన్న వారికి అర్హత లభిస్తుంది. 1 షేరు ఉంటే 10, 10 షేర్లు ఉంటే 100 షేర్లు ఖాతాలో జమ చేస్తారు. అయితే, అదే స్థాయిలో స్టాక్ ధర తగ్గుతుంది. ప్రస్తుతం రు.1390 వద్ద ఉండగా స్టాక్ స్ప్లిట్ అనతరం రూ.139 స్థాయికి తగ్గుతుంది. అయితే, పెట్టుబడి విలువ మాత్రం తగ్గదు. శుక్రవారంతో ముగిసిన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో రోలెక్స్ రింగ్స్ షేరు సుమారు 0.007 శాతం నష్టపోయి రూ. 1390 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 2794, కనిష్ఠ ధర రూ. 1210.40 వద్ద ఉన్నాయి. గత వారంలో ఈ షేరు 4 శాతం నష్టపోయింది. గత నెల రోజుల్లో ఈ షేరు సుమారు 1 శాతం లాభాన్ని ఇచ్చింది గత ఆరు నెలల్లో 3 శాతం పడిపోయింది. గత ఏడాది కాలంలో 44 శాతం నష్టాన్ని మిగిల్చింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.